
ఆంధ్రమహిళ

ane-May-1956-13-5


మే 4 తేది
విడుదల
రాజశ్రీ వారి
జయం మనదే
నిర్మాత
సుందర్‌లాల్ నహాతా....
దర్శకుడు
టి.యస్. ప్రకాశరావు
BHARAT STUDIO

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: మే '56 :: సంచిక 5

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్



విషయ సూచిక

సంపాదకీయం

రాజకీయాలు ... శ్రీ జె. వి. రాధాకృష్ణయ్య.

బుద్ధుని భూతదయా పరత .... శ్రీ ఆకుండి వేంకటశాస్త్రి.

ధర్మమయి ... శ్రీమతి రామ పూర్ణావతి.

హంస రక్షణము .... శ్రీ. చదలవాడ కోటినరసింహము.

బౌద్ధ తేజములు ... శ్రీ జూలూరి హనుమంతరావు.

మార్జాలమూషిక సంవాదము .... "సుభాషిణి"

సుమతీ! .... శ్రీమతులు చదలవాడ సోదరీ కవయిత్రులు.

తెలుగు కవితలోని జాతీయత .... శ్రీ దాసరి వేంకటకృష్ణయ్య.

బృహత్కథ ... శ్రీ ధవళ నాగేశ్వర్.

చిగురించిన ఆశలు .... శ్రీ ద్వారకా జవహర్.

వసంతఋతువు ... శ్రీమతి ఎస్. బాల.

స్త్రీమూర్తి .... శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి.

స్త్రీ జన్మ ... శ్రీమతి కే. శ్యామలాదేవి.

సంక్షేమం

గుబ్బా.

గర్భవతుల ఆహార విధానం. .... శ్రీమతి సూరజిత్ మలహన్.

గ్రామీణ భారతసందర్శనం ... శ్రీ మేరీ ఐ. డెన్ హేమ్.

శ్రీమతి కమలాదేవి.

శబరి .... శ్రీ యస్వీ జోగారావు.

దైవా దీనం ... శ్రీమతి దీదువాని బదరీనారాయణమ్మ.

ఇంకా : పాడి పంటలు, దీనిభావమేమి వగైరా.

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: మే 56 :: సంచిక 5

ఇల్లు కట్టిచూడు - పెళ్లి చేసిచూడు

పెళ్ళిళ్ళ ముహూర్తముల కాలము దగ్గరకి రావటముతో చాలా మందికి పెళ్ళిచేసి చూడు అనే మాటలలో సత్యము కొంతగాకపోతే కొంతైనా అవగాహన అవుతూనేవుంది. అట్లాగే ఇల్లు కట్టి చూడు అన్న మాటలలోని సత్యము ఆంధ్ర రాష్ట్ర రాజకీయ నాయకుల కిప్పటికి విదితమైనదనే చెప్పవచ్చు. లక్షలకు లక్షలు విత్తము ఖర్చుచేసి మన రాష్ట్ర రాజధానిలో కట్టిన భవనములు బీటలు పోవటమూ, దానిపై జరిగిన వాదోపవాదములూ ఆంధ్ర ప్రజానీక మింకా మరువలేదు. కాని ఇంతలోనే మళ్ళీ రాజధాని మార్పుతో ఇళ్ళ కొరత ఒక సమస్యగా పరిణమించింది. ఏ పట్టణము మనకు రాజధానిగా నిర్ణయింపబడుతుందో ఆపట్టణములోనే రాష్ట్ర రాజ్యాంగ కార్యాలయములన్నియునూ, హైకోర్టు వగైరాలున్నూ ఉండుట వాంఛనీయము. కాని యిట్టివాంఛనీయమూ శ్రేయస్కరమూ అయిన కార్యమునకు సైతము రెండు విషయాలు అవరోధాలుగా ఏర్పడినవి. ఒకటి ఇళ్ళ కొరత, రెండవది ఒకరిమీద మరియొకరికి గల అపనమ్మకము. ఈ వూరికి ఆవూ రెంతదూరమో ఆవూరికి ఈవూరూ అంతే దూరముకదా ! హైదరాబాదులో ఇళ్ళ కొరత తీరాలి. తప్పదు. మన రాష్ట్ర రాజకీయ నాటకానికి ఇది నాంది.

లక్షలకొలది పైకము వెచ్చించి గడించిన అనుభవాన్ని ఉపయోగించుకొని వెంటనే రాజధానిలో అన్ని కార్యాలయముల సిబ్బందికి వలయు గృహములు ఏర్పాటు చేయుట చాల అవసరము. వెంటనే అట్టి ఏర్పాట్లు ప్రారంభించవలసియున్నది. సరియైన స్థానములో అనుకూలమైన పరిసరాల్లో సంసారి సంసారము సాగిస్తున్నప్పుడే తన ధర్మములన్నీ నిశ్చింతగా నిర్వహించుటకు అవకాశముండును. కావున వెంటనే ఆంధ్ర తెలంగాణా అధినేతలు అట్టి ఏర్పాట్లు చేయవలసియున్నది. ఆంధ్ర రాష్ట్రము ఆంగ్ల అకారాది క్రమముచేతనే ప్రథమ రాష్ట్ర స్థానములో యుండుటగాక సర్వవిధాలా భారతదేశములో ప్రప్రథమ స్థానము వహించి స్థిరముగా యుండగలదని ఆశించవచ్చును.

ఇళ్ళు కట్టిచూచే పని కర్నూలులో ముగిసినది. తరువాత చెయ్యవలసినది హైదరాబాదులో చక్కగా కట్టి చూపించుటే.

వ్యాసములు సకాలములో అందకపోవుటచే ప్రత్యేక బుద్ధ సంచికకు వలనుపడలేదు.

ఇంకా కొన్ని వ్యాసములు రాబోవు సంచికలో ప్రచురించగలము —సం.

కీ॥ శే॥ నాగ్వేరరావు పంతులు గారు

దేశోద్ధారక కీ॥ శే॥ శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు శివైక్యం పొంది ఇప్పటికి పద్ధెనిమిది సంవత్సరాలైనది.

ఆంధ్ర నాయకమణి అయిన వారిని సంస్మరించుట మన కర్తవ్యం. కవి, పండితులకు పెన్నిధియై, విద్యార్థులకు సంఘ సంస్కరణ సంస్థలకు ప్రాపై ప్రతి ఉద్యమానికి జీవగఱ్ఱయై సర్వ మానవ శ్రేయస్కామి యగుటయేగాక వారు ప్రత్యేకముగా శైవాగమముల యందు అత్యంత ప్రవేశము కలిగి, శివారాధనపరుడై భక్తిమార్గమున నడచుచూ నిష్కళంకజీవితము గడపినవారు.

భగవద్గీత యందలి రహస్యమును కూలంకషంగా అర్థంచేసుకుని, వారు రచించిన భగవద్గీత తెలుగున వెలువడిన అన్నిటికంటె మిన్నయని చెప్పక తప్పదు.

శివైక్యం పొందిన వారి ఆత్మ ధన్యమైనది.

సోదర హృదయము

"వనమయూరి"

నీ నా నాడులలోని రక్తమొకటై
నిత్యమ్ము నుప్పొంగగా
స్థానం బున్నదె లేశమాత్ర మయినన్
స్వాంతంబులో స్పర్థకున్ ?
ఆనందార్థమె యేకసూత్రమున
నిష్టార్థమ్ము సంధింపగా
నా నీ భేద మదెట్లు కల్గగల
దన్నా, ప్రేమవారాశిలోన్ !

నా శరీరంపు రుధిర మానంద గరిమ
పొంగగా నీదురక్త ముప్పొంగు గాదె !
తెలియకే క్రుంగి పోదు నే చెలిమిబలమె
వంత కల్గిన నీవు నాకంత యైన !

అణువునం దంతర మ్మెన్ని యరయలేని
యీ మహా బాంధవం బెంత కోమలంబొ !

మధురమై మంజులం బయి మానసముల
నార్ద్ర మొనరించు నవనీత మట్లు సతము.

ఎక్కువ తక్కువన్ విషయ
మించుక యైన నెరుంగలేని యీ
చక్కని రాగ బంధమున
సర్వజగమ్ములం నేక రూపమై
చిక్కని దివ్యదీధితులు చిమ్మ
సుధారసపూర్ణమైన నీ
వాక్కులలోన నీశ్వరునివాణి
ధ్వనించును సుమ్మ సోదరా !

విశ్వ జననీ కృపారస వీక్షణమున
ప్రాక్తన భవంపు పుణ్య ప్రభావమునను
బుధిచే పొందదగు తమశ్శుద్ధివలన
పోల్చుకొందును నీపరిపూర్ణమతిని !

విజయము

డిసెంబరు 1955 లో గవర్నమెంటు టెక్నికల్ పరీక్షలకు వెళ్ళిన ఆంధ్ర మహిళాసభ పారిశ్రామిక విద్యాలయపు విద్యార్థినుల పరీక్షా ఫలితములు ప్రకటితమైనవి. విజయము పొందినవారి పేర్లు యిందు ప్రకటించుచున్నాము.

కుట్టుపని హయ్యర్ గ్రేడ్

పరీక్ష వ్రాసిన 10 మందిలోను 7 గురు ఉత్తీర్ణులైరి.

1. ఎ. బాలమ్మ. 2. ఆర్. ఇందిర. 3. పి. లక్ష్మీనరసమ్మ. 4. జి. రాజ్యలక్ష్మి.
5. రమణీశంకర్. 6. యస్. సుబ్బలక్ష్మి. 7. కె. సావిత్రి.

కుట్టుపని లోయర్ గ్రేడ్

పరీక్ష వ్రాసిన 14 గురిలోను 8 మంది కృతార్థులైరి.

1. ఎ. గోమతి. 2. కమలాజనార్దన్. 3. యస్.యన్. మాలతి. 4. పి. పుష్ప.
5. యస్. పరిపూర్ణ. 6. ఆర్. రాణి. 7. యస్. శ్యామల 8. వై. సరోజా రెడ్డి.

ఎంబ్రాయిడరీ హయ్యర్ గ్రేడ్


పరీక్ష వ్రాసిన 5 గురిలోను 4 గురు ఉత్తీర్ణులైరి.

1. పి. పుష్ప. 2. ఎ. బాలమ్మ. 3. కె. సావిత్రి. 4. కె. భగీరథి.

ఎంబ్రాయిడరీ లోయరు గ్రేడ్

పరీక్ష వ్రాసిన 11 గురిలోను 8 మంది కృతార్థులైరి.

1. ఎ. ఈశ్వరి. 2. ఆర్. నారాయణి. 3. యస్. పరిపూర్ణ. 4. ఆర్. రాణి.
5. ఎస్. శ్యామల. 6. వై. సరోజారెడ్డి. 7. ఆర్. ఇందిర. 8. ఇ. సుందరమ్మ.



రాజకీయాలు

జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

"ఆంధ్రప్రదేశ్"

ఆంధ్ర – తెలంగాణా, తెలుగుప్రదేశ్, మహాంధ్ర, సవ్యాంధ్ర, విశాలాంధ్ర వగైరా పేర్లలో అనడానికీ, వినడానికీకూడా ఏది యింపుగావుందని కొందరు, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలాగే 'ఆంధ్రప్రదేశ్' అంటేనే బాగుంటుందని కొందరూ, "చైనిస్ ప్రధాని చౌఎన్–లై" పేరులో – అడ్డుగీతవున్నట్లు 'ఆంధ్ర – తెలంగాణా' పేరులో అడ్డుగీత (హైఫన్) అనర్ధకరమని మరి కొందరూ, పేరు "నేతిబీరకాయ పెనువేప వి్త్తంత్రు" అన్నట్లు రాష్ట్రవిలీనీకరణ ముఖ్యంకాని ఏపేరైతేనేమి అని వేరొక కొందరూ నెలరోజులుగా తర్జనభర్జనలు జరుపుతున్న కొత్త రాష్ట్రం పేరు "ఆంధ్రప్రదేశ్" గానే నిర్ణయించి, హైకోర్టుబెంచి నొకదానిని హైదరాబాద్‌లో వుంచకుండా అదికూడా కొత్త రాజధాని హైదరాబాద్ లోనే అట్టే పెట్టాలని సూచిస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మొన్న విశాఖపట్నంలో సమావేశమై ఇండియా ప్రభుత్వాన్ని అభ్యర్థించింది.

ఉద్యోగుల కేటాయింపు, వసతి ఏర్పాట్లు మున్నగు సమస్యలపై ఆంధ్ర ప్రభుత్వ కార్యదర్శి శ్రీ ఒ. పుల్లారెడ్డిగారు హైదరాబాద్ వెళ్ళి అక్కడి ఉద్యోగులతో చర్చలుజరపివచ్చారు. ఆయన సమర్పించే నివేదికను ఆంధ్ర మంత్రి వర్గాల సమావేశమై చర్చించనుంది.

ఇంతవరకు సవ్యంగానే నడిచిన ఈ సమస్య యిక ఏ 'తిరకాసు' లేకుండా అనుకొన్నవిధంగా అక్టోబర్ మొదటితేదీ నాటికి పరిష్కారమై 'ఆంధ్రప్రదేశ్' పేరుతోనే కొత్త రాష్ట్రం అవతరించగలదని ఆశించవచ్చు. అందుకు సందేహంలేదు.

తిరువాన్కూర్ – కొచ్చిన్‌కు సలహాదారు

తిరువాన్కూర్–కొచ్చిన్ రాజప్రముఖ్ అక్కడ కాంగ్రెస్, ప్రజాసోషలిస్ట్ పార్టీలలో ఏదీ సుస్థిర మంత్రి వర్గాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఎంతమాత్రంకానరాదని సూచించడంతో మార్చి 23 వ తేదీని ప్రెసిడెంట్ పరిపాలన ప్రకటించబడింది. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌కు అధ్యక్షులుగావుంటూ వచ్చిన శ్రీ పెండ్యాల సత్యనారాయణరావుగారు సలహాదారుగా నియమించబడ్డారు!

హతోస్మి! పార్టీ రాజకీయాల ప్రభావమేగదా ఈ పరిస్థితికి కారణం?

ఇస్లామిక్ రిపబ్లిక్

మార్చి 23 వ తేదీనే– కాశ్మీర్‌లో కొంతభాగం ఆక్రమించుకొని ఆజాద్ కాశ్మీర్ ఏర్పాటు చేసుకొని, ఆ మిగిలిన భాగాన్నికూడా ఏదో ఒక విధంగా వశం చేసుకొనడానికి యత్నిస్తూ ఆర్భాటాలు చేస్తున్న పాకిస్తాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ప్రకటించుకొంది. మేజర్ జనరల్ ఇస్కందర్‌మీర్జా ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడ్డాడు.

ఇండియా కూడా రిపబ్లిక్కే కాని దానికీ దీనికీ ఒక్కటే తేడా. మనది 'సెక్యులర్' స్టేట్. వారిది 'థియోక్రెటిక్' (మతం ప్రధానమైన) స్టేట్.

మైనారిటీలకు కావలసినంత రక్షణ కలిగిస్తామని ప్రెసిడెంట్ మీర్జా హామీ యిచ్చాడు.

మరి 1955 డిసెంబర్ లోపుగా - 12 నెలలలో తూర్పు పాకిస్తాన్ నుంచి ఇండియాకు 2,40,000 మంది ఎందుకు తరలి వచ్చారో!

రష్యాతో నౌకా ఒడంబడిక

ఇండియాకు, నల్లసముద్రంలోని రష్యన్ రేవులకు మధ్య నౌకల రాకపోకలకు కొత్తగా ఓడల రవాణా సర్వీసును ప్రారంభించే ఒడంబడికపై ఇండియా, సోవియట్ ప్రభుత్వాల మధ్య ఒడంబడిక మార్చి 25 న కుదిరింది.

యుగోస్లావియాతో కూడా ఇండియా ఇటువంటి ఒడంబడికనే చేసుకొంది.

రాజకీయ సిద్ధాంతాలలో వున్న విభేదాల మూలంగా కొన్ని దేశాలమధ్య గల అంశల బాధ మనదేశానికి లేదు నయం.

భారతదేశం_ శాంతి విధానం

ఆసియా, ఆఫ్రికా దేశాలలోని భారత రాయబారుల సమావేశం న్యూ ఢిల్లీలో మార్చి 24 న జరిగినప్పుడు ప్రభుత్వ వైదేశిక నీతి లక్ష్యాలను పండిట్ నెహ్రూ వివరిస్తూ, మానవసేవ, ప్రపంచంలో శాంతి పరిరక్షణ, యివే భారతదేశ విదేశాంగ విధానానికి ప్రధాన ప్రాతిపదికలని ప్రధాని పండిట్ నెహ్రూ ఉద్ఘాటించారు.

యాటం, హైడ్రోజన్ బాంబుల దర్పంతో ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్న రాజ్యాలకు ఈ నెహ్రూ వాణి వినిపించగలదా ?

ఇండియా భూభాగంపై పాకిస్తాన్ విమానాలు.

మార్చి 23 ఉదయం ఏడు పాకిస్తానీ ఫైటర్ విమానాలు పంజాబ్‌లోని రావినదీ తీరంవద్ద భారత భూభాగంపై క్రిందుగా ఎగిరి వెళ్ళినట్లు వార్త. పైగా ఇండియాదే తప్పని పాకిస్తాన్ ప్రెసిడెంట్ ఆరోపణ కూడా.

బహుశా అమెరికానుంచి వచ్చిన ఆ విమానాలు ఎగురుతాయో లేదో అని పాకిస్తానీలు పరీక్షించడానికి తగిన స్థలం మరెక్కడా కనిపించకపోయి వుండాలి.

ప్రెసిడెంట్ మీర్జా ఆరోపణలో వింత ఏమీ లేదు రిపబ్లిక్‌గా ప్రతిపత్తి మారిందిగాని ప్రవృత్తి మారలేదుగా!

రష్యా ఉపప్రధాని రాక

సోవియట్ ప్రభుత్వ ఉప ప్రధాని అనాస్టాస్ మికోయాన్ మార్చి 26 వ తేదీ మధ్యాహ్నం ఇండియాను నాలుగు రోజులపాటు సందర్శించే వుద్దేశ్యంతో ఢిల్లీకి వచ్చారు. ప్రధాని పండిట్ నెహ్రూను కలుసుకొని 165 నిమిషాలసేపు అంతర్జాతీయ సమస్యలనుగురించి చర్చించారు.

రష్యాలో స్టాలిన్ శకానికి ప్రధాన లక్షణమైన వీరారాధన తత్వానికి స్వస్తి చెప్పబడిందని, సమిష్టి నాయకత్వంలోనే ప్రభుత్వం కొనసాగగలదని ఆయన అన్నారు.

నాజీజం, ఫాసిజంలకుమల్లేనే స్టాలినిజానికి స్వస్తి జరిగింది. మరేకొత్త యిజమూ ఏరూపంలోనూ తల ఎత్తకుండావుంటే బాధలేదు.

నాగజాతివారి అకృత్యాలు

అస్సాంలో నాగపర్వత ప్రాంతంలోని కొందరు నాగజాతివారు దుష్ప్రేరణలకు లోనై నాగప్రాంతానికి స్వాతంత్ర్యం యివ్వాలని ఆందోళన చెయ్యడమేగాక దానికి దౌర్జన్య విధానాన్ని కూడా జతపరచడంతో అస్సాం ప్రభుత్వం సైనిక, విమాన దళాల సహాయంతో తగు చర్యలు తీసుకొంటున్నదని మార్చి 27 న అస్సాం ప్రభుత్వ ప్రతినిధి ప్రకటించాడు.

ఈ ప్రాంతంలో కల్లోలానికి ఫిజ్ అనే నాగ నాయకుడు కారకుడు ఇతనితోగాని, ఇతర నాయకులతోగాని రాయబారాలకు చేసిన యత్నాలు ఏమీ నెరవేరనందున కఠిన చర్యలు తీసుకొని శాంతిని స్థాపించడం తప్ప మార్గాంతరం లేదని పండిట్ నెహ్రూ కూడా అన్నాడు.

ఈ దౌర్జన్యవాదుల తంతువేరు. తమకు తోచదు_ చెబితే నచ్చదు ? ఏవిదారి ?

ఆంధ్రలో వర్తకులపై కొనుగోలు పన్ను

వడ్లు, బియ్యం, కొబ్బరి, కొబ్బరికాయలు, ముడిజనుం, పసుపులతో వ్యాపారం చేసే వర్తకులంతా తమ పేర్లను వర్తకులుగా రిజిష్టర్ చేసుకోవాలని, వడ్లు, బియ్యం, కొబ్బరి, కొబ్బరికాయలపై ఆరు పైసలు, ముడిజనుంపై మూడు పైసలు, పసుపుపై పన్నెండు పైసలు కొనుగోలు పన్ను చెల్లించాలని సూచిస్తూ

ఆంధ్ర ప్రభుత్వం మార్చి 29 వ తేదీని ఒక బిల్లును గెజిట్ లో ప్రకటించింది.

దీనివల్ల ఆంధ్ర ప్రభుత్వానికి సాలీనా కోటి రూ॥లు ఆదాయం రాగలదని అంచనా వేయబడుతూవుంది.

రాబడి లేకుంటే రథం నడవదుగదా!

కాశ్మీర్ లో ప్లెబిసైట్

కాశ్మీర్ లో ప్రజాభిప్రాయ సేకరణకు పాకిస్తానీ నాయకులు చేస్తున్న ఆందోళనలకు నేడు పార్లమెంటులో కొంచెం ఘాటైన సమాధానమిస్తూ పాకిస్తాన్ తాను జరిపిన దురాక్రమణను కాదని బుకాయించి ప్రయోజనం లేదని, ఆజాద్ కాశ్మీర్ నుంచి పాకిస్థాన్ సైనికులు ముందు తప్పుకుంటేనేగాని అక్కడ ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ)కు వీలులేదని అన్నారు.

ఎనిమిదేళ్ళనాటి క్రితం కాల పరిస్థితి దృష్ట్యాకాక ఆగ్నేయాసియా రక్షణ సంధిలోను, బాగ్దాద్ రక్షణ సంధిలోను పాకిస్తాన్ చేరడమేగాక అమెరికానుంచి ఆయుధాలు తెప్పించుకొనడం దృష్ట్యానే ఈ సమస్యను పరిశీలించాలని చెప్పారు.

ఇండియా చుట్టూ సైనిక ఒడంబడికద్వారా దిగ్బంధన విధించే ప్రయత్నాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు కూడా.

ఇక రాయబారాల ద్వారా పరిష్కారానికి అవకాశం లేకుండా చేశారని పాకిస్తాన్ నాయకులు వాపోయారు.

నిజం ఆడితే నిష్ఠూరమే గదా!

ఆంధ్ర కోస్తాలో నూనె గనులు

ఆంధ్ర దేశం కోస్తా ప్రాంతంలో నూనె గనులున్న జాడ కనిపించిందని, ఈ సందర్భంలో భూగర్భ పరిశోధనలకు ఏర్పాటుచేస్తున్నామని ఇండియా ప్రభుత్వం పార్లమెంటులో మార్చి 31 వ తేదీని ప్రకటించింది.

అయితే మనదేశం రత్నగర్భ మాత్రమే కాదు— తైలగర్భ కూడా నన్నమాట.

పూనాలో అగ్ని ప్రమాదం

మార్చి 30 న పూనాలోని భవానీ, రవివార్ పేటల మధ్యప్రాంతంలో పెద్ద అగ్నిప్రమాదం సంభవించి 12 లక్షల రూపాయలకు పైబడిన ఆస్తి ధ్వంసమైంది. మంటలను ఆర్పడానికి ప్రజలకు అగ్నిమాపక దళాలకు కూడా సాధ్యంకానందున సైనిక దళాలు రప్పించబడ్డాయి.

ఏమైతేనేం, ప్రాణనష్టం సంభవించనందుకు అగ్నిదేవుణ్ణి అభినందించాలి

నీటి సరఫరా స్కీములు

ఆంధ్ర రాష్ట్రంలోని గుంటూరు, కాకినాడ వగైరా పట్టణాలకు మంచినీటి సరఫరా స్కీములను అమలు జరపడానికి ఇండియా ప్రభుత్వం 25 లక్షల రూపాయలు మంజూరు చేసింది.

బళ్ళారి, పర్లాకిమిడుల సమస్య

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లుపై ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డి ప్రతిపాదించిన అధికార తీర్మానాన్ని ఆంధ్ర అసెంబ్లీ ఏప్రిల్ 6 వ తేదీని ఆమోదించింది.

మైసూర్ లో చేర్చడానికి కేంద్రం వుద్దేశించిన బళ్ళారిని, ఒరిస్సాలో చేర్చబడిన పర్లాకిమిడిని ఆంధ్ర రాష్ట్రంలో చేర్చాలని కేంద్రాన్ని ఈ తీర్మానంలో ఆంధ్ర అసెంబ్లీ అభ్యర్థించిందికూడా.

తీర్మాన లక్ష్యం మంచిదే— కేంద్రం ఒప్పుకుంటే.

రైల్వేలలో మహిళలకు ఉద్యోగాలు

రైల్వేలలో ఎక్కువమంది మహిళలు కూడా ఉద్యోగాలు చెయ్య వలసి వుంటుందని, మహిళలకు కూడా అందుకు తగిన అవకాశాలు యివ్వబడాలని, లోక్ సభ అంచనాల సంఘం ఏప్రిల్ ఆరవ తేదీని ఒక సిఫారసు చేసింది.

విదేశాలలో స్త్రీలు రైళ్ళలో ఇంజన్ డ్రయివర్లుగా, గార్డులుగా, టికెట్ కలెక్టరులుగా కూడా పని చేస్తున్నారు. ఈ రంగంలో కూడా భారత మహిళలు ముందంజ వేయాలి,

పాకిస్థాన్ పార్లమెంటులో ఆర్భాటాలు

కాశ్మీర్ సమస్యపై ముఖాముఖి రాయబారాలకు భారత ప్రధాని అవకాశం లేకుండా చెయ్యడంతో ఈ సమస్యను తిరిగి మిత్రరాజ్యసమితిలో తిరగతోడతామని పాకిస్థాన్

ప్రధాని చౌధురి మహమ్మద్ ఆలీఖాన్ ఏప్రిల్ ఆరవతేదీని పాకీస్థాన్ పార్లమెంటు సమావేశంలో ఆర్భాటం చేశాడు.

కాశ్మీర్ మాజీ ప్రధాని షేక్ అబ్దుల్లాను వెంటనే విడుదల చేస్తే ఇండియా పాకీస్థాన్‌ల మధ్య సంబంధాలు యింకా బలపడ గలవని కూడా అన్నాడు. ఇండియాతో యిక యుద్ధమే శరణ్యమని యితర సభ్యులన్నారు.

వెనక షేక్ అబ్దుల్లాను ద్రోహి అని తెగనాడిన పాకిస్థాన్ రంగు ఫిరాయించింది. ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి.... అంటే యిదే.

రాష్ట్ర పునర్నిర్మాణం బిల్లు

బొంబాయి అసెంబ్లి ఏప్రిల్ 7 తేదీని రాష్ట్ర పునర్నిర్మాణం బిల్లును ఆమోదించింది.

అయితే దీనికి ముందు ఎంత రగడ జరిగింది?

రెండవ శతాబ్దంనాటి శిధిలాలు

నాగార్జున సాగర్. ప్రాజెక్టు ప్రాంతంలో త్రవ్వకాలు సాగించగా క్రీస్తుశకం రెండవ శతాబ్దంలోనో, మూడవ శతాబ్దంలోనో నిర్మించబడిన ఒక సుందర ప్రాసాద శిథిలాలు — ఆ ప్రాసాదాలలో కృష్ణానది వరకు పోయే రెండు వరసల మెట్లు కనిపించాయని ప్రాజెక్టు నిర్వాహకుడు శ్రీ ఎన్. చక్రవర్తి ప్రకటించారు.

ప్రాచీన కాలంనాటి మన దేశ వైభవ ప్రాభవాలకు మరొక తార్కాణం!

కొత్త రాష్ట్రం పేరుకు హైదరాబాద్ అసెంబ్లీ ఆమోదం

ఆంధ్ర తెలంగాణా విలీనీకరణకు పిదప ఏర్పడే కొత్త రాష్ట్రానికి "ఆంధ్ర ప్రదేశ్" అని పేరు పెట్టడానికి హైదరాబాద్ అసెంబ్లీ ఏప్రిల్ 12 తేదీని ఆమోదించింది. శుభం!

తెలంగాణాలో మద్యనిషేధం

ఆంధ్రరాష్ట్రంలో తెలంగాణా చేరుతున్నందున హైదరాబాద్ రాష్ట్రంలో కూడా తర్వలోనే మద్య నిషేధాన్ని అమలు జరపవలసివుంటుందని మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారు ఏప్రిల్ 6 న ప్రకటించారు.

అసలు మానేకం టె ఆలస్యంగా చేసినా మేలే అని ఓ సామెత.

బెంగాల్ బీహార్ విలీనీకరణ

ఫెడరల్ యూనియన్‌గా బెంగాల్, బీహార్ ఏకీకరణకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సూచించిన కొత్త పథకంపై కేంద్రమంత్రులు ఆజాద్, పంత్‌ల సమక్షంలో ఏప్రిల్ 16 న చర్చలు జరిగాయి.

వీటి పర్యవసానం తేలడానికి వ్యవధి ఎప్పుడైనా లక్ష్యం మాత్రం మంచిదే—నెరవేరితే.

నాగార్జున సాగర్ మ్యూజియమ్

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ స్థలం వద్దనే $4\frac{1}{2}$ లక్షల రూపాయల ఖర్చుపై ఒక మ్యూజియం నిర్మించబడగలదని విద్యాశాఖ పార్లమెంటు కార్యదర్శి శ్రీ హెచ్ వి. వైష్ణవ్ ఏప్రిల్ 19న లోక్‌సభలో ప్రకటించారు.

నాగార్జునసాగర్ మ్యూజియం ప్రపంచ ప్రసిద్ధమైన యాత్రాకేంద్రం కాగలదు.

అంబర్ చర్కా

దేశంలో అనేకమందికి జీవనోపాధి కల్పించగల పది వేల అంబర్ చర్కాలను వెంటనే ఉత్పత్తి చెయ్యడానికి తగుచర్య గైకొనబడిందని, వీటి ఉత్పత్తికి ప్రభుత్వం సబ్సిడీ లివ్వగలదని ప్రధాని పండిట్ నెహ్రూ ఏప్రిల్ 18 న లోక్ సభలో ప్రకటించారు.

పవరుమీదనే వీటిని పని చేయించ వచ్చునని భూదాన యజ్ఞకర్త శ్రీ వినోబాభావే అన్నారు.

ఎవరు ఏమనినా అంబర్‌చర్కా ప్రయోజనం అనంత మన్నది ఖాయం.

విదేశాలలో

సింహళంలో ఏప్రిల్ 6 నుంచి జనరల్ ఎన్నికలు జరిగాయి. సింహళ పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు శ్రీ భండారనాయకే పక్షం యునైటెడ్ ఫ్రంట్ గెలిచింది. కొత్త మంత్రివర్గాన్ని ఆయన అప్పుడే ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నాడు కూడా.

రష్యా ప్రధాని బుల్గానిన్, రష్యాలోని కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కృశ్చేవ్‌లు లండన్ వచ్చారు. బ్రిటీష్ ప్రధానితో వీరు సంభాషణలు జరుపుతున్నారు.

బుద్ధుని భూతదయా పరత

శ్రీ ఆకుండి వేంకటశాస్త్రి

దేశమున క్రూరాసురాచారములు ప్రబలినపుడు, ధర్మము క్షీణించు నపుడు. నేనవతరించి ధర్మసంస్థాపనము చేయుచుందునని శ్రీ కృష్ణభగవానుడు 'గీత' లో ప్రవచించెను. బుద్ధభగవానుడు మనదేశమున క్షత్రవంశమున నవతరింపకమునుపు, దేశమున నెట్టి సాంఘిక పరిస్థితు లుండెను— ఎట్టి క్రూరమగు ఆచారములు దేశమెల్లెడల ప్రబలియుండెను, ఈ విషయముల నెల్ల మనము పర్యాలోచింతుమేని, బుద్ధభగవానుని యవతారము, ధర్మసంస్థాపనార్థమే గీతలో పేర్కొన్న రీతిగనే సంభవమని చెప్పవచ్చును. మానవులు స్వార్థచింతతో. యజ్ఞయాగాదికములు చేసి స్వర్గాది భోగములు నాశించుచుండిరి. ఆ యజ్ఞములందు జంతు బలులు మితిమీరి పోయెను.

ఇట్టి ధర్మక్షీణ సమయమున, యుగేయుగే సంభవామి అని కృష్ణభగవానుడు పార్థుని కుపదేశ పూర్వకముగ తెల్పుచు, తన యవతార రహస్యమును కూడ లోకమునకు తెల్పెను.

అందుచేతనే బౌద్ధయుగము మన హిందూదేశ మత చరిత్రలో స్వర్ణాక్షరములతో లిఖింపబడెను. మన హిందూదేశపు వివిధ మత చారిత్రక సంభవములను పునర్విమర్శయును పోరణ గండ్లనుండి బుద్ధుని జీవితగాథా దృశ్యములలో అతని భూతదయా పరత్వ విజృంభణ చిహ్నములగు సంఘటనలను పరికింతము.

అతడు జనించినది భోగభాలసత్వమునకు, యవ్వనోన్మాదమునకు తావలమైన క్షత్రియ రాజకుటుంబము. ఒకనాడు గౌతముడు తన స్నేహితునితో వేటకు వెళ్ళెను. ఒక పక్షిని బాణమువేసి చంపెను. దానిరెక్క తెగి ఆ పక్షి చెట్టునుండి క్రిందపడెను. మొట్టమొదటిసారి రక్తము కారుచుండ ఆ పక్షి విలవిల కొట్టుకొనుచుండ గౌతముడు చూచి భయభ్రాంతుడయ్యెను. తాను తేనెతెచ్చి ఆ గాయమును మాన్ప యత్నించెను. అతనిలో భూతదయా పరత్వము జనించిన అతని హృదయము ద్రవీభూత మయ్యెను— ఆనాటినుండి జంతువుల చంపరాదనియు జంతువుల నే విధముగనైన చంపువారిని వారింప నుద్యమించుటయు అతని జీవితసందేశ మయ్యెను. 'అహింసాపరమోధర్మః' అప్పటినుండి బౌద్ధ మతమునకు మూల సూత్రమైనది.

ఒక రాజు చేయు యజ్ఞమునకై వందలకొలది మేకల మందలను కొందరు తోలుకొని పోవుచుండిరి. బుద్ధుడు వారిని ఆ మేకలెచ్చటికి తోలుకొని పోవుచున్నారని యడుగ ఒకరాజు చేయు యజ్ఞములో ఆ మేకలన్నియు బలిగావింపబడ నున్నవనియు, అచ్చటికే తోలుకొని పోవుచుంటిమని తెల్పిరి. గౌతముడా యజ్ఞశాలకు పోయి ఆ రాజుతో వాదించి ఆ నోరులేని జంతువుల బలిని మాన్పించి అహింసయే గొప్పదనియు, యజ్ఞములలో ఆజంతువులను చంపరాదని నిరూపించి అతనిని తన అహింసా మతమునందు ప్రవేశ పెట్టెను—

ఇట్టి 'అహింస' యను మూలసిద్ధాంతముపై స్థాపింపబడిన యీ బౌద్ధ మతము వందలకొలది వత్సరముల క్రిందట మన హిందూ దేశమున, నవతరించి ఆసియా ఖండపుదేశములలో యిప్పటికిని, నిలిచియుండి సింహళ ద్వీపమున 24 మేనెల 1956 సం॥ లో 2,500 సంవత్సరాల వర్ధంతిని కావించు కొనుచున్నదన ఆ మతము యొక్క ప్రాశస్త్యము వెల్లడి యగుచున్నది.

ధర్మము

శ్రీమతి మైలవరపు రామపూర్ణావతి

పాత్రలు :

1. రేఖ, 2. బౌద్ధసన్యాసి, 3. యువక బిక్షువులు (ఇద్దరు).

(బౌద్ధారామ అంతర్భాగము. సమయము సంధ్య. పక్షుల కిలకిల నినాదములు తక్క-నిశ్శబ్దత అంతటిని ఆవరించియున్నది. బౌద్ధ బిక్షువులు సాయంప్రార్థనలో మగ్నమైయున్నారు. అప్పుడప్పుడూ ఆరామాభ్యంతరము నుండి ఏవో గావు కేకలు వినిపిస్తుంటాయి——)

ఆరామపు టంతర్భాగము

బౌ. స : ——(సన్నని స్వరముతో)

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి (క్రమముగా కంఠస్థాయి తగ్గును)

(వెలుపలినుండి ఎవరో పరుగెత్తుకొని వస్తునట్లు అడుగులచప్పుడు. ఈ చప్పుడు క్రమముగా ఆసన్నమౌతూంది. ఆ రామములోనికి ఒక స్త్రీ ప్రవేశము)—

రేఖ : (బిగ్గరగా) స్వామీ ! రక్షించండి, రక్షించండి. ఆ రామ బిక్షుకులు నన్ను బయటకు గెంటటానికి-యత్నిస్తున్నారు.

బౌ. స : (మృదువుగా) ఎవరిదా ఆర్తనాదము. ఎవరిదో, స్త్రీకంఠమువలె నున్నది !

రేఖ : (సమీపమునకు వచ్చి) నేనే స్వామీ ! నేను రేఖను.

బౌ. స : ఎవరు ? రేఖవా ! నీవు ఆరామములోవుండే బిక్షుకి వేనా, లేక ....

రేఖ : క్షమించండి స్వామీ ! నేనే ఆరామమునకు నూతనముగావచ్చిన బిక్షుకిని. (వెనుదిరిగి చూచి) అరుగో మీ బిక్షుకులు నన్ను వెంట తరుమ కొస్తున్నారు. నేను ఆరామములో ప్రవేశించరాదట. ప్రవేశిస్తే ఈ పవిత్రమైన ఆరామము అపవిత్రమవుతుందట. (జాలిగా) నన్ను వారి బారినుండి కాపాడి యీ ఆరామములో నాకుగూడ చోటివ్వండి స్వామి !

(మరల అడుగుల చప్పుడు క్రమముగా దగ్గరౌతుంది)

ఇద్దరు బిక్షుకులు ప్రవేశము.

1 బిక్షువు : త్వరగా బైటకు నడుస్తావా లేక గెంట మన్నావా. ఈ పవిత్రమైన స్థలాన్నికూడ మైల పరచటానికి వచ్చావా ? నడు బయటకు.

2 బిక్షువు : బుద్ధదేవుని ఆరామములో ఏముందని దోచుకొనుటకు వచ్చావు ? ప్రపంచాన్నంతటిని మోహింప చేశావు చాలదు. ఇక ఈ బిక్షుకుల్నికూడ చంచల మనస్కులను చేయాలనేగా నీ ప్రయత్నము. బుద్ధితో బయటకు నడు. లేకపోతె స్వామికి ఆగ్రహము వస్తుంది.

రేఖ : (దుఃఖముగా) వినండి స్వామీ ! వీరి మాటలు. మీకైనా యీ అనాథపై కరుణకల్గటంలేదా !

బౌ. స : (కరుణాపూర్వక వాక్కుతో) అమ్మాయీ ! నీ వెవరనన్నావు.

రేఖ : నేను రేఖను స్వామీ ?

బౌ. స : నీవు రేఖవా ! నిన్నెప్పుడూ ఆరామములో చూచియుండలేదే !

1 బి : స్వామీ ! ఈమె ఆరామబిక్షుకి కాదు. ఈమె పేరుమోగిన కుంట. పవిత్రమైన ఆరామాన్ని అపవిత్రము చేయటానికి మీ ఆజ్ఞ లేకుండగానే ప్రవేశించింది. తమ ఆజ్ఞ అయితే ఈమెనిప్పుడే బయటకు గెంటివేస్తాము.

రేఖ: (జాలిగా) చూడండి స్వామీ! తమ బిక్షుకుల ఆధిక్యము చిక్కులేని నాపైయెట్లు విజృంభిస్తున్నారో!

బౌ.స: (బిక్షుకునితో) నాయనా త్వరపడకు - (రేఖతో) అమ్మా రేఖా! నీకేమి పనికలదీ ఆరామములో. నా ఆజ్ఞపై అతిత్వరగా నిర్వర్తింపబడుతుంది చెప్పమ్మా!

రేఖ: (గీరపోయిన గొంతుకతో) ఏమిలేదు స్వామీ! నా రోత బ్రతుకుపై చీదరకల్గింది. అందువల్ల నా యీ శేష జీవితాన్ని బుద్ధదేవుని శుశ్రూషకై వినియోగింప దలచాను. ఇక్కడే బిక్షుకిగా తమ సేవచేసి తరిస్తాను. (ఏడుస్తూ) ఈ అనాథకోరికను మన్నించండి స్వామీ. నన్ను రక్షించండి స్వామీ!

2 బి: స్వామీ! స్వామీ! ఆరామము శాంతముగా నుండవలెనంటె ఈమె కోర్కెను మన్నించకండి మా రక్షకోరి ఈమెని బిక్షుకిగా అంగీకరించవద్దు. పవిత్ర జీవనముచేసే బుద్ధదేవుని అనుచరులకు మచ్చను ప్రసాదించకండి. ఆరామ జీవనానికి ఈమె ఆటంకము. పవిత్రముగా జీవితము గడిపే బిక్షుకులకు ఈమె తీయరాని ముల్లువంటిది స్వామీ!

బౌ.స: (నిశ్శబ్దముతో ఆలోచించుచుండును).

రేఖ: (దుఃఖముగా) ఏమి స్వామీ! మాట్లాడరేం. నేను ఆరామములో నిలిస్తే ఆరామం మైలపడుతుందనేనా మీ యూహ. బిక్షుకుల ఆరామజీవితానికి నేను ఆటంకమనేనా మీతలంపు. (ఏడుస్తూ) ఏమి స్వామీ! మాట్లాడరు. సంఘమునుండి తరిమివేయబడ్డా ఇక్కడ ఆశ్రయము లభిస్తుందని గంపెడాశతో వచ్చానే. ఇక్కడకూడ నాకు చోటివ్వరా స్వామీ! జీవితములో చేయరాని తప్పుచేస్తే ఇదే నా శిక్ష. తప్పును దిద్దుకొనటానికి సంఘము అంగీకరించదా? ఆ గ్రుడ్డిసంఘముతోపాటు బుద్ధదేవుని ఆరామముకూడ రాలిన ముత్యాలను ప్రోగుచేయదా. పూవుచెట్టునుండి రాలితే దానిగతి అధోగతేనా! దానిని రక్షించేవారు లేరా! అజ్ఞానముతో చేసిన తప్పులను ఆత్మపరివర్తన కల్గినా సంఘము మన్నించదా! (పెద్దగా ఏడ్చును)-

బౌ.స: (మృదువుగా) అమ్మా రేఖా! నిన్ను బిక్షుకిగా బుద్ధదేవుడంగీకరించినాడు. నీవు ఆరామములోనె నిల్చిపోవచ్చును.

1, 2, బౌ.బి: స్వామీ! మాదొకమనవి.

బౌ.స: ఏమిటి నాయనా మీ అనుమానము.

1 బౌ.బి: స్వామీ! ఈమె ఆరామములో నిలిస్తే బిక్షుకుల ప్రవర్తనలలో చాల మార్పిడివస్తుంది. ఆరామ క్షేమ దృష్ట్యా ఈమె నిటనుండ నివ్వవద్దు. అంత ఆత్మపరివర్తనే కల్గితే విరాగినిగా కాలము వెళ్లబుచ్చ మనండి. అప్పుడప్పుడూ తమ దర్శనముచేస్తూ తమ అమృత వాక్కులను విననివ్వండి. కాని స్థిరముగా ఇచ్చటనుండ నివ్వకండి.

బౌ.స: నీ ఆలోచనకూడ వ్యర్థముకాదు నాయనా! కాని నీ దృష్టి సంకుచితముగానున్నది కొందరి స్వార్థతకు ఇతరులను బాధపెట్టారా? ఆరామములో ఈమె నిలిస్తే బిక్షుకుల ప్రవర్తనలు మారుతవని ఈమెను నిషేధిస్తే ఈమెకు దిక్కెవరు. మంచి, చెడు అనే విచక్షణలో నీవు అనుచరించు మార్గము సంకుచితముగాలేదా! యీమెను మీరు సోదరిగా స్వీకరించి ప్రవర్తిస్తే ఆరామ జీవితానికి భంగమే మున్నది. నిగ్రహించవలసినది మనస్సును కాని మనుష్యులను కాదు నాయనా! యీమె యెడల నీకు సోదరిభావము కల్గియున్నట్లైతే ఇటుల మాట్లాడి యుండెడివాడవు కావేమో! ఇంతకాలము ఆరామ జీవితానికి అలవాటుపడినను నీ మనస్సులో మార్పే మున్నది. చూడు బాహ్యములకై ఎట్లు నీ మనస్సు పరిగెడుతుందో. నీ దృష్టిలో మార్పేమున్నది. బుద్ధదేవుని బోధనలు ఇన్నాళ్ళువిన్న దానిఫలిత మిదేనా? సంపూర్ణముగా పరివర్తనము పొందిన మనస్సులో నున్న ఈ రేఖకంటె నీ వే విషయములో పైమెట్టుపై నున్నావో గమనించితివా? ఆమె వేగిమాడినగింజ. నీవు పూర్తి పరిపక్వమందని పండు ఆమె దృష్టిలో అంతా సమము. స్త్రీ, పురుషుల తారతమ్య బేధములు లేవు ఆమెకిప్పుడు అందరియెడల వాత్సల్యమేకాని, ప్రేమలేదు. ఐహికచింత నశించిన ఈమె ఆరామాని కెన్నడు కంటకింపు కానేరదు. నీవు పొరపడితూల నాడినందుకు ఆలేతహృదయము ఎంత సంక్షోభ పడుతుందో చూచావా. నీ సోదరిని స్వీకరించి వెలుగులోనికి నడువు. బుద్ధదేవుడు నిన్ను ఆజ్ఞాపిస్తున్నాడు.

1 బౌ.బి : క్షమించు స్వామీ! కేవలము సంకుచిత దృష్టితో ఈమెను గ్రహించవద్దన్న నాకు జ్ఞానబోధన చేశారు. ఆరామ భిక్షువు లీమెనుతప్పక సోదరిగా గ్రహిస్తారు. బుద్ధదేవుని నిలయమగు నీ ఆరామంలో సోదర, సోదరీ వాత్సల్యమునకు కొరతలేదు. మాతృ వాత్సల్యమునకు నోచుకొనని మా భిక్షుకులకు నేడు భగవానుడు ఈమె ద్వారా ప్రసాదించాడు. (రేఖతో) సోదరీ! స్వామివారి ఆజ్ఞతో నీవు మా ఆరామవాసిని వయ్యావు. ఆరామచర్యలో పాల్గొందాముర.

బౌ.స : అమ్మా రేఖా! నీ సోదరుని అనుసరించమ్మా. ఉదయ, సంధ్యవేళలందు బుద్ధదేవుని ప్రార్థనలో పాల్గొనమ్మా. మిగతావేళల్లో ఆరామ దినచర్యలో పాల్గొను. నీసోదరులు అన్ని సదుపాయములు కలుగచేయగలరు. నిన్ను బుద్ధదేవుడు పునీతురాలు నిగా చేస్తాడు. ఐహికములపై రోతగల్గిన నీమనస్సు మరియొకసారి వానిపైకి మరల్చకు. బుద్ధదేవుడు నీకు మేలుచేయగలడు...ఇక వెళ్ళు.

రేఖ : (సంతోషముతో) ధన్యురాలను స్వామీ! తమ యాజ్ఞను తప్పక శిరసావహిస్తాను. నాకు శలవు.

(బయటకు వెళ్ళుతున్న అడుగుల చప్పుడు)

బౌ స : బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

(క్రమముగా కంఠధ్వని దూరమవుతుంది. మరలపక్షుల కిలకిలలు, తటాక అలల కలకలను వినిపిస్తుంది)

హంస రక్షణము

శ్రీ చదలవాడ కోటినరసింహము

అదియొకనాఁటి సంధ్య; గహనాంతరమందు
మరాళ జాలము
న్నది యని దేవదత్తుఁడు—దయారహితుండు
శరమ్ము వేయఁగా
నొదవిన కష్టభారమున నుర్విపయింబడె
నొక్క హంస; ఆ
యదనున శాక్యసింహుఁడు విహారమొనర్చు
చునుండె నచ్చటన్

పరుగిడి యతఁ డంచం గొని
సరసికిఁ జని సేద దీర్చు సమయమ్మునయం
దరుదెంచి దేవదత్తుండు
హరియింపఁ దలంచె నావిహంగముఁ
గనుచున్

"పెట్టి పెంచలేవు, గిట్టింప నీ కెట్టి
హక్కు గల్గు నీ విహంగమందు
నీతి గా"దటంచు గౌతముండాడిన
పల్కు విన్నవారు బళిరె! యనిరి"
కరుణాబ్ధి స్వాంతుఁడు ముని
వరుఁడగు బుద్ధుని హితోక్తి పరదేశములం
జిరకాల స్మరణీయము
భరతోర్వి తపః ఫలమ్ము బౌద్ధ మతమ్మా



బౌద్ధ తేజములు

శ్రీ జూలూరి హనుమంత రావు

1

ఏవిజ్ఞానము సాధుసంపదలఁ బ్రత్యేకించి పోషించె నే
జీవప్రేమ కళాప్రపంచముల సృష్టించె న్మహచ్ఛక్తి నే
భావోత్కర్ష దయారసప్రకృతి శోభాపుంజముల్ నించె నా
కైవల్య ప్రతిబౌద్ధతేజములు సాక్షాత్కారమౌతన్ సదా।

2

ఇది లోకజిత్తేజమేపారు కరుణా వి
కాసవాసము జీవికాప్రవాస
మిది సర్వజనచిత్తమిగురొత్తు వాసంతి
కాసూన సంతాన క్రమశాఖి
యిది యహింసాసార మింకిపోవని మహో
దార నీరధి నీరపూర హేల
యిది త్యాగగుణశీల మింపారు సత్యవా
గ్జాలలాలిత లోకపాలనమ్ము
బుద్ధదేవుని ధర్మసంబద్ధ చరణ
నిలయమిది యనశ్వర కళావలయమిద్ది
బౌద్ధ చైతన్య కరుణాప్రవాహసంగ
మమ్ముగాఁబొంగు ధర్మసంపదలవనధి.

3

"అకటా। జీవిమఱొక్క జీవితము నాహారింపగానేల? జీ
వికజీవింపక చచ్చుటేల? పునరావిర్భావమై నిర
ర్థకమై మృత్యువుపొందనేల? విషచక్రంబందు నీజీవి పు
ట్టుకచావుల్ విరమింపవేల? ఇవెఆటల్ కోట్లజీవాళికిన్.

4

ఏదీదుఃఖములేని జీవితము? రానేలాకష్టముల్? వచ్చినన్
రాదాశాంతి? తమఃప్రపంచమిది కోఅల్ చాచితామృత్యువై
పోదేపీడి; యశాంతి తాండవముసల్పున్; వీనిజన్మస్థలం
బౌ దేహేంద్రియవాంఛ వీడుటకు లేదామార్గ మేజీవికిన్?

5

హింసాకాండల దైవమున్నె? యవరోహించెన్
దయాబుద్ధి; వి
ధ్వంసంబై చనుచున్నె జ్ఞానకళ। విద్వన్మానసోత్తేజముల్
సంసర్గించెనె యంధకారకళతో? సత్యమ్మువమ్మై జగ
త్సంసారమ్మున జీర్ణమైనవె। యహింసాభావమంధత్వమై।

6

జరచేఁ గోర్కులచేఁ గఠోరరుజచే జన్మమ్ముచేఁ జావుచే
స్థిరసంతోష సుఖప్రసారముల వాసింబొందగాలేని దు
ర్భరబాధాగ్రసితైకలోకమిది; జీవక్లేశముల్ బాపగా
స్థిరకార్యాచరణమ్ములేదొకొ। ప్రయత్నింపన్
లభించున్ గదా।"

7

అని ప్రస్థానముసేసె గౌతముడు భార్యాపుత్రులున్
రాజ్యమున్
ధనభోగమ్ములు భోగ్యముల్ తుదకు సంత్యాజ్యమ్ములై
మిథ్యలై
చనగా—బోధితరుప్రవాళ రుచిరస్థానమ్ములో ధ్యానలో
చనముల్ జ్ఞానకళావళీమిళిత భాస్వర్గమ్ములై వెల్గఁగాన్.


8

ప్రాచిపశ్చిమభూ దిగంతములలో వ్యాపిల్లి బౌద్ధోజ్వల
ప్రాచుర్యమ్ములు సత్యధర్మకరుణాభావమ్ములంజూపి శో
భాచైతన్య జనావళీ వికసిత ప్రాభాతహృత్పంకజ
శ్రీచైత్రమ్మొనరించె బుద్ధుని దయాసిద్ధాంత మీలోకమున్.

9

పదములలో నదములలో
నుదయములో ధర్మభావనోదయములలో
హృదయములోఁ గరుణములై
మెదలెడు నాబౌద్ధపౌర్ణమీ తేజమ్ముల్.





మార్జాల మూషిక సంవాదం

'సుభాషిణి'

అంపశయ్యా మీద పరున్న భీష్ముని వద్ద ధర్మసందేహాలను నివృత్తి చేసుకొనుటకు ధర్మరాజాదులు ప్రతి దినము సందర్శించుసమయమున ఒకనాడు ధర్మరాజాతనిని "పెక్కండ్రు పగరకు నగ్గమై హీనబలుండైనవాడు ఎప్పరుసున ఆపద నిస్తరించువాడు" అని అడిగెను. అందుకు భీష్ముడు మార్జాల మూషిక సంవాదమను నొక ఇతిహాసము ధర్మనందనుని ప్రశ్నకు మంచి సమాధాన మగునని ఆకథ ఈవిధంగా చెప్పెను.

ఒక మహారణ్యంలో ఒక మర్రిచెట్టు మొదట ఉన్న కన్నములో పలితుడు అనే పేరుగల ఒక ఎలక నివసిస్తూ ఉండేది. ఆ చెట్టు కొమ్మలలో రోమశుడనే ఒక పిల్లి కాపరం ఉండేది. చాలా కాలం నుంచి ఈ రెండూ ఆ మర్రి వృక్షాన్ని ఆశ్రయించి కాలం గడుపుతూ ఉండేవి. ఆ చెట్టు సమీపాన్నే ప్రతిరోజూ సంధ్యవేళ ఒక వేటకాడు మృగాల కోసం ఉరులు ఒడ్డి వెళ్ళిపోయేవాడు. ఉదయాన్నే తిరిగి వచ్చి రాత్రివేళ ఆ వలలో ఏమైనా జంతువులు చిక్కుకుని ఉంటే వానిని తీసుకొనిపోయి వానివల్ల జీవితం వెళ్ళబుచ్చేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు రాత్రి ఆహారం కోసం తిరుగుతూ ఆ పిల్లి ప్రమాద వశంచేత ఆ బోయవాడు పన్నిన ఉరులలో చిక్కుపడిపోయింది. అదే సమయంలో కలుగులోనుంచి ఎలుక కూడా పొంచి పొంచి చూస్తూ ఆహారం సేకరించే నిమిత్తం బయటికి వచ్చి తిరుగుతూ ఉరి త్రాళ్ళలో చిక్కుకున్న మార్జాలాన్ని చూసింది. ఇంక పరవాలేదు. పిల్లి తనని పట్టుకోలేదుకదా! నిర్భయంగా ఎరకోసం తిరుగుతూ ఉన్న సమయంలో ఇంకొక ప్రమాదం ఎదురైంది. అదే వేళ ఒక గుడ్లగూబ, ఒక ముంగిస

కూడా మేత కోసం తిరుగుతూ ఉండడం మూషికం కనిపెట్టింది. ఇంకేముంది? ఆ గ్రుడ్లగూబ తనను తన్నుకు పోవచ్చు. ముంగిస తన మీదికిఉరికి పట్టుకొనవచ్చు. ఎలుక హడిలి పోయింది. ఈ రెండింటి బారినుంచీ తప్పించుకునే మార్గం కనపడలేదు. భయం ఆవహించింది. వెంటనే ధైర్యం తెచ్చుకుంది. ఏమిటి కర్తవ్యం? ఉపాయం ఆలోచించింది. నెమ్మది నెమ్మదిగా పిల్లికి దగ్గర దగ్గరగా జరిగి వెళ్ళింది. పిల్లితో ఇలా అంది.

"నువ్వు ఉరి త్రాళ్లలో చిక్కు పడ్డావు. ఆ త్రాళ్లను కొరికి త్రెంచి వేస్తాను. ఉపాయంతో నిన్ను నేను విడిపిస్తాను. నేను ఈ పనికి పూను కొనుట నీ అదృష్టంవల్లకదా! కాని మన వైరం విడిచిపెట్టు! నీ మనసు మార్చుకుని నాతో స్నేహం అలవరచుకో! ఇదిగో! ఇక్కడే నన్ను పట్టుకోవాలని ముంగి పొంచి ఉన్నది. ఎప్పుడు నన్ను తన్నుకుపోదామా అని గ్రుడ్లగూబ చూస్తున్నది. వాటిని చూస్తే నా శరీరం అంతా కంపించి పోతూ ఉంది. నాకు నీ ఆశ్రయం దొరికితేనా! నీ సమీపంలో నిలబడి నీ రక్షణలో ఉంటే నాకేమీ భయంలేదు" అని అన్నది.

ఉరి త్రాళ్లలో చిక్కుపడ్డ మార్జాలం ఈ మాటలు విన్నది. ఇంతకంటే ఏమికావాలి! "నన్ను విడిపించి నా కష్టాలు గట్టెక్కించే ఆర్త శరణ్యుడవు నువ్వు. మహానుభావా! నీకు ఏది ఇష్టమో అది చెయ్యవద్దా! తప్పకండా నీతో చెలిమి చేస్తాను. పరమేశ్వరుడు సాక్షిగా నీకు సహాయం చెయ్యడానికి పూనుకుంటున్నాను. భయం విడిచిపెట్టు. నా అండ నిలబడు. రా! నా దగ్గరగా నువ్వు ఉంటే నిన్ను కబళించడానికేముంగిసకూ గ్రుడ్లగూబకూ ధైర్యం ఎక్కడిది? నా పేరు చెపితే పారిపోతాయి." అని పిల్లి అన్నది.

"అలా అని మనస్ఫూర్తిగా నమ్మడంవల్లనే కదా వచ్చాను. ఇది ఉభయ తారకమైన మార్గం. దీనివల్ల నా ప్రాణాలు నిలుస్తాయి. నీకు విముక్తి కలుగుతుంది. ఇవి రెండూ సత్యమని నిశ్చయంగా నమ్మబట్టే, నా బుద్ధి నిన్ను చేరింది." అని ఆ ఎలుక సందేహాలూ శంకలూ మాని పిల్లి పొదిగిట్లో చేరుకుంది. ఎప్పుడూ ఆ ఎలక పిల్లి కడుపుక్రింద సురక్షితంగా ఉండడం చూచి లాభంలేదని గ్రుడ్లగూబ అక్కడినుంచి తన యిష్టంవచ్చిన చోటికి వెళ్ళిపోయింది. ముంగిసకూడా ఇంకోచోటుకి పోయింది

అమ్మయ్యా! బ్రతికేనురా నాయనా అని సంతోషించింది ఎలుక. ఎప్పుడైతే ఈ గ్రుడ్లగూబ, ముంగిసా అక్కడినుంచి తరలిపోయాయో అప్పటినుంచీ ఆ ఉరిత్రాళ్లు తొందరగాకొరకడం మాని నెమ్మదిగా అటూ ఇటూ కొరకడం ప్రారంభించింది. ఇది పిల్లికనిపెట్టింది. ఇంతవరకూ తొందరగా కొరుకుతూ ఇప్పుడు ఆలస్యం చెయ్యడం గమనించి పిల్లి ఎలుకతో ఇలా అన్నది.

"ఈపని నీకు తగునా? నువ్వు నా సహాయం పొంది కృతార్థుడవయ్యావు. నీ ప్రాణం నిలబెట్టాను. నువ్వు అన్నప్రకారం శీఘ్రంగా ఉరి త్రాళ్లు కొరికి నా చెర విడిపించడం నీ విధి. ఏరు దాటి తెప్ప కాల్చనగునా! నీవు ఇలా ఆలస్యం చెయ్యడం కృతఘ్నత కాక మరేమవుతుంది. ఇలాంటి దుర్బుద్ధి నీకు తగినదికాదు. నీకు మేలు చేసిన నాకు ద్రోహం చెయ్యకుండా ఆలస్యం చెయ్యకుండా త్రాళ్లు కొరకవలసింది."

అందుకు ఎలుక "నిన్ను నేను ఆశ్రయించాను.

నన్ను నీవు రక్షించావు. ఆశ్రితరక్షణుడవైన నీకు కీడు కలగజేస్తానా! అది చెడ్డతనంకాదా! భయంచేత విహ్వాలమైన మనస్సుతో నాకు కాళ్ళూ చేతులూ ఆడడంలేదు. అందువల్ల తొందరగా ఈ ఉరులు త్రెంపలేకపోతున్నాను. అంతేకాని వేరేమీ కాదు. నీ మనస్సులో వేరు విధంగా భావించకు. నేను నీకు ఎగ్గు తల పెట్టడంలేదు. వేటకాడు కనపడ్డాడూ అంటే ఈ త్రాళ్ళు త్రెంచేస్తాను'' అని చెప్పినది.

ఎలుక ఇంకా పిల్లితో ఇలా అంది. "మనము సహజంగా శత్రువులము కదా! నిన్ను ఇప్పుడే ఉరినుంచి తప్పిస్తే ఇవతలకి వచ్చిన నీ బుద్ధి శత్రుత్వంచేత ఎలా మారుతుందో! ఒక్క సత్యం విను!

"...... ....
....ప్రబలుడైన యతనితో
వెరవున సంధియొనర్చియు
గరంబు నమ్మమియ నీతిగాఁగొంద్రుబుధుల్."

నువ్వు బలవంతుడవు. నీతో ఉపాయంగా సంధి చేసికొని ఉపకారం పొందాను. కాని సర్వదా నిన్ను నమ్మవలసిన పనిలేదు. వేటకాడు రావడం చూస్తే నీ మనసు భయంచేత చెదరిపోయి ఇంక ఏమి చెయ్యడానికీ తోచక చెట్టుకొమ్మ మీదకి పారిపోవలసి ఉంటుందికదా నీకు! నేనూ నా కలుగులోనికి ప్రవేశించడానికి అదే సమయం కదా! అందుచేత అప్పుడే నీకు సహాయం చేస్తాను. నామాట నమ్ము. నిజం చెపుతున్నాను. ఇంతకుమించి వేరే ఏమీ చెయ్యతగదని నీకు మాత్రం తెలియదా'' అని ఓదార్చింది.

"ఆవిధంగా నువ్వు ఎందుకు ఊహించాలి? నీప్రాణాలను నేను రక్షించాను. ఆవిధంగానే నువ్వుకూడా నన్ను నమ్మి ఆపదనుంచి వెంటనే తప్పించవలెనుకదా!'' అని పిల్లి అడిగినది.

సరే! తప్పకుండా అలాగేచెయ్యాలి. కాని తొందరపడకు. సమయంకనిపెట్టిచేసిన యత్నం వల్లకదా కార్యం పూర్తిగా ఫలిస్తుంది! అన్యథా భావించక కొంచం ఓపికపట్టి ఊరుకో!

"ఉచితకాల భావ్యమైన
యత్నవిధిగదా సమగ్రఫలత్వంబునొందు"

ఈవిధంగా ఫలిత రోమశులిద్దరూ ఉత్తర ప్రత్యుత్తరములు చెప్పుకుంటూ మాట్లాడుతూ ఉంటే తెల్లవారిపోయింది. కొందరు అనుచరులు కొన్ని వేటకుక్కలను పట్టుకుని వెంటనడుస్తూ ఉంటే వేటకాడు దారుణమైన పెద్ద కత్తి నొకదానిని చేతితో పట్టుకుని అత్యంతవేగంగా, మహాసంరంభంతో భయంకరంగా ముందుకు నడిచివస్తున్నాడు. ఆపాపపు బోయను పిల్లి చూచినది. "ఇంకేముంది? నేనేమి చేయగలను! అదిగో ఎంతవేగంగా వస్తున్నాడో యమదూతలాగు?'' అని భయంచేత వొణికిపోయింది. "భయపడుకు! భయపడకు!'' అంటూ ఎలుక ఆ ఉరిచేరులు వెంటనేకొరికి త్రెంచివేసింది. ఉరి నుంచి బయటపడి భయకంపితమైన మనస్సుతో వేటకానిని తప్పించుకొనుటకు పిల్లి ఒక్కగంతు వేసి పరుగెత్తి చెట్టుకొమ్మమీది తన నివాసం చేరుకుంది. ఎలుక తనకన్నం లోపలికి ప్రవేశించింది. వేటకాడు ఏమిచేస్తున్నదీ తొంగితొంగి చూచింది. పాపం ఆ బోయ ఆతురతతోవచ్చి, ఉరిత్రాళ్ళు నుగ్గయిపోవడంచూచి, తన పూనిక నిష్ఫలం అయినందుకు ఎంతో విచారంతో తిరిగి ఇంటికి పోయాడు.

ఈవిధంగా ఎలుక ఉపాయంచేత తనప్రాణాలు రక్షించుకుని, తనను రక్షించిన పిల్లిని ఆపద నుంచి తొలగించి కృతకృత్యురాలయింది.

కాని, పిల్లి గొప్పతనం ఉప్పతిల్లేలాగు వినడానికి చాలా ఇంపైన మాటలతో మహోప

కారంచేసి, తగిన స్నేహితుని సంపాదించి, అతని సద్గుణాలచేత లభించే సౌఖ్యాలు అనుభవించడం పరిత్యజించి ఇట్లు వేరుగా ఉండడం నీతి విదులు అనుసరించవలసిన మార్గం కాదు. మహాత్మా! నువ్వు భయపడడం బేలతనం. స్నేహంతో ఇంతకుముందు నన్ను నమ్మి నా అండజేరి, భయవిముక్తిపొంది నాకు తిరిగ ఎంతో మేలు చేకూర్చావు. చివరకి నామీద విశ్వాసంలేకుండా ఇలా ఉండడం వల్ల సౌఖ్యం లేదే! రమ్మా! నా సిరిసంపదలలో భాగం పంచుకో! రా! ఖులాసాగా! బలవంతులైన చుట్టాలూ నేనూ నీకు మేలు చేస్తూఉంటే కలిసి మెలిసి ఉండడం ఎంతో మంచిది. నాతో కలిసి ఉండు. నీ శంకలన్నీ విడిచిపెట్టు. నీ కోరికలు తీర్చుకో!'' అని అన్నది.

దానికి పలితుడు ఇలా సమాధానంచెప్పాడు.

“సరే నీవు చెప్పిన మాటలన్నీ సమంజసంగానే ఉన్నాయి. కాని నా మాట విను.

అరులను శత్రులందెలియ
నారయు టెంతయు సూక్ష్మకృత్యమ
వ్వైర వతిదుర్లభం బరులు
వీరననుండియు మిత్రభావముం
బొరయుటయున్ సుహృజ్జనుల
పోలికగల్గియు శత్రుతాగుణ
స్ఫురణమొకప్డు సూపుటయు
జూతుముగాదె ధరిత్రినెల్లెడన్.

అందుచేత నీకు ఎక్కువ దగ్గరగా రావడం తగిన పనికాదు. నువ్వుకూడా ఏమరి నాకు దగ్గరగా ఉండాలనుకోవడం మంచిదికాదు. ఏమంటే బలవంతులైన శత్రువులు తమ ప్రయోజనాల కోసం బలహీనులకు లోబడడం జరుగుతూ ఉంటుంది. ఏనుగులుకూడా దీమంబుల దగ్గర తగులుకుని పట్టుబడడం చతురమతివైన నీకు తెలియదుగనుకనా?

అరియెడ మిత్రభావమొక
యప్పుడు కార్యముపొంటె గల్గిన
న్వైరవున బాముబట్టునెడ
నిక్కము నమ్మకదాని వాతికిం
గరముదొలంగ జేయునరు
కర్జమువట్టి చరించుటొప్పదే
పొరుగుననుండి నీకుహిత
ముం దగజేసెద నెప్డుపంచినన్.

విను. నీకు ఆహారాన్ని నేను! అలాంటి నిన్ను నేను విశ్వసించి నీకు దగ్గరగావస్తే, ఎప్పుడైనా నీ మనస్సు చలించి నన్ను హింసించాలనే సరదా కలగవచ్చు. నీబిడ్డలూ, బంధువులూ నన్నుచూస్తే సహించకపోవచ్చు. దయవుంచి నన్ను క్షమించు. నన్ను ఇలా ఉండనియ్యి'' అని వేడుకుంది.

అంతటితో ఆగక “నిజం చెప్పు! రాత్రంతా వలలో చిక్కి ఆకలితోఉన్న నీకు చలిదిభోజనం కావలసి పిలుస్తున్నావు గాని ఇంక వేరే ముంది? నిన్ను నమ్మి నీ చేరువకు నేనువస్తానా?'' అని అన్నది.

“ఈవిధంగా నువ్వు ఎందుకు భావించాలి! నా ప్రాణాలను రక్షించిన నిన్ను శత్రువుగా తలుస్తానా? నాలో పౌరుషం, కృతజ్ఞత ఉన్నాయి కదా! నువ్వెంత మాత్రం భయపడకు'' అని రోమశు డన్నాడు.

“నీవల్ల నేను బ్రతికాను. నావల్ల నువ్వు వేటకానికి పట్టుపడలేదు. మన ఇద్దరికీ ఈమాత్రం సుహృద్భావం చాలు. ఇంక మనం చేరువగా

రాకూడదు. ఇందుకు దైత్యగురువైన శుక్రాచార్యుని వాక్యములు ప్రమాణం.

బలవంతుడైన శత్రుని
వలన ప్రయోజనము కలిమి దా
గలసియు, నది గడచనగా
దొంగపలయు; నమ్మెనేని తుదిగీడొలయున్.

నమ్మతగనవారిని అసలు నమ్మనేకూడదు. నమ్మతగినవారినైనా ఎల్లప్పుడూ నమ్మి ఉండకూడదు. తనను ఇతరులు నమ్మేలాగు ఉండి ఇతరులను నమ్మకుండా ఉండడం నీతి. ఇదే బ్రతుకు తెరువునకు మూలసూత్రం. అందుచేత నన్ను ఇలా బ్రతకనియ్యి. నువ్వుకూడా బోయవంటివానికి చిక్కకుండా బ్రతుకు. ఇంక పో!" అని చెప్పిన ఎలుక మాటలకు పిల్లి ఎంతో సిగ్గుపడి తన స్థానానికి వెళ్ళిపోయింది. ఎలుక కూడా దూరంగా ఇంకొక కన్నము చూచుకొనిపోయి సముచిత వర్తనంతో సంచరిస్తు సుఖంగా ఉంది.


బలుపగరవలని యాపద
దగులుటకును, రిపుని హీనతరునైన తనుం
గలసికొని బ్రతుకుటకు ని
య్యెలుకయు బిల్లియు పెరవువెరిగించెదగన్.

దీని భావమేమి జవాబులు : 1. తేనెతెట్టె, 2. నుసి పురుగు, 3. కోడిపెట్ట, 4. తలుపు, 5. ముగ్గుకర్ర, 6. పలుతోము పుల్ల, 7. కొబ్బరికాయ, 8. కుర్చీ, 9. వీణ, 10. రైలు.





పాడి పంటలు



ఇజత్ నగర్‌లో ద్వితీయ ప్రణాళికా కాలంలో పశు వైద్య పరిశోధనా కేంద్రాన్ని మరో రెండ్లు కోట్ల ధనం వెచ్చించి అభివృద్ధి చేయాలని సంకల్పించారు. పశుగణాభి వృద్ధికీ, దేశ ఆర్థిక వ్యవస్థకు అవినాభావసంబంధం వున్నది కాబట్టి ఇజత్ నగర్ కేంద్రములో జరిగే పరిశోధనా ఫలితములు దేశక్షేమానికై సామాన్య ప్రజలకు తెలియవలసి యున్నది. అట్టి పరిశోధనా కేంద్రాలను మరికొన్నిటిని ప్రభుత్వము ఏర్పాటు చేయటము చాలా అవసరము

మామూలుగా మన ఇళ్ళలో ఆవులు గేదెలు రోజుకి మూడు నాల్గు శేర్ల పాలు ఇస్తే గొప్ప. లెక్కలను బట్టి మన దేశములో పశువుల లెక్క చాల ఎక్కువే కాని, అవి ఇచ్చు పాలు స్వల్పము. వాటి ఆహార విషయంలో మనవాళ్ళు చూపే అశ్రద్ధే ఇందుకు చాలావరకు కారణము. పాశ్చాత్య దేశాలలో పశువులకు పెట్టే ఆహారానికీ, మన దేశంలో పెట్టే ఆహారానికీ చాలా వ్యత్యాసం వున్నాదని గ్రహించారు. "మానవులకున్నది పుష్టి, ఆల జాతికి తిన్నదిపుష్టి" అంటారు. మనము మన పశువులకు వేసేమేతలో మాంసకృత్తు పదార్థమైన "ప్రోటీన్లు" లు చాలినంత లేవట. మానవులకు సరియైన ఆహారము ఏర్పాటు చేయుటే మనకు చాల కష్టమైన పరిస్థితిలో నున్నప్పుడు, పశువుల ఆహార విషయము మనమెక్కువ శ్రద్ధ తీసికొనక పోవుటలో ఎట్టి ఆశ్చర్యములేదు. కాని, కొన్ని సులభమైనపనుల చే పశువులకు పుష్టికరమైన ఆహారమివ్వగలఅవకాశములున్నవి. అట్టిది పశువులకు మామిడి టెంకలు పెట్టుట. ఈ మామిడి టెంకలో వుండేజీడి పశువులకు చాలా బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగపడు తుందని కనిపెట్టారు. వాటిని సాధారణంగా నిరుపయోగమైనవని పెంట పోగులలోకి పారవేయుదుము ఇవి పశువులకు పెట్టుటవలన ఇజత్ నగర్‌లోని పరిశోధనా కేంద్రములో ఒక్కొక్క పశువు రోజుకు 38 పౌనులు పాలు, ఇచ్చినదట పశువులకు మామిడి టెంకలు పెట్టుట కష్టము కాదు. వేసవికాలంలో మనకు ఆంధ్రదేశములో మామిడి పండ్ల హడావిడి ఆరంభమగును. పండ్లు తినిన తరువాత టెంకలను పారవెయ్య కుండా ఒక చోట కుప్పవేసి పశువులకు పెట్టుట మంచిది. మన గ్రామములలో ఈ రోజులలో ముంజలు తిని తాటికాయలను చెక్కనేయుదురు. వాటితో పాటే ఈ మామిడి టెంకలను పెట్టదగును. కొద్దికాలము క్రితమే కొన్ని పరిశోధనల ఫలితముగా మొక్కజొన్న కండెల బొండ్లు పశువులకు చాలా ఉపయోగమని చెప్పిరి. కావున ఈ మామిడి టెంకలు. మొక్కజొన్న బొండ్లు, తాటికాయ చెక్కలు పశువులకు పెట్టుటలో సూక్ష్మములో మోక్షము కలుగును ... కొంచెము శ్రమపడి వీటి నన్నిటిని పారవెయ్య కుండ జాగ్రత్త చేసుకొనవలయును. ఒకటి రెండు సంవత్సరములు జాగ్రత్త చేసుకొనిన అదియే అలవాటు కాగలదు. ఆ పైన ఎట్టి కష్టముసుండదు కొంచెము కష్టపడి అలవాటు లేని పనిని అలవర్చు కొనిన కుటుంబములోని సభ్యుల కందరకు సమృద్ధిగా పాలు దొరకగల అవకాశము కలదు. కష్టే ఫలి!

తమ్మి యిల్లాలు

శ్రీ కాసారపు తాతయ్య

(ఇందు పద్మ మొక పతివ్రత గా; సూర్యుఁ డామె వరుని గా గ్రహింపఁ బడి; దైవ విధిచే భర్త తనను విడువఁగ ఇంత నామె ఏ విధముగఁ దన సమయమును గడపుచుఁ దిరిగి భర్త నుఁగలియునప్పు డామె ఎట్లు వర్తించునది వర్ణింపఁ బడుచు సుత్తమ స్త్రీ ధర్మము వ్యంగముగ వివరింపఁ బడినది)

మ॥ పతి నే దైవము గా భజించి సుతులన్ బ్రాణాల తో నీడు గా
మతి భావించి భవాంబు ధిన్ గడచు భామా రత్నమున్ మింతు వీ
వు, తటాకావసదమ్ము నందు నళులన్ బోషింపు చున్ భానుఁ డే
గతి నా కంచు సరోజినీసతి! కనంగా నాత్మ నాశ్చర్య మౌ!

చ॥ ఇనుఁ డల పశ్చిమాద్రి కొఁగి నేఁగినఁ; జంద్రుఁడపార కాంతిఁ దూ
ర్పున నుదయింపఁ గాంచి; పరపూరుష మోమును బెద్దఁగాఁ గనన్
జనునె? యటంచు నెంచి వదనమ్మును నొయ్యన దించి సత్ప్రథం
బును నెఱుఁగంగఁ జేసెదు ప్రబోధిక! నీకు సమాను లే రిలన్!

ఉ॥ నీ వటు లేఁగి నట్టి మగనిన్ బలుమారు లెదందలంచి యెం
తో విలపించి తుట్టతుద కుద్గతి ఖేదము తోడ నెట్టు లో
పోవఁగఁ జేయుచున్ నిసినిఁ, బ్రొద్దుట ముందుగ వత్తు నంచు హా!
నా వరుఁ డంపె జాబని మనంబున నెంతువు వేఁగుఁ జుక్కనున్.

చ॥ వెఱవు నుఁ బొందు దేల చెలి! పృథ్విని నబ్జజు వ్రాఁత తప్పు నే?
యరయఁగ నేరి కైన నది సాదర సూక్తుల బుజ్జగించె నాన్
గెరల విహంగ పంక్తి; విని నెమ్మది గా నవు నన్న రీతి నా
చెఱువున నూఁగు చుందు సరసీరుహ రాజమ! సొంపు మీరఁగన్

ఉ॥ పోయిన వాఁడు రాఁడని యపోహము పొందితె వెఱ్ఱిదాన! యం
చాయుద యించు చున్న తఱి నల్లన నంశుకరాలఁ దాఁకెనే
మో యన నీదు మేనఁ గిరణోత్కరముల్ గవయంగఁ జేయు చిం
కో యమ! రాఁగ నీ నొసటి కుంకము భాస్కరుఁ డంత భక్తితోన్

చ॥ వరునకు మ్రొక్కి లేచి, మఱి వారిజమా! హిమ బిందు బాష్పముల్
దొరలఁగఁ బత్ర నేత్రముల దొంతర లై యరు సంపు బెంపు నఁ
బరు గిడి పర్వె నీ మొగము నన్నవు నా మొన లావు లింతు ము
ప్పిరి గొనుఁ బ్రేమ భావమున వేయి వెలుంగుల సామిఁ జూచుచున్

కం॥ కల కల లాడుచు స్వర్గము
టుల నొప్పఁగఁ జేతు వా మడుఁగు: సడలిన దీ
ప్తుల నీను దివ్వె లేమిని
వెలవెల నగు వేశ్మ మట్లు వెలవెలఁ బోవున్.

తే॥గీ॥ అమ్మ! నీ ప్రవర్తనము నిజమ్ము గాను
భర్తృ సేవాపథ చ్యుతా బల జనమున
కలరు నాదర్శ మై! దీని నరసి నడుచు
కాంతలకు నౌ యశోదాయకంబె భువిని.

తిరుమ లేశ?

శ్రీ చదలవాడ కోటినరసింహము

పగలు రేయియనక యగచాట్లు పడి లోభి
చీకు కంపలోనఁ జేర్చు ఫలము
బాటసారి నోటఁ బడుఁగద యా మాట
దీని భావ మేమి? తిరుమ లేశ!

ఇంతలేదు చూడ నెక్కడనో యుండు
విత్తనములు లేవు, పిండికొట్టు
కొట్టినట్టి పిండి మట్టి పాలగుచుండు
దీని భావ మేమి? తిరుమ లేశ!

కన్నబిడ్డ మీఁదఁ గనికరమే రాదు
మనుమరాలి తోడు మానలేడు
పుత్రిఁ జంపి, పౌత్రిఁ బోషించు మనముందు
దీని భావ మేమి? తిరుమ లేశ!

ఒంటి కాలిమీఁద నుండు, నిల్వుగ నుండు
వచ్చి పోవుచుండు, వలసి నపుడు
గడప దాఁటకుండు, కాపరిగా నుండు
దీని భావ మేమి? తిరుమ లేశ!

కట్టు గాని కట్టు కంటం బడకయున్న
కంటి వెంట నీరు కాఱకున్నె?
రెండు కట్టు లున్న శ్రీ విలసిల్లదే?
దీని భావ మేమి? తిరుమ లేశ!

వచ్చి యొకటి తాను బదునాఱిటిం దాఁకి
వందయయ్యె, రెండు బ్రద్ద లయ్యె
వంగిపోయె, నేలపాలయి పోయెను
దీని భావ మేమి? తిరుమ లేశ!


మూఁడు కన్ను లుండు, భూతేశ్వరుఁడు గాఁడు
కాళ్ళు, చేతు లేవొ కానరావు
డొక్క పగులఁ గొట్టఁ గ్రుక్కెఁడు నీర్గ్రుక్క
దీని భావ మేమి? తిరుమ లేశ!

కాళ్ళు చేతులుండుఁ గదలదు మెదలదు
పైనఁ గూరుచున్నఁ బలుకకుండు
గౌరవమ్ము గల్గు గదులయందు వసియించు
దీని భావ మేమి? తిరుమ లేశ!

కాయమీఁద మ్రాను కట్లు కట్లుగ నుండు
మ్రానుమీఁదఁ దీఁగె లానకుండు
తీఁగె తాఁకునెడల మ్రోఁగు నిస్వనములు
దీని భావ మేమి? తిరుమ లేటి!

ప్రాణమింతలేదు, పరుగెత్త నలయదు
గొంతు లేదు, పెద్ద కూఁత కూయు
బొగ్గు నములు, నీరు బుడ బుడ మని మ్రింగు
దీని భావ మేమి? తిరుమ లేశ!

దీని భావం 33 వ పేజీలో చూడనగును



కరణము వైదికుఁ డైనన్
మరణాంతక మౌనుగాని మానదె? అకటా!
కరణీకము వైదికులును
సరి చేసిరి, పరులొనర్పఁ జాలిరి సుమతీ!

కులములు వృత్తుల వలనన్
గలిగెన్, మానవు లొనర్పఁగల రే దైనన్
కలహింపఁ జనునె? వృత్తుల
వలననె నీచోచ్చ దశలు పరఁగునె? సుమతీ!

కోమటిపైఁ గరణముపైఁ
బ్రేమమ్మున సుమతి శతక కృతికారుఁడు మున్
నేమమ్ము దప్పి వ్రాసిన
ఆ మాటలు బూటకమ్ము లౌఁగద సుమతీ!

కరణమును మ్రింగు వారికిఁ
గఱవా యూరూర? మనము గాంచుట లేదా?
షరికిం బ్రాణము వైశ్యే
తరుఁడును గాఁగలఁ డటన్నఁ దప్పా? సుమతీ?

కనలిన భస్మ మొనర్చును
కనికరముం గనిన బ్రదుకుఁ గల్పించును గా!
ఘనుఁడు కవీశ్వరుఁ డాతని
కెన గాఁ డెవఁడేని, నిక్కమే యిది సుమతీ!

వాఁత మరణించు వఱకే
రోఁతగఁ గన్పట్టు; సుకవి రోషముతోడన్
వ్రాఁత యను వాఁత పెట్టిన
రోఁత తొలంగదు సుమీ! ఎఱుంగుమి సుమతీ!

కత్తెర వడ్డీచే ఋణి
కుత్తుక నొత్తుచును వేలు కూర్చెడు వానిన్
మిత్తిగొన; దతఁడు దానికి
విత్తము లంచముగ నెంత వేసెనొ! సుమతీ!

"ఇబ్బంది తీర్చుకొని, నీ
డబ్బులు నీ కిత్తు" అని యొడంబడికలచే
గొబ్బునఁ గైకొని, ఈయక
అబ్బాయిగ ముద్దు దీర్చు, నాతఁడు సుమతీ!

అప్పుఁగొని పప్పు కూడున్
గొప్పగదా యంచు మెక్కఁగూడునె యెవడున్?
తిప్పలు తప్పవు దానన్
మెప్పొందుమి! అప్పుఁగొనక మెలఁగుమి సుమతీ!

ఇచ్చునతఁ డుండెఁ గద యని
పెచ్చగు వడ్డికి ఋణమ్ము విరివిగఁ గొను నా
ముచ్చుల గచ్చుల మెచ్చిన
పచ్చని కాఁపురము లెన్నొ పాడగు సుమతీ!

తెలుగు కవితలోని జాతీయత

శ్రీ దాసరి వేంకటకృష్ణయ్య

విదేశీయుల పరిపాలనా కాలంలో స్వాతంత్ర్యంకోసం పోరాడటం ఒక ప్రధాన సమస్యగా తయారైంది. 11. శతాబ్దంలో మహాభారతాన్ని ఆంధ్రీకరించిన నన్నయ, రాజరాజ చాళుక్యునిచే పరిపాలింప బడిన వేంగిదేశాన్ని గురించి సుందరమైన వర్ణన యిచ్చివున్నాడు. అధిక కల్పనాశక్తిగల గోదావరినీరు (గోదావరి నీళ్ళు త్రాగితే కవిత్వం వస్తుందని ఒక వాడుక) ఈ కవికి ప్రియమైనది 15 శతాబ్దంలో శ్రీనాథమహాకవి తను వ్రాసిన "భీమేశ్వరపురాణము"లో దాక్షారామాన్ని భూతలస్వర్గంగా పేర్కొన్నాడు. కాని, తన "పల్నాటి వీరచరిత్రము"లో ప్రజా పీడనాన్ని నిర్మూలించటానికి ప్రతిఒక్కరూ నడుం కట్టాలని ఉద్బోధించాడు. శ్రీనాథుని కొండవీటి పద్యాలు ఈ నాటికిగూడ మనఃపూర్వకముగా కంఠస్థము చేస్తున్నారు.

తెలుగు కవుల దేశభక్తి కేవలం స్థానికమైంది మాత్రమేకాదు—దేశవ్యాప్తమైంది కూడా. కవితకు విజయనగర సామ్రాజ్యము పెట్టనికోట "సేతు- శీతనగ- మధ్యార్వి"- అనగా దక్షిణాన రాముడు కట్టిన వారధికి, ఉత్తరాన హిమాలయ పర్వతాలకీ మధ్యనున్న భూమి అని అర్థం. ప్రాచీన భారతదేశపు రాజులైన నలుడు, హరిశ్చంద్రుడు, దుష్యంతుడు- ఈ మొదలైన యితిహాస నాయకులంతా తెనుగు కవితలో స్తుతింపబడిన వారే. ప్రబంధాలకి వారి జీవితాలే ఆధారమైనవి. శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన కవులు మహమ్మదీయుల దండయాత్రనుంచి సంస్కృతిని స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకొనుటకు తోడ్పడి ప్రజామన్ననలకు పాత్రులయారు. ఆ విధంగా కర్ణాటకులకు, ఆంధ్రులకు కృష్ణదేవరాయలు పరిపాలకుడే కాదు-"హిందువులకు సురత్రాణుడు" అనిగూడ చెప్పవచ్చును. కాలము గడచిన కొద్దీ హిందువులకీ, మహమ్మదీయులకీ మధ్య అనుకూల్యము హెసగినది. ఆ రోజుల్లోనే ఒక ప్రఖ్యాత కవి శ్రీ అద్దంకి గంగాధరుడు గోల్కొండ — కుతుబ్— సాహీలకి ఒక కావ్యాన్నిగూడ అంకితము చేశాడు.

దేశీయ సంస్కృతిమీద బ్రిటీష్‌వారి పరిపాలనా ఒక మార్పునుతెచ్చిపెట్టినది. గతమధ్యశతాబ్దములో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వివిధసంస్కృతులలో కృతార్థమైనవి. (పశ్చిమ సాహిత్యము, శాస్త్రము ఆంధ్రులమీద పడింది) కవులు కొత్తపద్ధతిలో రచనలు చేస్తూ వచ్చారు. దేశంలో ముందుగా బెంగాల్ దారి చూపించింది. బకించంద్రుని "వందేమాతరం" ప్రతివారినోటావినవచ్చింది. ఆ విధంగానే తెనుగులోగూడ నదులు, కొండలు, ఆంధ్రనాయకులనుగూర్చి శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు, యింకా కొందరు ప్రబోధగేయాలు వ్రాశారు. "దేశమును ప్రేమించుమన్నా" అంటారు కీ॥ శే॥ గురజాడ అప్పారావు. అంతేకాదు - "దేశమంటే, మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని ప్రజానీకాన్ని మేల్కొలిపాడు. ప్రణయ కవితకు పునాది వేసిన శ్రీ రాయప్రోలు సుబ్బారావుకుగూడ దేశమంటే ప్రేమవుంది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా యెవరెదురైన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండుగర్వమ్ము
లేదురా యిటువంటి భూదేవియెందు,
లేరురా మనవంటి ధీరు లింకెందు!"

ఇది సుబ్బారావుగారు 40 సం॥ క్రితం పాడారు. ఆంధ్రోద్యమము ఆయన్ని ఉద్రేకపరచి అమరావతి, వరంగల్లు, విజయనగర ప్రాచీన వైభవాల్ని ఆంధ్రులకు జ్ఞప్తి చేశాడు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గూడ ఈ కోవలోకే వస్తారు. ఆయన "ఆంధ్రపౌరుషము" మరపురానిది. ఈ పుస్తకమే ఆయన్ని ప్రథమశ్రేణి కవిగా గుర్తించటానికి తోడ్పడింది, యింకా ఆయన తన "ఆంధ్ర ప్రశస్తి" లో పరాకాష్ఠ నందుకున్నాడు. శ్రీ సత్యనారాయణకి అందుబాట్లోనే కొడాలి సుబ్బారావుగారున్నారు. ఈయన "హంపీ

క్షేత్రము" మరుద్దామన్నా మరపురానిది. శ్రీకృష్ణదేవరాయలు, తిమ్మరసుల పరిపాలనలో వున్న విజయనగర వైభవాన్ని కవితలో చిత్రించారు సుబ్బారావుగారు.

శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి (అభినవ తిక్కన) "రాష్ట్రగానము" ఆంధ్రులదేశభక్తి మొ॥వాటిని సంక్షిప్తంగా చిత్రించారు. మహాత్మ గాంధీగారి సత్యం–అహింస సిద్ధాంతం ఆంధ్రులసంస్కృతిమీదా బాగాపడింది ముఖ్యంగా కవులని–శ్రీ బసవరాజు అప్పారావుగారివంటి వార్ని ఆకర్షించింది. అప్పారావుగారి దాయాదులే నండూరి సుబ్బారావుగారు విశాలాంధ్ర అంతటా ప్రఖ్యాతి చెందిన "ఎంకిపాటలు" వీరివే.

శ్రీయుతులు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు "సౌందర్యనందం"లో బౌద్ధాన్ని చక్కగా చిత్రించారు. తెలుగులో యింతవరకు యింతటి పుత్తమ కావ్యం లేదంటే అతిశయోక్తి కాదు.

శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొరతనము" అనేపాట బాగా ప్రఖ్యాతి పొందింది. ఆంధ్రదేశమంతటా మార్మోగి పోయింది. ఆ పాట వ్రాసినందుకు అప్పటి ప్రభుత్వంవారు సత్యనారాయణగార్ని అరెస్టు చేశారు. జైళ్ళలోగూడ ఆంధ్రేతరులు ఈ పాటనేర్చుకొని వారివారి స్వస్థానములకుపోయి వినిపించారు. ఆ రోజుల్లో జాతీయగీతాలకు బాగా ప్రశస్తివుంది. మోతీలాల్ నెహ్రూ చిత్తరంజన్‌దాస్ - యింకా ముందుకువస్తే జవహర్‌లాల్ నెహ్రూ. సుభాస్‌చంద్రబోస్ మొ॥ వారి ప్రశంశలనందినవి. కొన్ని నాటకాలుగూడ జాతీయతను ప్రతిబింబిస్తూ రచింపబడినవి.

ఆంధ్రోద్యమములో నాయకులైన టంగుటూరి ప్రకాశం దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య మొ॥ వారు సాహిత్యవేత్తలుగా, జాతీయనాయకులుగా పేర్కొన దగినవారు.

ఇప్పుడు స్వాతంత్ర్యం లభించింది కవుల కలలు సార్థకమైనవి. దీనికిమార్గదర్శకుడు శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు తెనుగు కవితలో యింకాజాతీయత వెల్లి విరుస్తుందని ఆశిద్దాం.

("త్రివేణి"లోని వ్యాసం (ఆంగ్లం) ఆధారంగా)

బృహత్కథ

రచన :
ధవళ నాగేశ్వర్

టేబిలుముందు కూర్చుని కథ వ్రాస్తున్నాను. ఎవరో గదిలోకి వస్తున్నట్లయింది. కలం క్రిందపెట్టి, వెనుకకు తిరిగిచూశాను. అరవై సంవత్సరాల ముసలతను కర్ర చప్పుడు చేస్తూవస్తున్నాడు. "కథలువ్రాసే నాగేశ్వర్ ... నువ్వేనా ..." అన్నారాయన కొంచం దగ్గరగావచ్చాక.

"అవును నేనే...నా జీవితం ఎప్పుడో సాహిత్యాని కంకితమైపోయింది. ఈ కుర్చీమీద కూర్చోండి...." అన్నా క్రిందకూర్చోబోతున్న ఆయనుద్దేశించి. "అక్కర లేదు నాయనా...." అంటూ నేలమీదే చతికిలబడ్డారు. కర్రను క్రిందపడుకోపెట్టి, పైమీదున్న మాసిన తువ్వాలు మడతలతో ముఖం తుడుచుకుంటున్నారు. సంభాషణ నడిపించడం నాకు చేతకాక ఆలోచిస్తున్నా - నా బుర్రకు అతనెవరో తట్టడంలేదు.

అతనే అందుకుని "నేనెవరా ? అని ఆలోచిస్తున్నావు. అంతేనా ? నాపేరు వైకుంఠం. రిటైర్డు ఎలిమెంటరీ స్కూలు టీచర్ని...." తనని తానే పరిచయం చేసుకున్నారు ....తగినహుంథాలో.

"ఓహో . మీరా...! మీ అమ్మాయిపెళ్ళికి రాలేక పోయాను..." అంటూ కథని డ్రాయర్‌లో పడేశాను.

"ఉద్ధరించావ్ .... నామీద అవాకులు చవాకులు కల్పించి ఎందుకు వ్రాశావు ? నేనిలా బ్రతకడం నీకిష్టం లేదా యేం ??...." సూటిప్రశ్న వేశారు వైకుంఠగారు. కవినిరంకుశుడని అతనికి తెలీదుకాబోలు.

"పదహారేళ్ళ మీ పార్వతిని, ఏభై సంవత్సరాల ముసలివాడికిచ్చి పెళ్ళిచెయ్యడం ; ఆమొండిచెయ్యి ముసలి పెండ్లికుమారుడి వద్ద తమరు ఐగువందలు పుచ్చుకోవడం ; ఏమంత సబవుగావున్నాయని .. " ధైర్యంగానే అంటున్నాను.

"ఆగు నాతండ్రీ ! నేను నాకూతుర్ని అమ్ముకున్నంత లోకసాయివాడినైపోయానా...ఇప్పుడు మగరాయుళ్ళను వేల వేలకు అమ్ముతున్న పెద్దలెవ్వరో ...? వాళ్ళకి గడ్డిపెట్టే దమ్ముల్లేవు నీకు ..."

"మీరెన్ని చెప్పండి. మీరు చేసింది ఘోరపాపం. అందుకే నేను కథగావ్రాశాను. నేనిప్పుడు వ్రాసినది కట్నాల సమస్యే...."

"నేను చేసింది పాపమో ; పుణ్యమో నీకేమితెల్సు. అబ్బాయీ ! నన్నడగకుండ నామీద అభాండాలు నిన్నెవరు వ్రాయమన్నారు..." డేమేజీ దావా వేస్తానంటూందాతని ముఖం.

"క్షమించండి...పోనీ యిప్పుడడుగుతున్నాను. శెల వియ్యండి..." నమ్రంగా అడిగేను.

"అలా దారిలోకి రానాయనా ! కాళ్ళీడుచుకుని, యింత దూరం అందుకేవచ్చాను. శాంతంగా విను. అవసరమైతే వ్రాసుకో..." అని ముఖాన్ని ఓమారు భుజంమీదున్న చింకి తువ్వాలుతో తుడుచుకుని ప్రారంభించారు వైకుంఠంగారు.

...."నేను పదిసంవత్సరాల క్రిందట ఎలిమెంటరీ స్కూలు టీచరు గిరీనుండి రిటైరయ్యాను. నామొదటి యిద్దరు కూతుళ్ళకు కష్టపడి ఎలాగో పెళ్ళిళ్ళుచేశాను. అప్పుడు కట్నాలు లేవు కనుక సంబంధాలు మంచివే దొరికాయి. నాయేభైయ్యో పడిలో పార్వతి జన్మించింది. ఆనాడు నేనెంత విచారించానో సర్వేశ్వరుడికి తెలుసు. పుట్టిన నాల్గుసంవత్సరాలకే తల్లిని దివికి పంపించింది. పార్వతి ఇక నా అవస్థవేరే చెప్పాలా ? రిటైరైనా రాత్రి పగలు ప్రయివేటులు చెబితేనేగాని దినాలు గడిచేవికావు. ముసలికాలంకదూ. ఎన్నాళ్ళు ప్రయివేట్లు చెప్పేశక్తి వుంటుంది. ఐదేళ్ళయింది దృష్టి తగ్గింది. ఇక నాలాంటి వాడి జీవనోపాధికి మార్గమొక్కటే. నాలుగువీధులూ యాచించి తెచ్చేవాడిని, పాపం ! పార్వతి నాకు ముసలి కాలంలో సంరక్షణ విసుక్కోకుండా చేసేది. నాకడుపున పుట్టి ఏం సుఖపడింది. తన పదేళ్ళనాటినుండి నాకు చాకిరీచెయ్యడంతోనే సరిపోయేది . ." కళ్ళనుండి ప్రవహించే, అశ్రుధారలను తుడుచుకుని, మళ్ళా ప్రారంభించారు వైకుంఠంగారు.

—.“ఈరోజుల్లో స్కూలుఫైనలు పోయినవాడికి వెయ్యినూటపదహార్లు కట్నం. నాస్థితి చెప్పానుకదా! నేనెలా పార్వతికి పెళ్ళిచెయ్యగలను? ఏదో దాన దృష్టమో, దురదృష్టమో వెంకన్న పంతులు సంబంధం వచ్చింది. దాన్ని కాళ్ళతన్నుకుంటే మరొకటి వస్తుందని నమ్మకమేమిటి? నా యీ స్థితిలో బంధువులు దూరంగా వుంటారని చెప్పక్కరలేదనుకుంటా. పార్వతికి పదహారేళ్ళు నిండాయి. గుమ్మందగ్గర సంస్కర్తలు తచ్చాడుతున్నారు పెళ్ళిచేసుకుందికి ఏ ఒక్కడికి కరేజాలు లేవు. కాని ఏదో కావాలిట. నాయినా! కడుపుకోసం యాచించినా, మానాన్నమ్మకునే అవినీతికి పాలుపడలేదు. నేనూ ఆలోచించే యీ సంబంధంచేశాను. నాకూతురి శ్రేయస్సు కోరేవాళ్ళు నాకన్నా యింకెవరున్నారు? అమ్మాయికి తిండికి గుడ్డకి లోటుండదు. వర్కుషాపుపనిలో చెయ్యి పోయింది. అప్పటినుండి వాచ్‌మేన్‌గా పనిచేస్తూ, నాల్గురాళ్ళు సంపాదిస్తున్నాడు. వయసులో పెద్దవాడేమరి. చిన్నవాడెలా దొరుకుతాడు చెప్పు. ఏదో దానినో అయ్యకప్పగించాను కనుక నిశ్చింతగా నిద్రపోతున్నాను . .”

“మీరు చెప్పేవి వింటూవుంటే జాలికల్గుతోంది. కాని మీరు వెంకన్నపంతులు దగ్గర ఐదువందలు పుచ్చుకోడంలో, ఎంతైనా స్వలాభంకనబడుతోంది . .” అన్నాను.

“నిజమే! కీడెంచిమేలెంచాలి. అతడుగుటుక్కుమన్నాడంటే, దానిగతేం కావాలి? ఆ సొమ్ములో దమ్మిడీయేనా నేను ముట్టానా? అంతా దానిపేర బ్యాంకిలో వేయించాను. లోకం నన్ను దూషిస్తోంది. ‘ముసలివాడికిచ్చి దానిజీవితం నాశనం చెయ్యకపోతే, ఏనూతులోనో గోదులోనో త్రోసికూడదూ . .” అంటోంది పక్కింటి సూరమ్మ. అలాచేస్తే దాని జీవితం బాగు చేసినట్లవుతుంది కాబోలు. ముసలాడ్ని . . ఎక్కువగా మాట్లాడలేను. నామీదమాత్రం అన్యాయంగా కల్పించి వ్రాయకు . .” అంటూ బరువుగాలేచి, మెల్లగా నిష్క్రమించారు వైకుంఠంగారు.

నలభయ్యో నెంబరు కనకాంబరంరంగు చీరకట్టుకుని వస్తోంది ఓజవ్వని. బహుశాః పార్వతైవుంటుంది. దగ్గరకు వచ్చాక “ఏం? పార్వతీ! మీ నాన్న యిప్పుడే వెళిపోయారు . .” అన్నాను.

“సరేకాని . . మీరు నేనాత్మహత్య చేసుకున్నానని ఎందుకు వ్రాశారు? నన్నవమానపర్చడం మీకు న్యాయమేనా? . .” దీనంగా ప్రశ్నిస్తోంది పార్వతి.

“బలవంతంగా మీ నాన్న నిన్ను ముసలాడికి కట్టబెడితే, నీకు ఆత్మహత్య చేసుకోవాలని బుద్ధిపుట్టలేదూ?” క్రాస్ ఎగ్జామిన్ చేసేను.

“మీరెంత కఠోరంగా మాట్లాడుతారండి. మా నాన్న నాకు బలవంతంగా పెళ్ళిచెయ్యలేదు నేనొప్పుకున్నాకే చేశాడు. నాకోసం అష్టకష్టాలుపడిన మా నాన్న సుఖంగా ప్రాణాలు విడవడమే నేను కోరేది. నాకిప్పుడు సుఖంగానే వుంది. మా నాన్నకు విచారం తీరిందికదా అని సంతోషిస్తూంటే; మీరు నేను కష్టాలుపడలేక నూతులోపడి ఆత్మహత్య చేసుకున్నానని వ్రాశారు. ఎంత అన్యాయం తలపెట్టారండి. ఏపాపము యెరుగని నేనా దొరికాను మీకు. చనిపోతే, మళ్ళాజన్మలో యింతకన్నా సుఖపడతానని గ్యారంటీ ఏమిటి? అలాంటి పాడుదేశాలు నాకులేవే . .” పాత్రల్ని ఖూనీచేస్తే దెయ్యాలై పీడిస్తారని నాకు గట్టి నమ్మకమే కలిగింది. మతిపోతున్నట్లనిపించింది. ఎలాగో నచ్చ చెబుదామని . . “కథనలా ట్రేజడీచేస్తేనే రక్తి కడుతుంది ఈరోజుల్లో సతీసావిత్రి సక్కుబాయి . . కథల్లాగ వ్రాస్తే, ఎవడు చదువుతాడు. కథ చదివిన తర్వాత పాఠకుడు కష్టాల కడలిలో పార్వతిని తల్చుకుంటూ వాపోతాడు. అప్పుడే సంఘంలో సంస్కరణకి అవకాశంవుంటుంది. విప్లవం బయలుదేరుతుంది . .” అని నాసోదె ఏకరవుపెడుతున్నాను.

ఇంతలోకి “ . . పారూ! . .” అంటూ బాణంలాగ దూసుకువచ్చేడు వెంకన్నపంతులు. వాచ్‌మేన్‌కదూ కాకీ యూనిఫారం. తెల్లగా ముగ్గుబుట్టలాంటి తల. పంతలు భ్రుకటిని పైకెత్తి, మీసంమెలివేశాడు. అతనికో చెయ్యిలేదు కనుక ధైర్యంగా నిలబడ్డాను.

“నువ్వు ఏమన్న పెద్దమనిషివయ్యా! నాగురించం తలా కల్పించి వ్రాశావ్ . .” మొదలుపెట్టాడు పంతులు . . “నాకూ మానసిక ప్రవృత్తున్నాయి. వర్కుషాపులో పనిచేస్తున్నప్పుడు, మీదనుండి ‘క్రయిన్’ పడి నా చెయ్యిపోయింది. నాకప్పుడు యిరవైరెండు సంవత్సరాలు. వెయ్యి రూపాయిలు ‘కాంప్‌న్‌శేషన్’ యిచ్చి, వాచ్‌మేనుగా బదిలీచేశారు. నాకింతవరకూ మొండివాడి

నని ఎవరూ పిల్లనివ్వలేదు. ఒక చెయ్యిలేనంతమాత్రానికి పెళ్ళిచేసుకునే అర్హతలేదుకాబోలు. వైకుంఠం స్థితి చూశాక నాకు జాలికల్గింది. పార్వతిని యిమ్మని అడిగాను. తండ్రి కూతురు అంగీకరించారు. పెళ్ళిచేసుకున్నాను. నేను మీలాగ కట్నానికమ్ముడు కాలేదు. ఐదువందలిచ్చి మరీ తెచ్చుకున్నాను పార్వతిని. మేమిద్దరం సుఖంగావుండడం నీకిష్టలేదేమిటి? మాట్లాడవేం? .." అని గర్జించాడు వెంకన్నపంతులు.

.. "నేనేకాదు ప్రపంచమంతా కోడై కూస్తోంది. కథకుడ్నికాబట్టి వ్రాశాను. మీరు బాధపడనక్కరలేదు. స్టాంపు అంటించమరచి పోష్టుచేశాను. తిరిగివచ్చేస్తూవుంటుంది. దాన్ని మీ ఎదుటే చించేస్తాను" .. అని సమాధానపర్చాను.

"పదవే పారూ! ఆ కథ పబ్లిష్కాని వీడిభరతం పడతా .." అని పార్వతితోసహా వెంకన్నపంతులు వెళ్ళిపోయాడు.

నేనొక వేడినిట్టూర్పువిడిచి, కుర్చీలోకూలబడ్డాను .. "అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు .. లవ్ స్టోరీ వ్రాస్తావేమిటి?" అన్నకొండయ్య మాటలు విని తలపైకెత్తాను.

"బ్రదర్! ప్రేమకథ లెవడికి కావాలి. చూడు నాగరికత పెరుగుతున్నా, సంఘంలో ఎంతకుళ్ళువుందో. ఆ ముసలి వైకుంఠంగాడు కూతుర్ని ఐదువందలకు అమ్మేశాడుట. 'సోషలిష్టిక్ పేట్రన్ ఆఫ్ సొసైటీ'లో కూడ, యిటువంటి రాతియుగపు చర్యలున్నాయంటే సిగ్గుసిగ్గు. వాస్తవికతను చిత్రిస్తేనే రచయిత పురోగమించగలడు. దీన్ని ఓకథగా వ్రాయి. అప్పుడు ఆంధ్రదేశంలోనీ కొకస్థానం. నీకు స్నేహితుడిగా నాకోస్థానం లభిస్తాయి .." అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు కొండయ్య. డ్రాయర్‌లోని కథను పైకి తీశాను.

.. "నేనసలు కథలు వ్రాయదల్చుకోలేదు .." అంటూ టేబిలుమీదనున్న కాగితాలను 'ఫ్రు'న చించేశాను.

"ఏమిటండీ కలవరింతలు .. నిక్షేపంలాంటి చీరను ?ంపేశారు .." అని మా ఆవిడనగానే ఉలిక్కిపడ్డాను.

?(.. ఏదో పీడకల. పాతచీరేగా.

చిగురించిన ఆశలు

శ్రీ. ద్వారకా జవహర్

"శశీ!, నాకథలు మనిద్దరం తప్ప యింకెవరూ చదువరనే దానివి – మన బాబుకూడ యింక చదువుతాడులే!" అన్నాడు రమేశ్ తన కథ అచ్చైన పత్రికని శశికిస్తూ –

"ఔను, నాన్న – నాకు అప్పుడే 'అఆ'లు వచ్చాయా. అన్నీ నేర్చుకొని నీపుస్తకాలు చదువుతాలే" అని ముద్దుగా పలికాడు.

"అబ్బ చాలండి, యెలాగైతేనేం నేర్పారు మీ అబ్బాయికి అ, ఆలు" అంది శశి, తండ్రి కొడుకులను చూచి మురిసిపోతూ. తరువాత రమేశ్ బాబుకి చదువు చెప్పడంలోనూ, శశి పత్రిక చదువడంలోనూ నిమగ్నులయ్యారు.

రమేశ్, శశిలది నిర్మలమైన దాంపత్యం. వారి నోములపంటే చిన్నారి నాలుగేండ్ల బాబు. వారి వివాహానికి ముందు జరిగిన చరిత్రే మీరిపుడు చదువబోయేది.

♦ ♦ ♦

శశి జానకిరామయ్యగారి ఏకైక సంతానం. జానకిరామయ్యగారు డివిజినల్ ఇంజనీరుగా వుండేవారు. శశి మాతృమూర్తిని గోల్పోయింది. వారింటి మీదివాటలోనే రమేశ్ వుంటూ లయోలా కాలేజీలో బి.ఏ. చదువుతుండేవాడు. శశికూడ స్కూలుఫైనలు చదువుతుండేది.

ఒకరోజు రమేశ్, శశిలకి మెల్లగా పరిచయం కలిగింది. రోజూ యేదో సమయంలో వారిద్దరూ కలసుకొనేవారు. శశి కొంటెప్రశ్నలేసి రమేశ్‌ని ఆడించేది. రమేశ్ వ్రాసిన కథలు అప్పుడప్పుడు పత్రికలలో వస్తుండేవి. వాటిని శశికి చూపించేవాడు రమేశ్. శశి లోపల ఆనందించినా "ఈ కథలు నీవు నేను తప్ప యింకెవరూ చదువరులే!" అని గేలిచేసేది.

ఒకరోజు జానకిరామయ్యగారికి బదిలీ ఔతోందని శశి రమేశ్‌తో చెప్పింది. రమేశ్ యెంతగానో విచారించాడు. కాని శశి రమేశ్‌కి ధైర్యం చెప్పి, దైవకృపవుంటే తిరిగి కలసుకొనగలమని ఊరడించింది.

రోజులు గడిచాయి. రమేశ్ బి.ఏ. పూర్తిచేసి తన స్వగ్రామం వెళ్ళిపోయేడు. ఉత్సాహం పూర్తిగా అడుగంటింది. ఎవరికోసం జీవిస్తున్నాడో అతనికే తెలియదు. మొదట్లో శశికి ఉత్తరాలు వ్రాశాడుగాని జానకిరామయ్యగారు తిరిగి వివాహం చేసుకున్నారని, ఏన్ని చాల ఖరాఖండి ఐనదని, ఉత్తరములు ఆమె చేతిలో పడి చాల ప్రమాదం కలిగించాయని శశి రమేశ్‌కి వ్రాసింది. లేఖలు వ్రాసి ఆమెకి లేనిపోని చిక్కులు తేవటం బాగులేదని వ్రాయటంకూడ మానుకున్నాడు.

ఒకరోజు అన్నం వడ్డిస్తూ రమేశ్ తల్లి పెళ్ళి ప్రశక్తి తెచ్చింది – "ఒరే, బాబూ, యశోదత్త రెండు మూడు రోజులలో నీకు సంబంధం తెస్తుందిరా" అంది గంపెడాశతో–

"నాకింక పెళ్ళి విషయం మాత్రం తలపెట్టకండమ్మ" అన్నాడు.

"అదేమిరా బాబూ, యశోదత్త సవతి కూతురొకమ్మాయి వుందట – నీకు సరిగ్గా ఈడూ – జోడూ కుదురుతుందట – చదువుకున్న పిల్లటంటాడా – ఒకే అమ్మాయి కావటంవలన ఆస్థంతా ఆమెకే వస్తుందట – మనకింకేం కావాలి చెప్పూ!" అన్నదామె – అప్పుడె కొడుకూ కోడలూ చిలకా–గోరింకలలా వున్నట్లూహించుకుంటూ –

రమేశ్ చెప్పి లాభంలేదని సంభాషణ ఆపేశాడు.

ఒకరోజు పెళ్ళివారితో యిల్లంతా హడావిడిగావుంది. కాని రమేశ్‌లో యేమార్పులేదు. బలవంతంమీద రమేశ్‌ని కూర్చుండబెట్టారు అంతా – రమేశ్ ఊహలు శశిమీదకి పోయాయి తనకెదురుగా శశి కూర్చుంటే – అప్రయత్నంగా తలెత్తిచూశాడు – అరె, ఆశ్చర్యం! ఆమె తన శశి! రమేశ్‌కి అర్థమైంది కథంతా – శశి పిన్ని తన స్వయాం మేనత్తేనని, తన తండ్రి ఆఖరి చెల్లలని యేడాది క్రిందటే ఆమెకి సుందరరామయ్యగారితో వివాహం జరిగిందని తెలిసింది. శశికూడా వాలుచూపులతో రమేశ్‌ని చూచి పొంగిపోయింది

'ఏమిరా రామూ మా అమ్మాయి నచ్చిందా? వాళ్ళ నాన్నకి శలవు లేదు గనుక నేనే పెద్దని'' అని అడిగింది యశోదత్త రమేశ్‌ని.

"పరవాలే దత్తయ్యా'' అన్నాడు రమేశ్ ముసిముసి నవ్వులతో.

ఇది ఐదేండ్ల క్రిందటి కథ.

వసంతఋతువు

శ్రీమతి ఎస్. బాల

మ॥ శ్రీతరక్షావిధి వీడి యర్భకుల కార్తింగూర్చుదా యాదియ
ట్లతి ధూర్తంబగు సీతువో క్కట జనార్త్యాపాదకంబయ్యె, న
ద్భుత కాలప్రభ కంజలించె ; సమసెన్ దుర్వారదర్పంబు, భ
ద్రతచేకూఱెఁ, గవోష్ణరోచులను సప్తాశ్వుండు వెల్గొందగన్॥

చ॥ రహిచెడి వెన్నుచూపె శిశిరమ్మను రక్కసి ; జంగమమ్ములన్
దహతహలాడఁజేసియు, లతావనితాలలి తాకృతిన్ గృపా
రహితపుఁజిత్తవృత్తి నపరంబగు మృత్యువునా హరించియున్,
యహరహ మేచి యేచి, విలయమ్మొనరించియుఁ ; గాల బద్ధమై ;

ఉ॥ రేలతి దీర్ఘతన్విడిచె ; ఱిక్కల ఱేఁడు సుధాయితాంశుమా
లాలలి తాకృతిన్ వెలిఁగె ; లావఱి శీతము వెన్ను చూపఁగన్ ;
మ్రోళులుఁ గ్రొంజిగుళ్లనతి మోహన రూపమునన్ వెలింగె ; సు
శ్రీలఁజెలంగెఁగ్రొన్ననలు శీలమునా చికొనన్ సువాసనల్॥

క॥ “చలి చలిహు” యని వణకుచు
వెల వెల పోయెడి దినాలు వెనుదిరిగె; నిశా
లలనాన నేందుబింబపుఁ
దెలి నవ్వులునాఁగఁదోఁచెదిశలన్ ఱిక్కల్॥

క॥ పల్లవిత తరుల తాదిక
ముల్లాసము గూర్ప, నవన వోన్మేషముసం
ధిల్లెనుగ్రొన్నన లందున ;
నెల్లరు నానంద మంది రెంతయు మదిలోన్॥

ఉ॥ మామిడిక్రొంజిగుళ్లు మధుమాసమునన్ మనసారమెక్కి, యా
రామ ములందుఁగోయిలలు రమ్యముగా గళమెత్తి పాడనెం
తో ముద మంది రెంతయును తుల్ పచరించిరి ; పిల్లతెమ్మెరల్
వ్యోమ మునందు శైత్యగుణ యుక్తములై తిరుగాడెనెల్ల డన్॥

ఉ॥ మామిడి పిందెలందరిగి మానిను లాదతోఁజేర్చి వడ్డనల్
తామొనరింపగేస్తులుము దంబున నోగిరి మారగించినా
రేమని చెప్ప ; ఁదద్రుచికి నేదియుసాటి యనంగఁజెల్లునే ?
“ఆమని” యాంధ్రలోకమున కారయనవ్య రుచిప్రదంబుగా !

★ స్త్రీ జన్మ ★

శ్రీమతి కె. శ్యామలా దేవి.

సృష్టికి మూలం రెండే రకాల జన్మలు. అవి, ఒకటి స్త్రీ జన్మ మరొకటి పురుషజన్మ, ఈ రెండు జన్మల శక్తీ సమానమే. బాధ్యతా సమానమే. ఈ రెంటిలో దేనిశక్తి లోపించినా సృష్టి అనేది అసలు జరగనే జరగదు ఈ జన్మలు రెండూ సమస్త జీవరాసుల్లోనూ ఒకదానిపై నొకటి విధిగా ఆధారపడుతూ సృష్టి క్రమానికి దోహద మవుతూనే వుంటాయి. ఇది జగత్సత్యం.

వీటిలో మానవజన్మ అనేది ఉత్తమం. జీవులు ఈ జన్మమెత్తిన తరువాత స్వార్థమనేది ఏమిటో తెలియని కాలంలో, సుఖంగానూ, శ్రేయోదాయకంగానూ, ఆదర్శం గానూ స్త్రీ పురుషులు తమ జీవిత యాత్రను గడుపుకొనే వారట. ఆ కాలం దాటిపోయింది.

ఆ తర్వాత వచ్చిన కాలంలో మానవులకు క్రమంగా స్వార్థాలు పెరిగాయి. అవి ముదిరి దుస్వార్థాలకు దారి తీశాయి. వాటి మూలకంగా అనుమాన బాధలు అలుము కొన్నాయి. వీటి వక్రమార్గాలవల్ల దౌష్ట్యం ప్రబలి, మానవజాతిని అత్యాచారాలకూ, అఘాయిత్యాలకూ, అన్యాయాలకూ దారి తీశాయి. తుదకు మానవులకు మనశ్శాంతే లేకండా జేశాయి. దీని పరిణామం వల్ల చివరకు స్త్రీ పురుష జాతుల్లోని అన్యోన్యతా బాంధవ్యాలు సడలడమో, లేక తెగిపోవడమో జరుగుతూండేవి. ఇవి దుర్భర వియోగ వేధనాలై, తమ సంతతి పోషణ బాధ్యతను గూడ విస్మరించేట్టు జేస్తూ వచ్చాయి. ఈ కారణాన మానవులకు వార్థక్యదశలో ప్రశాంతానంద మైనా దక్కకుండా పోయింది. ఇందుమూలకంగా మానవజాతి అభ్యుదయ మార్గాలనందుకోలేక, అధోగతి పాలై, అవినీతి ప్రవాహాన కొట్టుకొనిపోవడం గూడా సంభవించింది.

దీన్ని గమనించిన దూరదృష్టిగల మహాఋషుల్లో కొందఱు పరాశరుడూ, జైమినీ, యాజ్ఞ్యవల్క్యుడు' మనువు మొదలైన ధర్మ నిర్ణేతలు కొన్ని సూత్రాల నేర్పరిచి, జాతీయశ్రేయస్సుకై వివాహాది ధర్మ కర్మను బంధనాలను రచించి, లోక కళ్యాణార్థం మార్గాలు వేశారు. ఈ మార్గగాములైన ఆనాటి స్త్రీ పురుషులు సమాన బాధ్యతలతోనూ, ఆదర్శాలతోనూ, కొంతకాలం సుఖంగా జీవించి దాటి పోయినారు. ఆ వేదకాలం గూడా గతించిపోయింది. ఆ ధర్మాలిప్పుడు అడుగంటి పోయినాయి. ఇక మిగిలినవల్లా దుస్వార్థుల దుర్భర నిర్బంధాలూ, అవసరాలూ, అధర్మాలూ, అక్రమాలూ, అఘాయిత్యాలు మాత్రమే. మళ్ళా పూర్వపు జంతుకాలానికి దిగజారి పోతున్నదీ మానవ జాతి.

ఈ కాలం, ముఖ్యంగా అబలలైన స్త్రీ జాతిపైనే భల్లూక నృత్యం చెయ్యడం సాగించింది. స్త్రీలు ఋతు ధర్మ నిబద్ధలనే ఒక నెపాన్ని స్త్రీలపై రుద్ది, స్త్రీలను పురుషులతో సమానాధికారం గలిగిన కర్మాధికారపు హక్కునుంచి దిగలాగి, బహుదూరానికి విసరికొట్టింది. శిశు పోషణ భారాన్ని స్త్రీల భుజాల కెక్కించి, స్త్రీలను వంటింటి కుందేళ్ళలాగా మార్చివేసింది. ఆ తర్వాత పాతివ్రత్యం అనే ఒక గుదిబండను మెడకు కట్టి, తన భర్త ఎలాంటి దుష్టుడైనా, త్రాగుమోతైనా వ్యభిచారి అయినా తుదకు కటిక కసాయి మనస్సుగలవాడైనాసరే, ఆతనికి భార్య అనేది విధిగా ఆతణ్ణి దైవంగా సేవించు కోవాలి అనే శాసనంతో స్త్రీని బంధించివైచింది. ఇలాంటి దుష్టపురుషజాతియొక్క దుస్వార్థం, అంతటితో ఆగలేదు. స్త్రీనీ, ఆమె నిజాయితినీ, సహృదయాన్నీ అనేక అనుమాన బంధనాలతో కొన్ని కొన్ని సందర్భాల్లో పశువులకంటే హీనంగా కట్టేసి అణచేసింది.

ఇది ఎవరి దోషం ? ప్రకృతి దోషమా ? పురుషుని స్వార్థపరత్వదోషమా ? స్త్రీ అవిద్యాదోషమా ? లేక స్త్రీల సౌందర్య సౌకుమార్య సహన శీలాల కారణంగా పురుషుల్లో పుట్టుకొచ్చే అనుమాన పిశాచ దోషమా ? ఎవరిదోషం ? ఏమిటాదోషం ? అని మానవాభ్యుదయ విజ్ఞానాన్ని అడుగుతున్నాడు. దీనకి సమాధానంగా— ఈనాడు స్త్రీలు చదువుకోవడంలేదా ? ఉద్యోగాలు చెయ్యడంలేదా ? స్త్రీల కేంతక్కువైందని అమ్మా! అలా అడుగుతావు ? అని పురుషు లెవరైనా మరల అడగవచ్చు. ఈ సమాధానంతో వ్రేళ్ళలెక్కకు గూడా అందని ఏ కొద్దిమంది స్త్రీలనో చూపి, తృప్తినొందమని

చెప్పడం సబబు గాదు. ఇంత మాత్రాన స్త్రీ జన్మల కందరికీ మేలొనగూడినట్లు గాదు. కాజాలదు. భారత స్త్రీలలో నూటికి 90 వంతులు చదువు రానివారే అయి వున్నారు. తద్వారా అభ్యుదయ పథాన్ని కోల్పోయి, అధోగతి పాలైనవారే హెచ్చుమంది వున్నారు.

ఇందులకు ముఖ్యంగా స్వార్థపురుషులు స్త్రీల సహన శాంత సౌమనస్యాలమీద చాంచల్యమనే ఒక దోషాన్ని గూడా ఆరోపించి అనుమానాస్పదాలుగా జేశారు. స్త్రీ మనస్తత్వాన్ని ఆవకాయ జాడీలుగా అటకల్లో దాచేస్తున్నారు. ఒక్కొక్కప్పుడు దోషులనుగా గూడా జేసి దూరాలకు విసరి వేస్తున్నారు. అలాంటి దోషాలు స్త్రీ పురుషులకు సమానమైన బాధ్యతలుగలదే అయినప్పటికీ ఇందులకు ముఖ్యంగా స్త్రీలనే నింద్యులనుగా జెయ్యడంలో పురుషదృష్టి ఎంత హ్రస్వమైనదో విజ్ఞులకు వివరింప పనిలేదుగద.

పురుష జన్మకంటే స్త్రీ జన్మ ఏ విషయంలోనూ తక్కువ సమర్థమైనదిగాదు. సాంసారిక సామరస్యమూ సామర్థ్యమూ ఉభయులకూ సమానమైనవే. పారిశ్రామిక సాధనమూ సమానమైనదే. అన్యోన్యాశ్రయమూ సమానమే. ఇక పోతే. సూక్ష్మదృష్టికి మిగిలిందల్లా ఒక్కటే భేధానుమానం అదే సాంసారికానందం. అందులకు ముందుగా మా సమ్మతి మీకందకుంటే, మీ జన్మ మా కంటే తక్కువనేగదా అని గడుసు పురుషులెవరైనా అనవచ్చు. అదే ప్రశ్నను మా స్త్రీలు వేస్తే ఆ పురుష జన్మ ఏవిధంగా హెచ్చవుతున్నదంటాను. ప్రకృతి చైతన్య స్వభావంలో పురుషులు భీష్మించుకొన్నప్పుడు మీ స్త్రీ జాతి మా కాళ్ళ బేరానికి రాదా అని గూడా దర్పంగా పురుషులనవచ్చు. కాని, అని వుండగలరా అంటున్నాను అది వట్టి బూకరింపు మాటగా తేలిపోక తప్పదు. అందులకు వారు దుష్టాంతరంగా చూపించే ఏ వెర్రి మొర్రి ప్రవరాఖ్యుడ్లాంటి వారో అయి వుడితే తప్ప. పురుషజాతి అంతా అనలేదన్నమాట జగత్సత్యం. ఆ ప్రవరాఖ్యుడైన ఒకానొక ధర్మబద్ధుడై అంతటి జగన్మోహినీ దేవతా వరూధిన్ని నిరాకరించేదేగాని, అంత క్రితం వఱకూ తన భార్యకు తాను దాసుడే అయినాడు గదా. గనుక ఈ సామ్యంగూడా సమర్థనీయంగా లేనిదే అయిపోయింది.

ఇంతకూ నే చెప్పదలచిందేమంటే, సాంసారికానందాన్ని చవి జూచిన గృహస్థులదగ్గరనుంచీ, అన్నీవదిలేసి ఎక్కడో ముక్కు మూసుకొనే ముని ముచ్చులవరకూ ఎప్పుడో ఒకప్పుడు స్త్రీ జన్మలయొక్క అనుగ్రహానికి బందాలు పడినవారే అయిపోయినారు. అందువల్ల స్త్రీ జన్మ పురుష జన్మకంటే ఎందునా తక్కువైందిగాదు. ఉభయ జన్మలూ సమానమైనవే. సమాన బాధ్యతలు గల్గినవే. సమానానందార్హలే అంటున్నాయి. మరికొంత హెచ్చుగా ఆలోచిస్తే పురుషులకంటే అన్నిటా స్త్రీలే గొప్పవారని గూడా అంటున్నాను. ఏమంటారా ?

స్త్రీ మాతృదేవత. క్షమాభరిత. సంసారశోభితాభినేత. స్వార్థత్యాగి. నిస్వార్థభోగి. క్షేమాధురాగి. కామస్వరూపిణి. కామ్యాకర్షిణి. ఆనంద నిలయిని. అనుభవ్యఫలమానిని. సహనశాలి. సాహసశీలి. బుద్ధిశాలి. పుణ్యశీలి. ప్రణయిని. ప్రమోదిని. పరమార్థిని. ప్రేమ మూర్తని. ఓః ఒక్కటని ఏమిటి ? చెప్పవలసివస్తే పురుషునికంటే వేయిరెట్లు సుగుణాలగని. స్త్రీ జన్మ ఇంతటి శక్తిగలది అయినా పురుషాధికారంతో సమానాధికారాన్నే స్త్రీ వాంఛిస్తూ వుంటుందిగాని అంతకంటే మించి తాను కోరేది ఎన్నడూ గాదు. ఇదే ఆమెయొక్క మహత్తర పూజ్యత. యోగ్యతన్నూ.

ఈ పూజ్యతా యోగ్యతలను తన పురుషుడు గమనిస్తేనే చాలునని తృప్తిపడేంతటి ఉదార మూర్తి స్త్రీ. ఈ సమావత్వాన్ని గుర్తించుకొన్న పురుషులు తమ స్త్రీలకు తగిన సంస్కారాన్నీ మర్యాదనూ ఇవ్వగలిగితే స్త్రీజన్మలు లోకకళ్యాణార్థం చేయజాలని పనుల్లేవంటాను.

"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అనిన మహాకవికి జోహార్లర్పిస్తున్నాను.

"స్త్రీ మూర్తి"

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

అమ్మా! నీ రక్తంనాకు పంచి యిచ్చావు. నీ లోని కోర్కెలను నా చిన్ని హృదయంలో పొందు పరిచావు. తొమ్మిది నెలలు మోశావు. కన్నావు పెంచావు ఎందుకమ్మా! నీకింతదయ. నేను ఏమి చేశానని ఇంత ప్రేమ. అబ్బ! నీరుణం నే నెట్లా తీర్చుకోగలనమ్మా! నీజీవితానికి నాందీవచనాలు పలికావు. నాకొరకు ఎన్నో బాధలు అనుభవించావు. నా శ్రేయస్సు నీ శ్రేయస్సను కుంటావు. నిజంగా నా అదృష్టమమ్మా! నీ జీవితాన్ని నా కొరకు త్యాగం చేయగల నంటున్నావా? సత్యమమ్మా! నీవు అందుకుకూడా వెనుకాడవని నాకు తెలుసు నీ ఆశీస్సులే నా విజయ హర్మ్యానికి సోపానాలు. ఆ ఆనందం నీ కుమారుడు నిన్ను పొగడు తున్నాడనియా? అమ్మా! నిన్ను పొగడడానికి నా హృదయంలోని ఊహలు వెల్లడించటానికి భాషలో మాటలేవమ్మా! అమ్మా నీ అరుణ చరణాలపై నా మూర్ధాన్ని ఉంచుతున్నాను. ఆశీర్వదించమ్మా!

సోదరీ ఏమిటమ్మా! నీ పిచ్చిప్రేమ! నీ సోదరునిపై ఈగను కూడా వ్రాలనివ్వవు. నీ కోర్కె తప్పక తీర్చుతానమ్మా! నా బంగారు చెల్లికోర్కె తీర్చటంకన్నా నాకు కావలసిందేముంది? ఆగమ్మా! ఆగు! ఇప్పుడు నీవు పరాధీనవు. నాతొడపై కూర్చుంటే ..? ఆ కన్నీరు! ఛీ తప్పుకదూ! అవునమ్మా! నీ ప్రేమ నిష్కలంకమైనది. స్వార్థరహితము. నీ సోదరునికై త్యాగం చెయ్యగలవు. కాని నీకు సోదరునిపై ఎందు కింత బాధ్యత! నీవు భర్త వెంట వెడతావు. తెలుసు చెల్లీ! నీ కన్నులలో నెనొక కంటిని ఆనాడు చల్లని వెన్నెలలో తెల్లని పట్టు పరుపుపై పడుకొని నీకు కథ చెప్పేటప్పుడు "అన్నయ్యా! నీవు నాకు ఒక నేత్రానివి. నీనేత్రాన్ని నీవేకాపాడుకో" అని అన్నావు గుర్తుందీ చెల్లీ: నా చెల్లికి ఏ కష్టం కలుగనివ్వనమ్మా! ఎందుకమ్మా బావతో వాదిస్తావు. నీ అన్నయ్యను వరుసకు పరాచికాలాడితే నాకులేని బాధ నీ కెందుకమ్మా! చెల్లీ నీ హృదయము నిష్కలంకానికి, స్వార్థ త్యాగానికి నిదర్శనము. చూడమ్మా! మనిద్దరము ఒకే మాతృమూర్తి రక్తాన్ని పంచుకొని జన్మించాము. సదా నీ భర్త నీవు సుఖసంపదలతో వర్ధిల్లాలి. మరలావచ్చే నాకు అల్లుడిని చూపాలి. వస్తా—చెల్లీ!

వదినా తల్లి తరువాత తల్లియంతదానవు. నీమరదిపై ఎందుకింత ఆదరణ. ఎక్కడి నుండో వచ్చావు కొద్ది కాలంలోనే నాకు తల్లిలేని లోటును తీర్చావువదినా? అసలు నీకీ బాధ్యత ఎవరప్పగించారు. నీవు ఎంత మంచిదానవమ్మా? నీకు పుత్ర సమానుడినా? నిజమమ్మా నిజము. నన్ను ఆశీర్వదించమ్మా! అందరి వదినలు నీలాంటివారె తే ఇక మరదులకు కావలసిందేముంది. ఏమిటి? 'చిరంజీవి' అంటున్నావా? ధన్యుణ్ని వదినా ధన్యుణ్ని. నేను జీవితాంతము సేవచేసినా నీ రుణం తీర్చుకోలేనమ్మా? అది నీ విధియా? ఎంతగా సూక్ష్మీకరించావమ్మా? నీవు నిజంగా ఆదర్శమూర్తివి. అవును ఆరోజు నేను సినిమానుండి వచ్చేవరకు మేలుకొని ఉన్నావు నాకు అన్నము వడ్డించటానికా? ఆఁ అంతవరకూ నీవు భోంచెయ్యలేదా? నన్ను చూస్తుంటే నీ హృదయంలో మాతృరేఖ ఉదయిస్తుందా? నిజంగా నీవు దేవతవు వదినా!

ప్రేయసీ! ఏమిటాసిగ్గు. ఆగు! ఎక్కడికి? ఎవరూ లేరులే? ఎంత అందంగా ఉన్నావీ రోజు నిజంగా "రతీదేవి"లా ఉన్నావు. అది సరె ఏమిటాచిరునవ్వు? ఓహో నీ భర్త వచ్చారనా? ఎప్పుడూ నీ దగ్గరే ఉంటానని ప్రమాణం గూడా చేయించు కున్నావుగా? అవును—నేను నీ దగ్గర ఉంటే ఒరిగేదేమిటి? నా ఆనందమే నీ ఆనందమా? ఎవరు నేర్పారీ మాటలు? నేనేనా? చంపావు! ప్రభూ! నేనెవరికి ప్రభువును కానే. నీ జీవితం నాకు అంకితం చేశావా? నీ ప్రేమ నన్ను కాపాడుతుంది. నీ పూజలే నా కవచాలు. ప్రణయముతో జీవితంలో నీపాత్ర అమూల్యమైనది. నీ హృదయపూర్వక అనురాగమే నాకు శ్రీరామరక్ష. దేవీ! నీ కన్నీరుచూచి ఓర్వగలనా? నాపై నీకెందు కింత ...? ఇహమూ పరమూనేనా? అవును రాణీ! నాకు నీవు నీకు నేను తప్ప ఎవరున్నారు మనకీ ప్రపంచంలో. కష్ట సుఖాలలో మనిద్దరము భాగస్వాములమే! నీవు "సహచరిణి"వి.

సంక్షేమం



ANDHRA MAHILA SABHA
NURSING HOME

REPORT FOR MARCH 1956

MATERNITY WARD

No. of Patients admitted for Deliveries	102
,, ,, Surgical cases treated	1
,, ,, Gyneac and Abortions	20
,, ,, Ante-natal	25
,, ,, Post Natal	1
,, ,, normal deliveries	90
,, ,, abnormal deliveries	12
,, ,, babies	104
Grand total	253

IN-PATIENT MATERNITY

No. of patients Delivered	102
,, ,, normal Deliveries	90
,, ,, abnormal Deliveries, Twins, Breach, forceps	12
Total	102

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	82
,, ,, Medical cases	789
,, ,, Ante-natal cases	234
,, ,, Post-natal cases	102
,, ,, Gyneacological cases	98
,, ,, E.E.N.T. cases	54
Total No. of New patients	1359
Total No. of Old patients.	1720
Grand Total	3079

NURSES' TRAINING CENTRE

Out of 60 candidates undergoing the auxiliary training 30 will be completing their course in July 1956. 30 candidates sponsored by the Central Social Welfare Board have been taken in this year and have started their training. The Andhra Government have promised to sponsor 30 more candidates.

Mrs. LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs. A. C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANABAI
Medical Superintendent

ఉదర పోషణకు ఏదో ఒక పని చేసుకొంటూవుండే అనేకమంది తల్లులకు కూడా ఇదే సమస్య - పనులకు పోయినప్పుడు వారి పిల్లలను కనిపెట్టుకునివుండి వారికి విద్యావినోదాలు కల్పించడం !

గుబ్లూ

నిజానికి శిశు నికేతన్ సంస్థాపకుడు గుబ్లూయే. అప్పట్లో ఆ బిడ్డ వయస్సు మూడేళ్ళు. బొద్దుగా పెరిగి ఉత్సాహంతో ఎగిరెగిరి పడుతూవుండేవాడు. అతని తల్లి మా కళాశాలలో అధ్యాపకురాలు. తరగతుల్లో పాఠాలు చెబుతూ, విరామకాలంలో మా అధ్యాపకుల గదిలో కూర్చుని ఏదో ఆలోచనలో మునిగిపోతూ వుండేది. ఏమిటి సంగతి అని అడిగాము. ఏముంది- గుబ్లూ హద్దు మీరి పోతున్నాడు. అదుపులో వుండడంలేదు. రోజంతా ఆమె కాలేజీలో వుంటోంది. అంతసేపూ ఒక్కడూ- దాదిదగ్గర వుండాలి. అదుపాజ్ఞల్లేవు. ఆట పాటలు ఏవైనా క్రమధోరణిలో వున్నాయా అంటే అవీ లేవు. ఆలనా, పాలనా లేదు. ఇంతకూ ఒక్కగాని ఒక్క బిడ్డ. అయితే గుబ్లూ అల్లరి అపరిమితం. దుర్భరం. ఆ పెంకి తనాన్ని, మంకుతనాన్ని వర్ణించలేము. చూసే తీరాలి.

'పోనీ ఏనర్సరీ బడిలోనైనా చేర్పిస్తే?' అన్నాం మేము.

పట్నంలో కొన్ని బడులు ఆలాంటివి లేకపోలేదు. కొన్ని మరీ దూరంగా, అందుబాటుకు తప్పివున్నాయి. కొన్నింటిలో రుసుము చాలా తక్కువ. ఏవీ ఉదయం పది గంటలనుంచి సాయంత్రం నాలుగు గంటలదాకా తెరువబడి వుండేవి లేవు. దీనితో గుబ్లూ కోసమే శిశు నికేతన్ ఏర్పాటు చెయ్యాలనే అభిప్రాయం కలిగింది.

మా అసోసియేషన్ సమావేశంలో ఈ అభిప్రాయాన్ని గురించి చర్చించాము. ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్న అనేకమంది తల్లులనుంచి జవుగురుగా విజ్ఞప్తులు వచ్చాయి. ఎక్కడో పని పాటలలో నిమగ్నమై సగం దృష్టి యింట్లోవున్న బిడ్డపైన పెట్టుకొని, ఆదుర్దాతో అసంతృప్తితో కాలం వెళ్ళబుచ్చుతూ ఆరాటపడుతూ వుండే తల్లులు ముందుకు రావడంతో గుబ్లూ ఒక్కడే గాక తోడుగా యింకా మరికొందరున్నారనే సంగతి తేలింది.

శిశు నికేతన్ స్థాపించడానికి నిశ్చయించినాము. అయితే మావద్ద డబ్బులేదు. ఇటువంటి బిడ్డలను చూస్తూ వుండడానికి తగిన వంతులూ లేదు. వసతి అయినాలేదు. నిజానికి యిది ఏర్పాటు చెయ్యవలసిన అవసరం. సంకల్పం తప్పితే మావద్ద ఏమీ లేవు.

భారత్ బాలభట దళాధికారుల సుహృద్భావంవల్ల ముందు వసతి లభించింది. తమ కార్యాలయ భవనంలో రెండు గదులు అద్దె లేకుండా యిచ్చారు. మా అసోసియేషన్ సభ్యులందరం డబ్బు చందా వేసుకొన్నాము. కుర్చీలు, బల్లలు, ఆటవస్తువులు సమకూడాయి. కొంత కష్టంమీద ఒక ఉపాధ్యాయురాలు కూడా దొరికింది.

శిశు నికేతన్ నర్సరీ పాఠశాలగా ఆరుగురు బిడ్డలతో 1954 ఆగస్టు 12 వ తేదీని ప్రారంభమయింది. విపరీతంగా అల్లరి చేస్తూవుండే గుబ్లూ కొన్ని రోజులలో మారిపోయాడు. క్రమబద్ధమైన ఆ క్రొత్త వాతావరణం ఆ బిడ్డను మేకపిల్లలా సాధువుగా మార్చివేసింది. కొన్ని వారాలలో బిడ్డల సంఖ్య 30 కి పెరిగింది. ఆ రెండు గదులకు చాలినంతమంది వుండేవారు.

అప్పటినుంచి పాఠశాల వృద్ధి చెందసాగింది. శిశు సంక్షేమ సాధనకోసం ఏర్పాటు చెయ్యబడిన స్టేట్ కౌన్సిల్ నుంచి గ్రాంటు రూపంలో కొంతద్రవ్యం లభించింది. దానితో కొంత వస్తు సామగ్రి సమకూర్చుకొన్నాము. కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘం నుంచి కొంత ద్రవ్యం రానున్నది. మరొక ఉపాధ్యాయురాలు నియమించబడ్డది.

అయితే ఇంకా పరిష్కరించవలసివున్న సమస్యలకు మాత్రం కొదవలేదు, ఇంకా ఎక్కువ స్థలం, ద్రవ్యం, సుశిక్షణ పొందిన అధ్యాపకురాండ్రు కావలసివున్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపడానికి ముందుగా విద్యాబోధనకు పూనుకొనే యిటువంటి నర్సరీ పాఠశాలలు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య పైనపేర్కొన్నవాటిలో కడపటిది. బీహారులో నర్సరీ పద్ధతులలో శిక్షణపొందిన యువతులసంఖ్య బహుతక్కువ. ఉన్న కొలదిమందిలోనైనా— మోంటిస్సోరీ విద్యా విధానంలో శిక్షణ పొందిన వారు— ఇదివరలోనే ఉద్యోగాలలో వున్నారు. నర్సరీ పాఠశాలల అవసరం ఎంతో వుంది. అయితేనేమి మన యువతులు ఈ పాఠశాలల నిర్వహణలో శిక్షణ పొందడానికి పూనుకోవడంలేదు.

రాష్ట్ర ప్రభుత్వం అప్పుడప్పుడు శిక్షణ కేంద్రాలలో స్కాలర్‌షిప్‌లిచ్చే ఏర్పాట్లేవైనా చేస్తే శిశు సంక్షేమ కార్యక్రమంలో ఒక భాగమైన యీ నర్సరీ పాఠశాలల నిర్వహణలో శిక్షణ పొందడానికి కొంతమంది యువతులు ముందుకురావచ్చు.

మరొక సమస్య— సంక్షేమ సంస్థలు యిటువంటి పాఠశాలలకు ప్రతియేట అవసరమవుతూనేవుండే ఖర్చులకు **(Recurring expenditure)** ద్రవ్యమీయడానికి విముఖంగా వుండడం.

ఇప్పుడున్న నర్సరీ పాఠశాలలకు తగు ద్రవ్య సహాయంచేస్తూ చివరకు పాఠశాలాత్పూర్వ విద్యాబోధనకు కూడా తరగతులు ఏర్పాటు చెయ్యక తీరనిపరిస్థితి ఏర్పడడానికి వీలుగా ఆ బోధన విలువను ప్రజలు గుర్తించవలసివుంది.

పాట్నాలో ఒక్క నర్సరీ పాఠశాల లేదు. ఉన్న కిండర్ గార్టెన్ పాఠశాలలో రుసుము క్రింది మధ్య తరగతి వారి శక్తికి మించిన పని. అయితే యిక పనిపాటులవల్ల ఉదరపోషణ జరుపుకొనే తల్లులకు అసలే అందుబాటులో వుండవు. శిశు నికేతన్‌లో రుసుము సాధ్యమైనంత తక్కువగా వసూలు చేస్తున్నాము. ఉద్యోగంలో లేని తల్లులనుంచి, నూరు రూపాయలకు మించిన నెలవారీ రాబడి కలవారినుంచి అయిదు రూపాయల వంతున, తక్కువ రాబడి కలవారినుంచి రెండున్నర రూపాయల వంతున తీసుకొంటున్నాము. దీనివల్ల 'రికరింగ్ ఖర్చు' సమస్య పరిష్కారం కాకుండా అలానే వుండిపోతున్నది. 'రికరింగ్ గ్రాంటు' లభించేవరకూ ఈ సమస్యా పరిష్కారానికి అవకాశం కనిపించుకూడా.

ఆదిలో అనుకొన్న విధంగా నర్సరీ పాఠశాలను ఉదయం పది గంటలనుంచి సాయంకాలం నాలుగు గంటలవరకు నడుపుతున్నాము. రెండున్నర సంవత్సరాలనుంచి అయిదున్నర సంవత్సరాల వయస్సు లోపు బిడ్డలున్నారు. వీరికి మధ్యాహ్న భోజనం సమకూర్చుతున్నాం. భోజనంకాగానే విశ్రాంతి తీసుకొంటారు. మూడు గంటలకు పళ్ళో బిస్కట్లో తింటారు. ఆధునిక నర్సరీ పాఠశాలలోని పద్ధతులనే యిక్కడ ప్రవేశపెట్టినాము. రకరకాల ఆటలు, పాటలు కథలు చెప్పడం, ఆడుతూ పాటలు పాడడం, బొమ్మలు చెయ్యడం మొదలైనవి నేర్పుతున్నాము. త్వరలోనే— శిశు నికేతన్ సంస్థాపనకు కారకుడైన గుబ్లా శిశు నికేతన్‌లో తన శిక్షణ ముగించి పాఠశాలలో చేరేలోపుగా నృత్య సంగీతాల బోధనకుకూడా తగు ఏర్పాట్లు జరగగలవనే ఆశిస్తున్నాము.

తల్లి విజ్ఞతను మించినది వేరులేదు.

గర్భవతులకు ఆహార విధానం

శ్రీమతి సుర్జిత్ చవ్హాన్

ప్రియమైన మున్నీ.

నీకు పాపాయి పుట్టబోతున్నదనేసంగతి నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇది నీకుతొలి కాన్పు కనుక నీ మటుకు నువ్వే కొన్ని జాగ్రతలు వహించవలసి వుంది. గర్భధారణను గురించి, పిల్లలు పుట్టడాన్ని గురించినువ్వు ఏమైనా తెలుసుకొన గోరితే నన్ను అడుగు. అంతేకాని అమ్మమ్మల మాటలు వింటూ లేని పోని భయసందేహాలు పెట్టుకోకు.

గర్భధారణం వివాహితలైన స్త్రీలందరికి సర్వసాధారణమైన అనుభవం. దీనికి ప్రత్యేక చికిత్సా విధానం ఏదీ అవసరంకాదు. అయితే దీనివల్ల మన శరీరావయవాలలో కొన్నిటికి అదనపు శ్రమ అవసరం కనక ఆ అవయవాలకు తగు పోషణ సమకూర్చు కోవలసి వుంది. కనకనే ప్రసవాత్పూర్వం, ప్రసవానంతరంకూడా తగినఆహారాన్ని ఒక క్రమపద్ధతిలో స్వీకరించడం అవసరమని నేను తలపోస్తున్నాను.

పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా వుండడానికి గర్భవతియైన స్త్రీ తగు ఆహారం తీసుకొంటూ వుండాలి. పిండానికి (గర్భస్థ శిశువు) తల్లి స్వీకరించే ఆహారంనుంచే పోషణ లభిస్తుంది. కనక, శిశు పోషకమైన ఆహారాన్నే తల్లి భుజిస్తూ వుండాలి. చాలామంది ఈ సందర్భంలో అశ్రద్ధ వహిస్తూ వుంటారు.

గర్భధారణకాలంలో సులభంగా జీర్ణమయ్యే ఆరోగ్య బలవర్ధకములైన ఆహార పదార్థాలను భుజించడం తల్లికి, బిడ్డకుకూడా చాలామంచిది తల్లి భుజించే ఆహారంలో కొన్ని లోటు పాట్లు వుంటే శిశువు పోషణకు యిబ్బంది లేకున్నా ఆ తర్వాత తల్లి ఆరోగ్యం పాడవుతుంది కనకనే స్త్రీకికూడా గర్భధారణ కాలంలో తగు ఆహారమివ్వడం ఆవశ్యకమనే సంగతిని మనం గుర్తించాలి.

గర్భవతికి ఎటువంటి ఆహారం అవసరమో చెబుతాను. మొదట మూడు మాసాలలోను తల్లి ఎక్కువ శ్రమపడవలసిన పని ఏమీలేదు. కనక బలవర్ధకమైన ఆహార పదార్థాలను స్వీకరించడం అవసరంకాదు. కాని నాలుగవ నెల నుంచి పుష్టినిచ్చే ఆహార పదార్థాలు చక్కెర, నెయ్యి, వెన్న, నూనె, వనస్పతి, నువ్వులనూనె, కొబ్బరినూనె ఎక్కువగా స్వీకరిస్తూ వుండాలి. శరీర సంపోషకములైన పాలు, పాలతో తయారయ్యే పదార్థాలు, మాంసం, మత్స్యాలు, కోడిగ్రుడ్లు, పప్పులు, గింజలు కూడా గర్భంలోని శిశు పోషణకు తోడ్పడతాయి కనక వీటిని కూడా భుజించాలి. గర్భధారణ కాలంలో మామూలు పరిస్థితులలో కంటె కాల్షియం రెండింతలు, ఫాస్ఫరస్ (భాస్వరం) కనీసం నూటికి 50 వంతులు ఎక్కువగా అవసరమౌతాయి. ఈ రెండూకల ఆహార పదార్థాలు భుజించకపోతే బిడ్డ ఎముకలనిర్మాణం దుర్బలంగావుంటుంది తల్లి. ఎముకలుకూడా బలహీన మౌతాయి.

మన శరీరంలో బి. సి. డి. విటమినులు ఎక్కువగా నిల్వ వుండవు. ఒక్క ఏ విటమినునే శరీరం అట్టేపెట్టుకోగలుగుతుంది. కనక బి. సి. డి. విటమినులతోపాటు ఏ విటమిను కలిసిన ఆహార పదార్థాలను కూడా భుజిస్తూ వుండాలి. ఇందుకే నేను ఒక సూచన చేస్తున్నాను. మామూలు భోజనంతోపాటు రోజూ అర్ధశేరుకు తక్కువ కాకుండా పాలు త్రాగాలి. ఒకశేరుపాలైతే మరీమంచిది. వెన్న, పెరుగు, మీగడ, డబ్బాపాలు కూడా తింటూ వుండాలి. మీరు మాంసాహారులైతే మూడు ఔన్సుల కాలెజము, మూడు ఔన్సుల చేపలు లేక మూడు ఔన్సుల మాంసం వారానికి రెండుసార్లు భుజించాలి.

ప్రతిరోజు మీరు భుజించే ఆహారపదార్థాలు ఈవిధంగా వుండాలి.

1. నెయ్యి లేక వెన్న — 2 నుంచి $2\frac{1}{2}$ ఔన్సులు
2. ఆకుకూరలు (కేబేజి, టర్నిప్, రేడిష్ వంటివి) — 6 ఔన్సులు
3. తాజాపళ్ళు — 4 నుంచి 6 ఔన్సులు
4. పప్పులు — 3 ఔన్సులు

5. వేరు కూరలు 3 ఔన్సులు
6. ఇతర కాయగూరలు 3 ఔన్సులు
7. పంచదార, బెల్లం 2 ఔన్సులు
8. గింజలు 1 ఔన్సు
9. పాలు 2 ఔన్సులు
10. మాంసం లేక చేపలు 3 ఔన్సులు
11. కోడిగ్రుడ్డు

బిడ్డ పుట్టిన తర్వాత నువ్వే పాలివ్వాలి. తల్లిపాలు కంటె యితరములైన పాలు ఏవీ శ్రేష్ఠమైనవి కావు. దీని వల్ల బిడ్డకు అంటువ్యాధు లేవీ రాకుండా కొంత రక్షణ కలుగుతుంది. తల్లిపాలు సులభంగా జీర్ణమౌతాయి. క్రిమి దోషం ఏదీ వానిలో వుండదు. పైగా తల్లి శరీరావయవాలలో కొన్ని తమ స్వస్వరూపాన్ని పొందడానికి బిడ్డకు పాలివ్వడం వల్ల అవకాశం కలుగుతుంది. పైగా డబ్బు ఖర్చు పెట్ట నక్కర లేదుగదా!

బిడ్డకు తల్లి స్వయంగా చనుబాలివ్వడం వల్ల అనేక ప్రయోజనా లున్నాయని యిప్పుడు తేటపడుతుంది. అది తగిన ఆహారం కావడం, గ్లాండ్స్ తిరిగి మామూలుగా పని చెయ్యడానికి వీలివ్వడం, సుఖం, సంతోషం కలిగించడం.

సరియైన ఆహారం భుజించడం తల్లికి బిడ్డకు కూడా ఆరోగ్య దాయకం. ప్రసవానికి ముందు గర్భవతులు ఆహారంతో పాటు స్వీకరించే ద్రవ్యాలని ప్రసవానంతరంకూడా భుజించ వలసిందే. గర్భవతి భుజించే ఆహారంలోకంటె మాతృత్వం సిద్ధించిన పిదప తల్లి తీసుకొనే ఆహారపదార్థాలలో మరికొన్ని పోషకశక్తి కలిగిన పదార్థాలు సుమారు 10% వంతులు ఎక్కువగా వుండాలి. స్తన్యం వృద్ధికాగల ఆహార పదార్థాలను కూడ తల్లి అదనంగా భుజిస్తూ వుండాలి. ప్రతిరోజూ సుమారు 3 ఔ॥ మాంసంగాని, చేపలుగాని లేక ఒక శేరు పాలుగాని, ఒక కోడిగ్రుడ్డుగాని సేవిస్తే చాలు. వారానికి రెండుసార్లు కారిజము (Liver) కాయ కూరలు, పళ్ళు, పప్పులు, అపరాలుకూడా నిత్య భోజనంలో ఉపయోగిస్తూ వుండవచ్చు.

ప్రతిరోజు 3/4 సేరుపాలు అయినా త్రాగుతూవుండాలి. శేరు అయితే మరీమంచిది. లేదా పెరుగు, ఆకు కూరలు ఎక్కువగా తింటూ వుండాలి. రోజూ ఒక కోడిగ్రుడ్డు ముఖ్యం. మీరు శాకాహారులు కాకుంటే వారానికి రెండు సార్లు కారిజము తినవచ్చు. రోజూ ఒకటి రెండు చెంచాల కాడ్లివర్ ఆయిల్ సేవించడం కూడా మీకూ మీ బిడ్డకు ఎక్కువ ఆరోగ్యం కలిగించ గలదు.

నిత్యం భుజించే ఆహారంలో ఈ క్రింద పేర్కొన్న తరహాలపదార్థాలలో ఒకతరహాలో తప్పకుండా వుండాలి.

1. కాయకూరలు- అన్నిరకాల ఆకు కూరలు కారట్లు టోమాటోలు, బఠానీలు యితర కూరలు.

2. పళ్ళు- బొప్పాయి, మామిడి, బత్తాయి, అరటి, ఖర్జూరం మొదలైనవి.

3. పాలు, పాలతో తయారు చేసిన పదార్థాలు.
4. నెయ్యి, నూనె, లేక వెన్న.
5. మాంసం, చేపలు, కారిజము, కోళ్ళు, జున్ను.
6. పప్పులు, అపరధాన్యాలతో వండిన పదార్థాలు.
7. చక్కెర, లేక బెల్లం.

ఈ పై పదార్థాలతో గర్భవతులుగా వున్నప్పుడు-చంటి బిడ్డలకు పాలిచ్చే కాలంలోను ప్రతిరోజు భుజించ వలసిన ఆహార పదార్థాల విషయంలో ఒక పద్ధతిని మప్పుకు సూచిస్తున్నాను.

గర్భధారణ కాలంలో

ఒకరోజుకు : శాకాహారులకు.

శాకాహారులకుపళ్ళు ఒకబొప్పాయి పచ్చిలేకఉడికించిన గోధుమలతో తయారుచేసిన పోరిడ్జి. (3 టేబిల్ చెంచాలు పాలు అరకప్పు పోరిడ్జితోను అర కప్పు ఆ తర్వాత.

పంచదార లేక బెల్లంపానకం 2 టీ చెంచాలు.

మధ్యాహ్నం : దినుసులతో వంటకాలు లేక జున్ను కూరల సహా 3 టేబిల్ చంచాలు.

కాయకూరలు : టర్నిప్‌లు, టొమాటోలు ఉల్లిపాయలు దోసకాయ పచ్చడి, నిమ్మబద్ద, చపాతీలు, లేక అన్నం.

సాయంకాలం : టీ లేక కాఫీ ఒకకప్పు ఉడికించిన శనగలు, పెసలువంటిఅపరదినుసులవంటకాలు 1 ఔన్సు. ఒకఅరటి పండు, పంచదార లేక బెల్లం. 2 టీ.చెంచాలు.

రాత్రి : పప్పు 3 టేబిల్ స్పూనులు. కారట్ బజ్జి. చపాతీలు లేక అన్నం. పాలు ఒక గ్లాసు లేక 3 టేబిల్



చంచాల పాయసం గాని పాలతో తయారు చేసుకునే ఏ పానీయమైనగాని, భోజన సమయంలోనే పాలు త్రాగడానికి మీకు యిష్టంలేకపోతే నిద్ర పోవడానికి ముందు త్రాగవచ్చు.

మాంసాహారులకు

పైన చెప్పిన పద్ధతే కాని ఒక కోడిగ్రుడ్డు ఉదయం. ఒక కోడిగ్రుడ్డు రాత్రి భోజనంలో ఉపయోగించవచ్చు పప్పుకుబదులు మాంసంగాని మత్స్యంగాని భుజించవచ్చు

చను పాలిచ్చే కాలంలో

ఉదయం : పళ్ళు, ఒక బత్తాయి. పప్పుధాన్యాలు, ఉడికించిన పప్పులేక గోధుమ 3 టేబిల్ చెంచాలు.

పాలు : అరకప్పు ధనియాలతో, ఆ తర్వాత శాకాహారులకు ఒక కప్పు, మాంసాహారులకు అరకప్పు.

పంచదార లేక బెల్లపు పానకం 2 టీ చెంచాలు.

కోడిగ్రుడ్డు—మాంసాహారులకైతే ఒకటి.

పంచదార – ఒక టీ చంచా.

మధ్యాహ్నం భోజనం: పప్పు దినుసులతో వండిన పదార్థాలు, మాంసం. చేపలు, కోడిగ్రుడ్లు, లేక పెరుగు—బటాణీలు—బంగాళా దుంపలకూర 3 టేబిల్ చంచాలు.

కాయకూరలు : పచ్చి టొమాటో, కారట్‌లతో తయారు చేసిన పచ్చడి.

చపాతీలు లేక అన్నం,

సాయంకాలం : టీ. లేక కాఫీ. ఒక కప్పు పంచదార లేక బెల్లం 2 టీ చెంచాలు.

రాత్రి భోజనం : కాబేజి కూర. 3 టేబిల్ చెంచాలు. కొత్తిమిరి పచ్చడి. పాలు లేక పాయసం.

రాత్రి నిద్రకుముందు ఒక గ్లాసు పాలు చాలాముఖ్యం. ఉదయం 11 గంటలకుకూడా ఒక గ్లాసు పాలు త్రాగడం మంచిది.

నేను పైన చెప్పిన అహారపదార్థాలుగాక. తేనె, ద్రాక్ష పళ్ళు వంటివి కూడా ఆరోగ్యం కలిగించ డానికి తోడ్పడగలవు.

మీరూ మీబిడ్డ ఆరోగ్యంగా వుండడానికి సమృద్ధంగా తాజాపళ్ళు, ఆకుకూరలు, పప్పులు, ఒక టీ చంచానిండా కాడ్లివర్ ఆయిలు సేవించడం చాలా ముఖ్యం.

ఈ పై నియమాలు కనక సరిగా అనుసరిస్తే నువ్వూ నీ పాపాకూడా ఎంతోఆరోగ్యంగా, సుఖంగా వుంటారు. పాపని కొకసారి డాక్టర్‌చే పరీక్ష చేయించు కోవడం సంగతి కూడా మరువకు. నీకు, రమేష్‌కు నా ముద్దులు.

— నీ తల్లి

శ్రీ సాయీ అనాథ శరణాలయం

ధర్మవరం — అనంతపురం జిల్లా

స్థాపితం

1946 వ సంవత్సరము

వ్యవస్థాపకులు.

శ్రీ వై. పిచ్చిరెడ్డిగారు.

అధ్యక్షుడు.

శ్రీ పళ్ళెం వెంకటేశన్.

కార్యదర్శి

శ్రీ ఉప్పరపల్లి వెంకప్ప.

ఆశయములు

కుంటి, గ్రుడ్డి, మొదలయిన వికలాంగులకు, శక్తిహీనులకు, అనాథులకు, ఆశ్రయం, భోజనం, దుస్తులుఇచ్చి, వారిని సాంఘికంగాను, నైతికంగాను, ఆధ్యాత్మికంగాను, అభి వృద్ధి లోనికి తీసుకొని వచ్చుట.

కార్యక్రమం

తిండి, బట్ట, ఆశ్రయం ఇచ్చి వికలాంగులను కాపాడుచున్నారు. చేయగలిగిన వారి చేత కుటీర పరిశ్రమలనునేర్పి ప్రోత్సహిస్తున్నారు. ఆశ్రమవాసులు, ప్రతిరోజు పరిసరములను శుభ్రపరచుట లోను, దంచి, విసరి, ఆహార పదార్థముల తయారు చేయుటలోను తోడ్పడు చున్నారు.

ఆర్థిక స్థోమత.

సాలుసరిరాబడి. రూ 20,000 లు. ఖర్చుదాదాపుఅంతాను. కలక్టర్లవిరాళముల నుండి వచ్చు గ్రాంటులు, స్థానిక పరిపాలనా సంస్థలు, సహకారసంఘాలు, గిల్డ్ఆఫ్ సర్వీస్, నుండి ప్రజలనుండి వచ్చు విరాళములకు తోడు కేంద్రసాంఘిక సంక్షేమ సంస్థవారు కొందరి సహాయార్థం రూ 1000 లు విరాళ మిచ్చుచున్నారు.

గమనిక

ఇందు ఎనిమిదిమంది గౌరవ సంఘసేవ సేవకులు ఉచితముగా పనిచేయుచున్నారు. ప్రస్తుతము ఆశ్రమ వాసులసంఖ్య 18- ఆశ్రమమునకు వెలుపలనున్న అనేకమంది దిక్కు-లేని వారికి కూడా సహాయము చేయుచున్నారు.

—"సోషల్ వెల్‌ఫేర్ ఇన్ ఇండియా"నుండి.

గ్రామీణ భారత సందర్శనము

మేరీ ఐ. డెన్‌హామ్

భారత దేశంలో జరుగుతూన్న సంక్షేమ ప్రణాళికల ప్రగతిని గమనించడానికి ఈ ఆకు రాలు కాలంలో భారత దేశాన్ని దర్శించే అవకాశం కలగడం నా అదృష్టమని భావిస్తున్నాను.

వృద్ధులకీ, రోగులకీ, అనాథులకీ, శరణార్థులకీ, తల్లిదండ్రులులేని పిల్లలకీ, భిక్షుకులకీ, ఇంకా ఎంతోమంది సహాయాన్ని అర్థించేవారికి అనేక విధాలుగా సేవజేయడానికి భారత దేశంలో భారీ ఎత్తున కృషి జరుగుతూంది. నేను చూసిన వివిధ ప్రదేశాలనుగురించి, అక్కడ జరుగుతూన్న కృషిని గురించి, ఎంతో ప్రేమతో నాకు ఆహ్వానమొసంగిన ప్రజాసేవకులని గురించి, తమ పనియెడల అత్యంత శ్రద్ధతో, దృఢనిశ్చయముతో తమ యావచ్ఛక్తినీ వినియోగించి పని చేస్తున్న అసంఖ్యాక సంఘసేవకులని గురించీ ఈ నా వ్యాసంలో చెప్పడానికి ప్రయత్నిస్తాను.

కాని ఈ వ్యాసంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో జరుగుతూన్న అభివృద్ధి కార్యకలాపాలను గురించి మాత్రమే నేను చెప్తాను. భారత దేశంలో అత్యంత ముఖ్యమైనవి గ్రామీణ ప్రాంతాలే! భారత దేశంలో అధిక సంఖ్యాకులైన ప్రజలు గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. పట్టణప్రాంతాల ప్రజలుకూడా ఎక్కువ మంది పల్లెప్రాంతాలనుండి వెళ్లి అచ్చట స్థిరపడినవారే! అందుచేతనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కార్యకలాపాలు దేశపురోభివృద్ధికి ఎక్కువగా తోడ్పడుతుంది.

గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యవంతులై, విద్యావంతులై, సంస్కృతీపరులై, వారు నివసించే గృహాలు పరిశుభ్రముగావుండి, వారి పొలాలు పంటలతో కలకలలాడుతూంటే యావద్భారతదేశం సిరిసంపదలతో వర్ధిల్లుతుంది.

భారత దేశంలో ఒక ప్రదేశాన్నుంచి మరియొక ప్రదేశానికి చేరడం చాలా కష్టం. అందులో ఒక గ్రామీణ కేంద్రంనుంచి మరియొక కేంద్రం చాలా దూరంలో వుంటాయి. అందుచేతనే గడచిన కొలది సంవత్సరాలలో ఈ గ్రామీణ ప్రాంతాలలో జరిగిన అభివృద్ధిని గమనించడం నాకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో పొందుపరచబడిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా గమనార్హమైనవి.

నీటి పారుదల, వ్యవసాయ సంస్కరణలు, పశుపోషణ, ఆహారం, పారిశుద్ధ్యము, కవులుదారీ విధానము, వీటిలో తీసుకువచ్చే మార్పుల వలన, బంజరుగా, బురదనేలగా నివాస యోగ్యముకాని భూములను వ్యవసాయ యోగ్యంగా చేయడంలో అభివృద్ధి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతున్నవి. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కార్యకలాపాలు అత్యంత ఉత్సాహంతో, పట్టుదలతో త్వరితగతిని ముందుకు సాగిపోతున్నవి. నాకు అవకాశం లభించివుంటే ఈ కార్యకలాపాలను ఇంకా ఇంకా చూసి వుండేదానిని.

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థవారి అధ్వర్యమున నిర్వహింప బడుతూన్న గ్రామీణ సంక్షేమ విస్తరణ ప్రణాళికల నిర్వహణను చూచే అవకాశం నాకు లభించింది. స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారముతో, రాష్ట్ర సాంఘిక

సంక్షేమ సలహా సంఘములచే ఆయా ప్రాజెక్టులు ప్రారంభింపబడినాయి. మొత్తంమీద ఏడు రాష్ట్రాలలో పదకొండు ప్రాజెక్టులను నేను సందర్శించాను.

ఈ ప్రాజెక్టులన్నీ ఆయా ప్రాంతాలకి తగినట్లు బహుముఖంగా కృషిని సాగిస్తూన్నవి. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సౌకర్యములు లేని ప్రాంతములలో స్త్రీలకు, పిల్లలకు వైద్య సౌకర్యములు కూర్చి సంక్షేమ కృషిని కొనసాగించుటకు ఇక్కడ ప్రయత్నములు జరుగుచున్నవి—

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఈ సంక్షేమ విస్తరణ ప్రణాళికల కృషిని నాలుగింతలుగా కొనసాగించుటకు ప్రభుత్వము నిర్ణయించడం ఈ ప్రణాళికలు జయప్రదముగా కొనసాగడానికి ఒక శుభసూచనగా తోస్తుంది.

ఆయా ప్రాంతాల ప్రజావసరాల్నిబట్టి ఒక క్రమ పద్ధతిని —అనగా రోజువారీగాను, వారానికీ, పదిహేను రోజులకీ, ఆయా ప్రణాళికా ప్రాంతాలలో కృషి కొనసాగుతున్నది. నేను సందర్శించిన అన్ని ప్రాజెక్టు కేంద్రములలోను 'బాల్‌వాడీ' లున్నాయి. ఈ 'బాల్‌వాడీ'లకి సరియైన ఇంగ్లీషు పదం చెప్పడం కష్టమే!

బాల్‌వాడీ :

ఈ బాల్‌వాడీలకి బడికివెళ్ళే వయస్సురాని పిల్లలు వచ్చి సులభముగా అర్థమయే ఆధార విద్యకి సంబంధించిన ప్రాథమిక విషయాలను నేర్చుకుంటారు. దీనివలన పనిచేసే తల్లులకి తమ పిల్లల విషయంలో కొంత బాధ్యత తగ్గుతుంది.

ఈ పిల్లలకి ఆరోగ్యవంతమైన, పుష్టికరమైన ఆహారం అదనంగా ఈ కేంద్రాలలో లభిస్తుంది. అంతేకాక ఇతరత్రా లభ్యంకాని వైద్య సౌకర్యాలు కూడా ఇక్కడ వీరికి లభిస్తాయి.

ఈవిధమైన 'బాల్‌వాడీ'లు భారత దేశపు గ్రామీణ ప్రాంతాలలో ఇతోధికంగా స్థాపింపబడుతూండడంచేత వీటి ప్రభావం భావిపౌరులైన ఈపిల్లలపైన ఎంతగానో వుంటుంది. పిల్లలను పూర్తిగా తమ తల్లుల సంరక్షణనుండి తొలగించుట కంటే, ఈ కేంద్రములవారి అభివృద్ధికి ఈ విధంగానే తోడ్పడటం మంచిది. క్రమ పద్ధతిలో పనిచేసే కొన్ని ముఖ్య కేంద్రాలలో పిల్లలకు ఆటలు, పాటలు సులభ పద్ధతులద్వారా నేర్పబడుతున్నాయి. కట్టుదిట్టాలతో కూడిన పాఠశాలల క్రమశిక్షణ విధానాలకంటె వయసు రాని పిల్లల స్వేచ్ఛకీ, అభివృద్ధికీ ఇటువంటి కేంద్రములే ఇతోధికముగా తోడ్పడగల వనుటలో సందేహములేదు.

చిన్నపిల్లలకి ఆనందం ఆరోగ్యం పెంపొందింపజేసే ఎన్నోరకాల ఆటలు ఈ కేంద్రాలలో వున్నాయి. పాశ్చాత్య దేశాలకి తెలియని ఎన్నో రకాల భారత దేశపు ఆటలను నేనీ కేంద్రాలలో నేర్చుకున్నాను. కొన్ని కేంద్రాలలో ఈ ఆటలలో శిక్షణ ఇచ్చే నిమిత్తం కొందరు నియమింపబడ్డారు. ప్రతి గ్రామీణ కేంద్రానికీ వెళ్ళి అక్కడ రకరకాల ఆటలను నేర్పడం వీరి విధి. ఒకటి రెండు రకాల ఆటలలో భారీ ఎత్తున తయారుచేయబడిన సామగ్రిని ఉపయోగించడం నేను చూచాను. కాని అనవసరంగా వీటికోసం డబ్బు ఖర్చుచేయడం మంచిది కాదని నాకు తోచింది. ముఖ్యంగా ఒక కేంద్రంలో లోహపు టూయలల్నీ, జారే పలకల్నీ, తూగుడు యంత్రాలనీ ఉపయోగించి, విశేష ధనాన్ని వ్యర్థం చేయడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

ఈ కేంద్రంలో కొమ్మలనెక్కి ఆడుకొనడానికి ఎన్నో చెట్లు, తూగుడుయంత్రాల్ని చేయడానికి కావలసినన్ని కర్రదుంగలూ వున్నాయి.

నేను పట్టణ వాసిని కాబట్టి పిల్లలు ఆడుకోడానికి ప్రవేశపెట్టిన ఈ 'తయారీ సామానులు' వేరే గత్యంతరం లేక ప్రవేశపెట్టాలే గాని, సహజంగా ప్రకృతిలో ఈ సౌకర్యాలు లభించేటప్పుడు పిల్లలను ఈ కృత్రిమ విధానాల నలవరచకూడదని నా అభిప్రాయం.

ప్రసూతి కేంద్రం :

పిల్లలకి సంబంధించిన ఈ కార్యకలాపాలే కాక, ప్రతి కేంద్రంలోనూ స్త్రీలకీ, పిల్లలకీ ఉద్దేశింపబడిన వైద్యశాల ఒకటి వుంది. దీనిలో శిక్షణ పొందిన మంత్రసాని నియమింప బడింది. వీటిద్వారా ప్రజలకు అపారమైన సేవ జరుగుతూంది. ప్రజలు ఈ వైద్య సదుపాయాలని ఎంతగానో హర్షిస్తున్నారు. ఈ కేంద్రాలలో వారానికి ఎక్కువకాలం ఈ వైద్యశాలలలో ప్రతిఫలం ఆశించకుండా పనిచేసే డాక్టర్లను నేను కలసికొన్నాను. వీరుగాక పల్లెలలో వుండే మంత్రసానులు దూరపు వూళ్ళకి నడిచివెళ్ళి పురుళ్ళ సమయంలో సేవ చేయడం నేను గమనించాను. ఏవూరో చెప్పదలచుకోలేదు గాని— ఒక వూళ్ళో మంత్రసాని తక్కినవారితోపాటు నన్ను కూడా తూకం వేసి తన పుస్తకంలో వివరాలను నమోదు చేసుకొన్నది! ఇతరత్రా వైద్య సదుపాయాలు లేని ప్రదేశాలలో ఈ దళాలు ప్రశంసనీయమైన సేవ చేస్తున్నాయనడంలో సందేహంలేదు.

వయోజనవిద్య :

ఈ కేంద్రాలలో జరుగుతూన్న మరియొక పని స్త్రీలకీ, ఎదిగిన ఆడపిల్లలకీ విద్యను గరపడానికి తరగతులను నిర్వహించడం, ఈ తరగతులు సాధారణంగా మధ్యాహ్న సమయంలో తీరికగావుండే వేళలలో జరుపబడుతున్నాయి. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థకిచెందిన ఒకరితో నేనొక కేంద్రాన్ని సందర్శించినప్పుడు అక్కడ బాలురకి తరగతి నడపబడుతున్నది.

"మనం చేయవలసింది స్త్రీలను విద్యావంతులుగా చేయడంగాని, మగవారిని కాదు. తల్లిని విద్యావంతురాలినిగా చేయండి. ఆ కుటుంబం అంతా విద్యావంతుల కుటుంబమౌతుంది" అని వారికి నాతో వచ్చిన ఆమె సలహా ఇచ్చారు! నిజంకూడా అంతే. ఈ కేంద్రంతో అనేకమంది యువతులు పరిసర పరిశుభ్రతని గురించీ, శరీరారోగ్యాన్ని గురించీ, అక్షరాస్యత, రాబడిని వృద్ధిచేసే చేతిపనులు, సాంఘిక పౌరశిక్షణ విధానాలు, భారతీయ సారస్వతం, సంగీతం, జానపద సాహిత్యము, మొదలైన ఉపయోగకరమైన ఎన్నో విషయాలను ఇక్కడ నేర్చుకొంటున్నారు. ప్రాచీనమైన చేతిపనులనీ, కొత్తగా ఆ కేంద్రంలో కనిపెట్టబడిన పద్ధతులనీ ఎన్నో అందమైన వాటిని నేను చూశాను. కొన్ని కొన్ని చోట్ల తయారైన ఈ వస్తువులు అంత ఉన్నతశ్రేణికి చెందినవికావు; వీటిని తయారుచేయడానికి ఉపయోగించిన సిల్కుదారాలు, గుడ్డ, పనిముట్లు, ఇతర సామానులపై వీటి నాణ్యత ఆధారపడి వుంటుంది. తమకు అంతగా తెలియని పాశ్చాత్య ఫక్కీలను అనుసరించడానికి ప్రయత్నించడం కూడా దీనికి ఒక కారణమే.

ఇటువంటి వస్తువులను నేను చూచినప్పుడు ఈ విధమైన వస్తువులను తయారు చేయడంవల్ల చేతి పనుల విలువ ఏవిధంగా ఉండగలదని నేను ప్రశ్నించేదాన్ని. ముఖ్యంగా ఈ విధంగా తయారైన వస్తువులు అమ్మకానికి పనికి రానప్పుడు వాటిని తయారుచేయడమే అనవసరమని నా వాదన. అందుచేతనే గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే సంఘసేవకులకు నా విజ్ఞప్తి ఏమిటంటే "ఇప్పటికే ఎక్కువ పనిచేసి అలసివున్న స్త్రీలను ఆర్థికముగా ప్రయోజనకారి

కాని ఇటువంటి చేతి పనులలో నియమించి, వారికి గల కొద్దిపాటి విశ్రాంతి సమయాన్నీ వృధా చేయవ"ద్దని.

రోజువారీగా ఈ కేంద్రంలో జరిగే పై పనులేకాక, వారం వారం, లేక పదిరోజులకో గ్రామ పారిశుద్ధ్యము, బట్టల్ని ఉతకడం, పండుగ సమయాలలో ఉత్సవాలు చేయడం, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం జరపడం ఈ కేంద్రాలలో నిర్వహిస్తారు. గోడలపై వార్తలను వ్రాసి ప్రజలకు తెలియచేయడం; ఆరోగ్య సూచనలు చేసి, పెరటితోటల పెంపకానికి ప్రోత్సాహమివ్వడం, గ్రామపఠనమందిరాన్ని ప్రారంభించడానికి ఈ కేంద్రాలు చేస్తున్న కృషిని నేను ప్రత్యక్షంగా చూశాను. గ్రామ ప్రజలలో విద్యావ్యాప్తికి కొన్ని కేంద్రములు చలన చిత్రాల ద్వారాను, కొన్ని ప్రదేశాలలో ఉపన్యాసాలద్వారాను కృషి సల్పుతున్నాయి. వీటిద్వారా గ్రామీణ ప్రజలు ఎంతో లాభాన్ని పొందుతున్నారు.

ఆయా ప్రాంతాల గ్రామీణ ప్రజల అవసరాలను అధికారులకు తెలియజేయడానికి చాల తోడ్పడుతున్నాయి. అంతకుముందు ఈ ప్రజల అవసరాలను విస్మరించిన అధికారులు ఈ ఈ కేంద్రముల ద్వారా తమకు పంపబడిన విన్నపములను ఇతోధికమైన శ్రద్ధతో గమనించుచున్నారు. ఈ ప్రాంతాల ప్రజావసరాలను తీర్చడానికి కృషిచేయడంలో ఆయా కేంద్రాలు స్థానికంగావున, ప్రజోపయోగకర సంస్థలతో సన్నిహిత సంబంధం పెట్టుకొని, ప్రతి ఒక్కరి సహకారంతోనూ ముందుకు సాగిపోవాలి.

ప్రజాసహకారం :

నేను సందర్శించిన ఆయా గ్రామాల ప్రజలను గురించి కూడా నేను ఇక్కడ చెప్పకపోతే నా పరిశీలన అసంపూర్ణంగానే వుండిపోతుంది. ఈ ప్రజలు అభివృద్ధికార్యకలాపాలపైన చూపించే ఆసక్తి ఉత్సాహం వర్ణనాతీతం. వాస్తవంగా ఈవిధమైన ఉత్సాహం ఒకరిద్దరిలోగాక ఒక 'అంటువ్యాధి'లా వ్యాపించి పోతూంది! ఆయా కేంద్రాలలోవుండే సంఘసేవికలు ప్రజల ఉత్సాహానికి తగినరీతిని వారితో కలసి ముందుకు అడుగు వేయలేకపోతున్నారని నాకు కనిపించింది. ఈ ప్రజలలో విజ్ఞానతృష్ణ, తమ గ్రామాలను బాగుచేసికొనవలెననే ఆకాంక్ష వారిలో అంత ఎక్కువగా కానవచ్చింది. చాలా కేంద్రాలలో ప్రజలవద్దనుండి అనుకొన్న దానికంటె సహాయం ఎక్కువగానే లభించినా, కొన్ని గ్రామాలలో మాత్రం సహకారం అంత ఆశాజనకంగా లేకపోవడం శోచనీయం. ఈ గ్రామీణ ప్రజలు ఆర్థికంగా వెనుకబడివున్నా, వీరిలో చాలమంది శారీరకంగా కష్టించి పనిచేసే స్వభావంకలవారు. "అందుచేతనే ఈ మనిషి బలాన్ని, ధనాన్ని, నిరర్థకమైన పనులలో వ్యర్థం చేయక, ప్రజోపయోగకరమైన, సంఘానికి అత్యధికముగా లాభాన్ని చేకూర్చే పనులమీద ఉపయోగించడం ఎంతైనా అవసరం."

తాము చేయబోయే పనులమీద ప్రజలకు నమ్మకం కలిగినప్పుడే వారి ఆదరాభిమానాలను చూరగొని, వారి నమ్మకానికి ఈ కేంద్ర నిర్వాహకులు పాత్రులు కాగలుగుతారు.

ఈ సంక్షేమ ప్రణాళికా నిర్వహణకు కాబోయే ఖర్చులో నూటికి ఇరవై ఐదు వంతులు ధనరూపంలోగాని, వస్తురూపంలోగాని, పని రూపంలోగాని అక్కడి ప్రజలు ఇవ్వవలసి వుంటుంది. ఈ విధంగా ఆయా గ్రామాల ప్రజలు ఈ ప్రణాళికా నిర్వహణలో భాగస్వాములై విజయానికి తోడ్పడగలుగుతారు. ఎవరో ఎక్కడో దూరంగా తమ సంస్థద్వారా ధర్మంగా ఇచ్చిన డబ్బుతో ఒక పని జరగడం

గ్రామీణ భారత సందర్శనము

కంటె, తమంతటతాము ఆపనుల నిర్వహణలో పాల్గొంటే ప్రజలలో వుండే తృప్తి ఎప్పుడూ అధికమే !

ఆఖరున మరి రెండు విషయాలు చెప్తాను. గ్రామీణ సంక్షేమ కార్యకలాపాలలో గ్రామ సేవకుల పాత్ర అత్యంత ప్రధానమైనది. ప్రజలు ముఖ్యంగా ఈ గ్రామసేవకులనుండి ఎన్నో విషయాలు నేర్చుకొంటారు. **అంతేకాని కేంద్రసంస్థ నుంచిగాని, ఉత్తరువులను జారీచేసే అధికారులవద్దనుంచిగాని ప్రజలు నేర్చుకోరు. అందుచేతనే ఈ గ్రామసేవకులు చిత్తశుద్ధి, అనుభవము, ప్రపంచజ్ఞానము** గలవారై **యుండాలి.** ఈ గ్రామసేవకులు కేవలం ఈప్రజలను ఉపన్యాసాలద్వారానేకాక తమ దైనందిన కార్యకలాపాల నిర్వహణద్వారా, ఆయా పనులను తాము చేయడంద్వారా ప్రజలకు నేర్పగలుగుతారు. ప్రజలలో ఉత్సాహాన్ని కలిగించగలుగుతారు. అందుచేత ఈ గ్రామసేవకులు ప్రజలమధ్య గ్రామాలలో నివశించడం ఎంతైనా అవసరం. చాల కేంద్రాలలో గ్రామంలో విడిగా నివసించడంకంటె స్త్రీలు కలసి ఒకచోట వుండడమే చాలా అనుకూలంగా వున్నట్లు గమనించాను. ఒక గ్రామానికి మరియొక గ్రామానికి మధ్య చాల దూరం వుండటంచేత, ఈ గ్రామసేవికలు ఒక్కొక్కప్పుడు చాల దూరము ప్రయాణము చేయవలసి రావడంచేత, ఈ విధంగా ఇద్దరు కలిసివున్నప్పటికీ ఒక్కొక్కప్పుడు వీరి పని కష్టంగానే కనుపించింది.

ఈ విధంగా కేంద్రాలలో పనిచేసేవారు ఇతర కేంద్రాలను సందర్శించడంవల్ల, ఆయా కేంద్రాలలో ఏవిధంగా పనిజరుగుతోందో ప్రత్యక్షంగా చూడటంద్వారా, తమకెదురైన కొన్ని సమస్యలను సులభముగా పరిష్కరించుకొనగలుగుతారు.

గ్రామీణ కేంద్రాలలో పనిచేయడానికి పంపబడేముందు శిక్షణ ఇప్పుడు భారీ ఎత్తున కొనసాగింపబడుతూంది. ఈవిధానంవల్ల ఆయా కేంద్రాలలో పని మరింత పటిష్టంగా జరుగుతుందనడంలో సందేహంలేదు.

ఇన్ని ప్రతిబంధకాలనీ, సమస్యలనీ ఎదుర్కొనవలసివచ్చినా ఈ కేంద్రాలలో జరుగుతూన్న పనియొక్క ప్రమాణం నిజంగా ఉన్నతమైనదే. ఈ కేంద్రాలను స్థాపించినది మొదలు కొలదికాలంలోనే ఇక్కడ జరిగిన కృషి, సాధించిన విజయాలు ఎవ్వరినైనా ముగ్ధులను చేయక మానవు. సంక్షేమ విస్తరణ ప్రణాళికల విషయంలో ఇక్కడ ప్రత్యేకముగా అభినందించవలసివున్నది. కేవలం స్త్రీలకు పిల్లలకు వారి అభివృద్ధికి తోడ్పడేటందుకు ప్రత్యేకం స్త్రీల చేతనే నిర్వహింపబడుతూన్న ఈ కేంద్రాలకు ఒక ప్రత్యేకత వున్నది. ఈ కార్యనిర్వాహకులు మిక్కిలి అభినందనీయులు. మామూలు సంక్షేమ ప్రణాళికలకంటె వీటిలో ప్రత్యేకత గమనార్హమైనది.

కేవలం ఒక ప్రేక్షకురాలిగా నేను నా అభిప్రాయాలను ఇక్కడ పొందుపరచాను. ఈ కార్యకలాపాలలోని మంచి చెడ్డలను రెండింటినీ నేను ఇందులో వ్రాశాను. గ్రామీణ భారతాన్ని చూచినప్పుడు నేను పొందిన ఆనందాన్ని ఎన్నటికీ మరువజాలను. ఎంతో ప్రేమతో, ఆదరంతో నన్ను ఆహ్వానించిన ప్రతి ఒక్కరికీ ఈ నా వ్యాసంద్వారా కృతజ్ఞతాపూర్వక వందనములను తెలియజేస్తున్నాను. ఆయా కార్యనిర్వాహకుల ప్రజాసేవ నాకెప్పుడూ జ్ఞాపకం వుండి, నా భావికార్య నిర్వహణలో నాకు తోడ్పడి ఆదర్శప్రాయంగా వుండగలవు. వివిధ రంగాలలో పనిచేస్తున్న బ్రిటిష్ సంక్షేమ కార్యకర్తల పక్షమున భారత సంక్షేమ కార్యకర్తలకు నేను హృదయపూర్వక శుభాకాంక్షలను, అభివందనములను అర్పిస్తూ ఈ వ్యాసాన్ని ముగించుతున్నాను.

శ్రీమతి కమలాదేవి

కొన్ని మాసాలకు పూర్వం నేను శ్రీమతి కమలాదేవినికలుసుకొన్నాను. ఆమెతో కాస్సేపు కులాసాగా మాట్లాడినాను. ఆమెతో నాకు అసలు 20 సంవత్సరాల క్రిందటనే పరిచయం కలిగింది. అయితే అప్పట్లో మా సమావేశం వివరాలు నాకు ఆమెకుకూడా అంతగా జ్ఞాపకం, లేవు. అయితే ఈసారి అయిదు నిమిషాలు మాట్లాడగానే ఆమె స్వభావం, ఆమె లక్ష్యాలు, ఆశలు ఆశయాలు, వ్యక్తిత్వం, జీవితం పట్ల ఆమె దృక్పథం అన్నిటినుంచి సర్వతోముఖమైన ఆమె పరిజ్ఞానం నాకు బాగా పరిచితమైనట్లుగా తోచింది. ఆమెను వదలి వెళ్ళిపోగానే నా మనస్సు వ్యథితమైపోయింది. ఏదో పెద్ద వెలితి, ఏదో చెప్పాలనే కోరిక ఏదిచెప్పాలో తెలియని సందిగ్ధత నన్ను బాధించినవి. నాకుకలిగిన అభిప్రాయాలకు ఒక రూపం యివ్వాలని ఎంతో ప్రయత్నించాను కాని విఫలురాలనైనాను; దానితో కొన్నాళ్ళు గడచిన తర్వాతనైనా ఆ అభిప్రాయాలకు ఒక స్వరూపం ఏర్పడుతుం దేమోనని ఊరుకొన్నాను. చివరకు ప్రశాంతంగా కూర్చున్నపుడు ఆ సమావేశం నాడు కలిగిన అనుభూతులు జ్ఞాపకానికి వచ్చాయి.

శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయను మీరు కలుసుకోగానే పవిత్రమైన మాతృవాత్సల్యంఅనుభవానికివస్తుంది. ఆమెముఖకమలంలో తోచే చిరునవ్వు మీకు ఆవిడకు వయస్సుతో గాని, అంతకుముందే ఏసమస్యపట్లనైనా మీకు కలిగివున్న విశ్వాసాలలోగాని అంతరాలేనైనా వుంటే అవి ఒక్కసారిగా సూర్యరశ్మికిమంచులా విచ్చి పోతాయి. తనను కలుసుకోడానికి వచ్చిన వారి వ్యక్తిత్వాన్ని గమనించి, గుర్తించి, సామరస్యంతో సద్భావంతో ఏసమస్యనైనా కూలంకషంగా చర్చించే సామర్థ్యంగల అటువంటి వ్యక్తి —యితరులను గురించి తెలుసుకోవాలనే కోరికగాని, తీరికగాని ఎవరికిలేనట్లుగా తోచే ఈ కాలంలో— కనిపించడం అరుదు. నేను అనేకమందిని వారి వారి వ్యక్తిత్వాలను గురించి తెలుసుకోవాలనే కలుసుకొన్నాను. రాత్రివేళ మహా సముద్రంలో వస్తూ పోయే ఓడలకు మల్లెనే మనజీవితాలు గడుస్తుంటాయి. అటు పోయే ఓడకు యిటు వచ్చే ఓడసంగతి ఏ విధంగా క్షణంపాటు ఎలాగుర్తుకు వస్తుందో అలాగే మనంకూడా ఒకరి నొకరం యాథాలాభంగా కలుసు కొంటూ తెలుసు కొంటూ వుంటాము. అయితే శ్రీమతి కమలాదేవిమాట. ఆమెను నౌకతో పోల్చలేము. అనేక నౌకలకు ఆశ్రయమిచ్చే హార్బర్ వంటిది. అక్కడ మనకుస్వాగతం, హృదయ పూర్వకమైన ఆదరణ, మర్యాద, దయార్ద్రమైన వచో మాధుర్యం లభిస్తాయి.

విభిన్నములైన అనుభవాలతో, లక్ష్యాలతో ప్రభావాలతో శ్రీమతి కమలాదేవిజీవితం అనేకమైన దివ్యానుభూతులతో నిండి పోయింది. చదువు కొంటున్న రోజులలోనే తలిదండ్రులు ఆమె భవితవ్యాన్ని గురించి దూరదృష్టితో వ్యవహరించినట్లుగా కనిపిస్తుంది. లండన్ బెడ్‌ఫర్డ్ కళాశాలలో విద్యార్థినిగావుంటూ ఆమెసాంఘిక శాస్త్రంలో ప్రజ్ఞా ప్రాభవాలను సంతరించు కొన్నది. దీనివల్ల సిద్ధాంతరీత్యా, ఆచరణరీత్యా సంఘసేవను సమగ్రంగా పరిశీలించే అవకాశాలు ఆమెకుకలిగాయి. అనేక సంఘసేవా సంస్థలనూ,

కమలాదేవి

కార్మికుల క్లబ్బులను, బాల సంక్షేమ సంస్థలను ఆమె సందర్శించినది.

ఇంగ్లండ్‌నుంచి తిరిగి రాగానే ఆమె దృష్టి భారతీయకళాపునరుద్ధరణపై ప్రసరించింది. విద్యార్థినిగా వున్న కాలంలో కూడా ఆమెకు నాటక రంగం అంటే ఎనలేని ప్రీతి. భర్త శ్రీ హరీంద్రనాథ్ చటోపాధ్యాయతో నాటక రంగ సముద్ధరణకు పూనుకొన్నది. నాటక రంగంలో పునరుజ్జీవనాన్ని సాధించడానికి, ఒక కళగా ప్రజలఆదరణ భాగ్యం లభించడానికి విద్యాధికులైనవారు స్త్రీ పురుషులూ కూడా రంగంలో ప్రవేశించడం అవసరమని ఆమె భావించింది. అప్పట్లో ఆమెకు ఈ సందర్భంలో మేనక (మిలాన్‌సోపే) మిూరాచటర్జి వంటివారి సాహచర్యం లభించింది.



అప్పట్లో దేశం కల్లోలితంగా ఉండేది. సాంఘిక పునరుజ్జీవనం, దేశ స్వాతంత్ర్యం — మహిళా మహోదయం, కళాసముద్ధరణ — ఇన్నిటిలోను ఆమె పాల్గొనవలసివచ్చింది. 1930 నుంచి 1942 వరకు భారత స్వాతంత్ర్య సమరంలో ఆమె మన స్ఫూర్తిగా పాల్గొన్నది. మహిళా స్వచ్ఛంద సేవికా దళాలను ఆమె ఏర్పాటు చేసినది. ఈ సమయంలోనే అఖిల భారత మహిళాసభ అధ్యక్షురాలుగా ఆమె చేసిన సేవ అగణ్యమైనది. 1941 లో అంతర్జాతీయ మహిళాసభకు హాజరైన సందర్భాన శ్రీమతి కమలాదేవి ప్రపంచంలోని వేర్వేరు దేశాలలో మహిళల జీవన విధానాన్ని పరిశీలించింది. స్కేండినేవియాలో సహకారోద్యమ విధానాన్ని ఆమె పరిశీలించింది. ఒక ప్రక్క శత్రు విమానాలు అగ్ని వర్షం కురిపిస్తున్న సమయంలో జపాన్‌లోని మహిళలు సహకార సంస్థలలో ఏ విధంగా పని చేస్తున్నారో గమనించింది. ఆధునిక ప్రపంచంలో యంత్రంతో పాటు సమాన నైపుణ్యంతో చేతి పనికూడా ఎలా పోటీకి నిలబడగలదో జాపనిస్ మహిళలు ఆమెకు చూపించారు. పూర్వ సాంప్రదాయాలను, సాధన సంపత్తిని ఆధునికావసరాలకు తగినట్లుగా వినియోగించుకొనడానికి మన దేశంలో కూడా అవకాశాలు లేకపోలేదని ఆమెకుతట్టింది. చైనాలోని పారిశ్రామిక సహకార సంస్థలు కూడా సహకార వ్యవస్థలోని ప్రయోజనాన్ని ఆమెకు నిరూపించాయి.

1947 లో దేశవిభజన జరిగింది. లక్షలాదిగా వచ్చిపడ్డ నిర్వాసులకు పునరావాస కల్పన, ఉపాధి సమస్య ఎదురైనాయి. దానితో విదే

శాలలో- ముఖ్యంగా జపాన్, స్కాండినేవియా, చైనాలలో తాను పరిశీలించిన విధానాలను ఆచరణలో పెట్టడానికి అవకాశం కలిగింది. ఫరీదాబాద్‌లోని ఇండియన్ కో-ఆపరేటివ్ యూనియన్ అధ్యక్షురాలుగా వున్నప్పుడు దేశంలో మహిళా సహకారోద్యమవ్యాప్తికి సహకార జీవనవ్యాప్తికి వీలుగా ఒక పథకం అమలు జరుపబడింది. ఈ పథకం పరంగా జరిగిన కృషి ప్రతి ఘట్టంలోను ఆమెకు ఆసక్తి కలిగించింది. ఇండియన్ కోపరేటివ్ యూనియన్ కొత్త లక్ష్యాలను సాధించడానికి పూనుకొనడం, కొత్త కార్యక్రమాలను రూపొందించుకొనడం ఆమెకు ఎంతో తృప్తిని కలిగించాయి. ముఖ్యంగా మహిళల సహకార సంఘాల సంస్థాపననే ఆమె ఘనకార్యంగా భావిస్తున్నది. కొందరు మహిళలు ముందుకువచ్చి సంస్థలనే నిర్వహించబూనడం- యించుమించుగా ఒక పరిశ్రమనే నిర్వహించడం ఎంత ముఖ్యవిషయం అని ఆమె ప్రశ్నిస్తున్నది. సహకార విధానమే అత్యుత్తమ ప్రజాస్వామిక కార్యక్రమమని ఆమె విశ్వాసం.

"ఎవరి పలుకుబడి ప్రభావాలు మీపై ఎక్కువగా వ్యాపించాయి" అని ప్రశ్నించగా ఆమె ఇలా అన్నది :

"నాకు నచ్చినవారు అనేకమంది. వారిలో ముఖ్యంగా పేర్కొనవలసినవారు యిద్దరు. ఒకరు గాంధీజీ. మరొకరు మార్గరెట్ కజిన్స్ సతి. వీరి పలుకుబడి ప్రభావాలు నాపై ఎక్కువగా ప్రసరించి వుండవచ్చు."

అఖిలభారత మహిళాసభ స్థాపించిన రోజులలో మార్గరెట్ కజిన్స్‌సతి ఆ సభ కార్యక్రమ నిర్వహణలోనేమి సంఘ సంక్షేమ కృషిలోనేమి శ్రీమతి కమలాదేవికి అనేకవిధాల తోడ్పడినది.

"నిజంగా ఆమె నాకు గురువువలె ఉపదేశించినది" అని శ్రీమతి కమలాదేవి చెప్పినది.

"నా జీవిత చక్రంలో అనేక సంవత్సరాలు దొర్లిపోయినవి. ఇప్పుడు అన్ని వైపులా నాకు మార్పు కనిపిస్తున్నది" అని కూడా ఆమె అన్నది. మాచర్చ యువజనులపైకి మళ్ళింది. "రేపటి నాయకులమాట" ఏమిటని నేను అడిగాను.

"యువజనంలో అభ్యుదయాసక్తి చాలా ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రతివ్యక్తికి ఒక ప్రత్యేకత ఆదినుంచీ కూడా పెంపొందించుకోవాలనే కోరిక వున్నది. వ్యాపార విధానంలో పాశ్చాత్యుల ధోరణిని అనుసరించాలనే కుతూహలం కూడా ద్యోతక మౌతూవుంది. ప్రతివారిలోను 'ఇది నాపని- అది నాపనికాదు' అనే భావం చివరకు స్వల్పవిషయాలలో కూడా కనిపిస్తుంది. నా ఆఫీసులోకూడా చూస్తున్నాను. టైపు పని చేసే గుమాస్తా ఒక రోజున రాకపోతే ఆపని నిలిచిపోతుంది. ఏపనిలోనైనా విశిష్టత సంపాదించుకోవడం మంచిదేగాని మనఃఫలకంలోకి శంకలు, పరిమితులు పెంపొందించుకోవడం అభివృద్ధికి నిరోధకం. యువజనంపై నాకు చాలా పెద్ద ఆశ వున్నది. అయితే వారిలో యిట్టి వైవిధ్యాలు పెంపొందకుండా హెచ్చరించడం అవసరం" అని కూడా శ్రీమతి కమలాదేవి అన్నది.

శబరి

యస్వీ జోగారావు

రామాయణ మహాకావ్య కథలో శబరి చరిత్ర మొక ప్రకరణ అయినను రామాయణ కావ్య రసజ్ఞులు, భక్తి భావ స్నిగ్ధ హృదయులు నగు భావుకులకు కావ్యపఠన కడపటను పునఃపునః స్మరణీయమైనది శబరి పాత్ర. భావుకులనే కాదు కావ్యమును చదువుకొనలేక కథను మాత్రమే విననోచిన సామాన్య పామరజనము నాబాల గోపాలము నాకర్షించిన పాత్ర యది. అంత రామాయణ కథలో శబరి యుదంత మేకదేశమైనను ఆ పాత్ర యాకర్షణలోని ప్రత్యేకత చిత్రమైన యొక చిన్న సన్నివేశము వలన వచ్చినది. అదే సీతాధరోష్ఠవియోగి యగు శ్రీరామున కామె యొనర్చిన ఉచ్ఛిష్టఫల సమర్పణము.

అట్లు భగవంతు నంత వానికి ఉచ్ఛిష్టము నర్పించుటలో నున్న మూఢభక్తి ప్రపత్తి భావములే శబరి చరిత్రము నంత సర్వజనాదర పాత్ర మొనర్చినవి. అయితే ఆ సన్నివేశ మమూలక మైనది. అనగా ఉచ్ఛిష్ట ప్రశంస అవాల్మీకమనుట వాల్మీకి కృతముగా కశ్చిద్విపశ్చిత్పరిగణితమైన ఆనందరామాయణమున గూడ ఉచ్ఛిష్ట ప్రసక్తి లేదు మన భాస్కర వరదరాజ గోపీనాథాంధ్ర వాల్మీకి రామాయణాదు లందును గానరాదు. అందు మూలాల విధేయముగా రచింపబడినవే ఎక్కువ కావున వానిలో ఆ సన్నివేశము లేకుండుట యంత వింతగాదు. కాని అవాల్మీకములగు ననేక కథలకును సన్నివేశములకును ఆకరములగు అవల కంబరామాయణమునను, మన రంగనాథ రామాయణమునను గూడ ఆ సన్నివేశములేదు. అది మనకు లక్ష్మణ దేవర నవ్వు, ఊర్మిళా దేవి నిద్ర మొదలగు అమూలకగాథ లనేకము వలెనే ఏనాడో ఏ సహృదయ సంభావితమోయై పరంపరగా జనశ్రుతి పరిచితమై వచ్చినదే.

ఆ సన్నివేశము ఆధునిక కవుల ననేకుల నాకర్షించినది. చిక్కని శిల్పముతో శబరి పాత్రను చక్కగా చిత్రించిన శ్రీ చింతా దీక్షితులు ప్రభృతుల కతిపయ ప్రత్యేక రచనల మాట యటుండ ఆ సన్నివేశమునకు పురస్కారముగల రామాయణ కావ్యరచనలే కొన్ని బయలుదేరినవి.

ఉదా: కీ. శే. జనమంచి వారి రామాయణమున రామునితో శబరి 'ఫలమూలములు నింకఁ గల వన్యవస్తువులను వాని మాధుర్యమును దగంగ ననుభవమున నెఱిఁగి యాసక్తిఁ బదిలంబుగాఁగ నుంచినా'నన్నది. ఇం 'దనుభవమున నెఱిఁగి' యను మాటలలో నుచ్ఛిష్ట ప్రశంస ధ్వనింపబడి నట్లూహింపవచ్చును. శ్రీపాదవారి శ్రీకృష్ణరామాయణమున శబరి- 'తా రుచి చూచియే దేవదేవుని నోట బెట్టెను తియ్య తియ్యని వన్నియున్' అని యున్నది. ఇం దుచ్ఛిష్ట విషయము స్పష్టపరుపబడినది. కాని విపులముగా ఆ సన్నివేశమునకు తగిన 'వాతావరణ'మందు కల్పింపబడలేదు. ఆ సన్నివేశము సన్నివేశమంతయు సమగ్ర మనోజ్ఞముగా మనకు గానవచ్చునది శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షమునందు- అంతకంటెను ప్రత్యేకముగా శబరి పేరితో ఉచ్ఛిష్ట మను నొక ప్రకరణ శీర్షికతో నొక లఘుకృతి నలఘుభావ ప్రతిపత్తితో నతిమనోహరముగా రచించినారు శ్రీమాన్ 'కవిరత్న, కవిశేఖర, సుధీమణి' శ్రీ గుదిమెళ్ళ రామానుజాచార్యులవారు.

ఈ రామానుజాచార్యులవారు సుమారు ముప్పది లఘుకృతులు రచించిన సుకృతి. అందు సమ్యగ్విశిష్టాద్వైత భావనామసితము లధికము. అట్టివానిలో శ్రీమాన్ ముడుంబై వరాహనరసింహాచార్యులను రసికావతంసమున కంకితమైన యీ శబరి యొకటి. ప్రకృత మేతత్కృతి ప్రతిపాదితార్థ సంగ్రహ సమీక్షయే ఈ వ్యాసము ప్రధానోద్దేశము.

ఇది సాక్షాత్కారము, పంపాసీమ, ఉచ్ఛిష్టము, యోగాగ్ని అని నాలుగు ఖండములు. సాక్షాత్కార ఖండమున అఖండ రామాయణ కావ్య కథా యథార్థభావనలో

అంతర్ముఖుడైయున్న కవికి 'పంపాదివ్య సరోవరాంచిత తటీ ప్రాంతంబునం'దొక 'శంపాకారుడు', నొక 'శ్యామ సుందరుడు'ను సాక్షాత్కరించిరి. మృగ్య ప్రియవస్త్వన్వేషణవ్యగ్రులై అలసి సొలసియున్న వారి వాలకముల నున్న దున్నటుల వర్ణించుకొనుచు వారితోపాటే పంపా సీమకు పయనించినది కవి హృదయము. రామ లక్ష్మణులు శబరీ కుటీరము చేరుకొనిరి.

"భిల్లవంశీయుల నోము పంట"లగు- "అల్లనాడు గంగాయతకూలమందు గుహుడంటిన పాదములు" పట్టి శబరి రామునితో—

"నీకును మాకు, మాకథకు నీకథ కున్న
దనాదినుండి యీ
లోకు లెఱుంగరాని యతిలోక
మహత్తర బంధమేదొ! వా
ల్మీకి యొకండె తానెఱుఁగు;
మేము కదా భవదన్వయప్రతి
ష్ఠైక నిదానభూతులము స్వామి!
రవంతగఁ బొఱఁ జూడుమా"

అని తమ అతిలోక యతిలోక మహత్తర బంధమును స్మరించి తదుపరి తన చిరంతన నిరీక్షణతోడి తపోదీక్షను సమీక్షించి చెప్పి, ఆతిథ్య మింకను ఈయలేదిట్లు యోగక్షేమము చేయుట కారంభించినది.

"వచ్చితిగాని నా పయిని
వత్సలతా గుణముంచి దాసికిన్
నచ్చగలేద యొంటరిగ నాయన!
వచ్చుట? నా కుటీరమున్
బచ్చగ జానకీయుతుఁడవై చను
దెంచిన నెంత మంచి దీ
మచ్చరియె నేఁడు నా హృదయ
మందునఁ బెట్టితి పెద్ద చిచ్చుగా."
"శంపయు మేఘమున్ గలియుచందము
సీతయు నీవు కూడి మా
పంపకుఁ జేరవత్తురని ప్రాణములన్నియుఁ
జిక్కఁబట్టి యీ కొంపను నమ్మియుంటి..."

ఈ విధముగా శబరి సీతాప్రశంసా పూర్వకముగా స్వీయాశయ పురస్సరముగా రామచంద్రుని కుశల ప్రశ్నము చేయుట అమూలకము గు చమత్కారము. 'పచ్చగ జానకీ యుతుఁడవై' యన్న ఆ పదసంపుటి యుటితస్ఫూర్తిగల ఆమె ఆప్యాయతలోని యొక హృదయంగమ సంగతి. 'శంపయు మేఘమున్ గలియుచంద' మనుట అదియొక అనర్ఘోపమ.

సీతా విషయికమైన కౌతుక మామె కతటితో ఆగలేదు.

"నీ సతితోడ నిన్నుఁ గను నేఁ
గనుగొందునె? యంత భాగ్య మీ
దాసికిఁ గల్గునే! ముసలిదానను-
ఎప్పుడు రాలిపోదునో
దోసెడు నీరు లో నిముడదోయి!
రఘూత్తము! రాముఁజూచిక
న్మోసెదవంచు నాకు నాకు
గురుముఖ్యుఁడు తెల్పుటచేత నిల్చితిన్."
"సొమ్ములు దీసివైచినను సొంపు నశింపదు...మా
యమ్మ యయోనిజాత-
క్షణమావల నుండిన నీ స్వరూపమే
వమ్మయిపోయినట్లు కనుపట్టును
నా కదియేమొ నాయనా!"
"ఆ జనకాత్మజాత క్షణమైనను
వీడక వెంటనున్న నా
తేజము దుర్నిరీక్ష్య మిఁక
దివ్యుల కేనియు నప్రమేయ మా
తేజము- దాని కా విధపుఁ
దేజము జూపకపోతి వున్నదే
దో జపదోషమో! పలుకుదోసమొ!
లే కుపచార దోషమో!"

పై పద్యములలో శబరీ హృదయము సమ్యగావిష్కృతమైనది. ఇట గమనింపవలసిన విశేషమొకటి యున్నది. కవిగారు వైష్ణవ శిఖామణులు. వారీ శబరీ చరిత్రమును విశిష్టాద్వైత దృష్టితో వ్రాసినట్లు స్పష్టపడు చున్నది. ఈ ఘట్టము ఘట్టమంతయు వైష్ణవభక్తి ప్రపత్త్యుచితముగా నడచినది. లక్ష్మీసమేతుడైన సకలకల్యాణ గుణ పరిపూర్ణుడైన శ్రీమన్నారాయణుని దివ్యదర్శనమునే వైష్ణవులెల్ల (వట్టి నామాలవారు గాక గట్టి నీమాలవారైన వారు) అపేక్షింతురు. ఇట శ్రీరామచంద్రుని దర్శనము అపేత సీత మైనందున మనసులో మాటలలో మథన పడుచుండిన శబరి వైఖరిలో కవిహృదయ స్పందనమే పొడగట్టినది. కాని కవిగారింకొక మెట్టు జరిగి సీతాదేవి కాధిక్యము ప్రతిపాదింప దలచి యందులకు సీతారామ నామ సంపుటిలో సీత పేరు ముందుండుట తార్కాణమనియు నింక నేమేమో చెప్పిరి. ఇది కేవల మసమం

జనము. సాధారణముగ స్త్రీవాచక శబ్దములు దీర్ఘాంతము లగుటచే శ్రుతి సుఖ సంపాదనార్థ ముచ్చారణలో నొక విధమగు ఊనిక కోసమో లేక స్త్రీకి గల ప్రత్యేకత సూచించుకొరకో సంపుటిలో పురుష వాచకములు స్త్రీ వాచక పూర్వకము లగుట పరిపాటి. ఆవిషయమై సీతారామ నామ సంపుటిలో విశేషమేమియులేదు.

శబరి తనకు సీతాదర్శన భాగ్యము లేకున్నను దండక దాటి రాడనుకొన్న రాఘవుడైన వచ్చినందుకే 'ప్రాణమ్ములు లేచివచ్చి'నట్లె 'ప్రేమగలట్టిపస్తు వగుపింపక పోయిన నెంత బాధరా స్వామి! రఘూత్తమా! అనుభవజ్ఞుడ వియ్యది నీవెఱుంగవా యేమి?' అని తన నిరీక్షణకు నతని యన్వేషణకు పరమార్థమున ఏకవాక్యత ప్రతిపాదించినది.

ఇక ఉచ్ఛిష్ట ఖండమున రాముని కారగింపుసేవ ప్రారంభించిన శబరి యీ వంకనున్న రామానుజునిట్లు ప్రశంసించినది.

"పుట్టుకతోడ నాతఁడొక భోగియెకాని
తొలంగిపోయెని
ప్పట్టిన భోగసంపదలు వానికిఁ
బాపము! రేఁబవళ్ళు నే
పుట్టకో చెట్టుకో తిరిగి ప్రొద్దులు
పుచ్చుచు నిన్ను దాఁబగన్
బట్టినవాఁడు వోలె
నెడఁబాయఁడుగా!
తత్వమునూడ సీతఁడొక తమ్ముఁడె
కాని యతండు నూపు శే
షత్వము మాత్ర మద్భుతము;
స్థానము మాఱిన పాప మీతఁడీ
తత్వము మాఱకుండెను గదా!
నినుజూడఁగఁ బ్రొకులాడు శే
తత్వము, వేయికళ్ళ నిను దాచు శే
తత్వము వాని కెప్పుడున్."

ఈ ప్రశంస శ్లేషాను ప్రాణితధ్వని విశిష్టమైనది. కవిగారి వ్యంగ్య వైదగ్ధ్యమును పట్టియిచ్చునట్టి సందర్భమిది. అట్టి ప్రశంసకు పాత్రుడైన యీ లక్ష్మణుడు శబరి యుచ్ఛిష్టమును గ్రహింపనున్న రాముని 'చేయి పట్టి తినరాదిది యెంగిలి పం'డనినాడు. అతని ప్రకృతికి సన్నిహితముగా నున్న దీసన్నివేశము. ఇట కవి యౌచిత్యాభిజ్ఞత గమనింపదగినది. అది నిమిత్తముగా శబరీ తత్వాలోడన ప్రయోజనమును సాధించినా రాయన. అపుడు శ్రీరాముడు నవ్వుచున్ 'శబరిరా! యది చక్కగఁ బాలఁ జూడుమా! — ప్రేమకు లేదురా విలువ.... ఎంగిలి పండుగాఁ దలఁచితే యిది లక్ష్మణ! ఎంతమాట! ముంగొంగున మూట గట్టెదవు కోపము నెప్పుడు' అని రాముడు లక్ష్మణుని హెచ్చరించిన రీతెంతయు హృదయంగమము. అందున 'శబరిరా! యది' అన్న యెత్తుగడ ఆ హెచ్చరిక హృదయంగమత్వము నెచ్చపైచినది. అంతకంటెను హృదయంగమ మా సందర్భముననే ఆ మహాభక్తురాలి నుద్దేశించి రామ పరమాత్మ హృదయ మావిష్కరింపబడిన తీరు:

"అదియొక పుణ్యరాశి- విషయస్పృహ
కందని పుణ్యభూమి- ఆ
హృదయము యోగిసంతతుల
కెన్నగరాని షడక్షరీసుధా
హ్రదము- తపస్సు వాసనలు వ్యాప్తి
వహించిన దేవతావనం
బిది- శబరీ శుకీగళిత మీ ఫల
మందుట యెంతవారికో!

(శుక చంచూపుట స్పృష్టమైన ఫలరుచి స్పృహణీయమైనది. ఇట శబరియే రామచిలుక.)

"వినఁబడునేమొ! యామె కివి,
వెఱ్ఱి ప్రసంగములాపు మేమి నీ
వనకుము; విన్నచో శబరి యాత్మ
చివుక్కున నొచ్చిపోవు- ల
క్ష్మణ! భగవత్ప్రపన్నులకు
జన్మలు వేఱు, కులాలు వేఱు, నీ
కనుభవ మందరాని
విషయంబిది......

"శబరి చరిత్రలో, జాతికులాలు
నిల్చుటకు స్థానము లేదు
ప్రపన్నురాలినీ। గోతిని దింపఁబోకు
మదిగో చరమార్గము
నాశ్రయించితా। నూతిగఁ బట్టుకొన్నదది
యుత్తమదేశిక పాదపద్మముల్...

"గురువులు పోవు త్రోవఁ దను
గూడ గమింపఁగనున్న వ్యక్తి -
దురు కరుణాకటాక్షమును కొమ్మను
గట్టిగఁ బట్టుకొన్న దీ

ఱసము. సాధారణముగ స్త్రీవాచక శబ్దములు దీర్ఘాంతము లగుటచే శ్రుతి సుఖ సంపాదనార్థ ముచ్చారణలో నొక విధమగు ఊనిక కోసమో లేక స్త్రీకి గల ప్రత్యేకత సూచించుకొరకో సంపుటిలో పురుష వాచకములు స్త్రీ వాచక పూర్వకము లగుట పరిపాటి. ఆవిషయమై సీతారామ్మ నామ సంపుటిలో విశేషమేమియులేదు.

శబరి తనకు సీతాదర్శన భాగ్యము లేకున్నను దండక దాటి రాడనుకొన్న రాఘవుడైన వచ్చినందుకే 'ప్రాణమ్ములు లేచివచ్చి'నట్లె 'ప్రేమగలట్టిపస్తు వగుపింపక పోయిన నెంత బాధరా స్వామి! రఘూత్తమా! అనుభవజ్ఞుడ వియ్యది నీవెఱుంగవా యేమి?' అని తన నిరీక్షణకు నతని యన్వేషణకు పరమార్థమున ఏకవాక్యత ప్రతిపాదించినది.

ఇక ఉచ్ఛిష్ట ఖండమున రామున కారగింపుసేవ ప్రారంభించిన శబరి యీ వంకనున్న రామానుజునిట్లు ప్రశంసించినది.

"పుట్టుకతోడ నాతఁడొక భోగియెకాని
తొలంగిపోయె ని
పృట్టున భోగసంపదలు వానికిఁ
బాపము! రేఁబవళ్ళునే
పుట్టకొ చెట్టుకో తిరిగి ప్రొద్దులు
పుచ్చుచు నిన్నుఁ దాఁబగన్
బట్టినవాఁడు వోలె
నెడఁబాయఁడురా!
తత్త్వముగూడ నీతఁడొక తమ్ముఁడె
కాని యతండు సూపు శే
షత్వము మాత్ర మద్భుతము;
స్థానము మాఱిన పాప మీతఁడీ
తత్త్వము మాఱకుండెను గదా!
నినుజూడఁగఁ బ్రాకులాడు శే
తత్త్వము, వేయికళ్ళ నిను దాచు శే
తత్త్వము వాని కెప్పుడున్."

ఈ ప్రశంస శ్లేషాను ప్రాణితధ్వని విశిష్టమైనది. కవిగారి వ్యంగ్య వైదగ్ధ్యమును పట్టియిచ్చునట్టి సందర్భమిది. అట్టి ప్రశంసకు పాత్రుడైన యీ లక్ష్మణుడు శబరి యుచ్ఛిష్టమును గ్రహింపనున్న రాముని 'చేయి వట్టి తినరాదిది యెంగిలి పం'డనినాడు. అతని ప్రకృతికి సన్నిహితముగా నున్న దీసన్నివేశము. ఇట కవి యౌచిత్యాభిజ్ఞత గమనింపదగినది. అది నిమిత్తముగా శబరీ తత్త్వాలోడన ప్రయోజనమును సాధించినా రాయన. అపుడు శ్రీరాముడు నవ్వుచున్ 'శబరిరా! యది చక్కఁగఁ బాఱఁ జూడుమా! — ప్రేమకు లేదురా విలువ.... ఎంగిలి పండుగాఁ దలఁచితే యిది లక్ష్మణ! ఎంతమాట! ముంగొంగున మూట గట్టెదవు కోపము నెప్పుడు' అని రాముడు లక్ష్మణుని హెచ్చరించిన రీతెంతయు హృదయంగమము. అందున 'శబరిరా! యది' అన్న యెత్తుగడ ఆ హెచ్చరిక హృదయంగమత్వము నెచ్చవైచినది. అంతకంటెను హృదయంగమ మా సందర్భముననే ఆ మహాభక్తురాలి నుద్దేశించి రామ పరమాత్మ హృదయ మావిష్కరింపబడిన తీరు:

"అదియొక పుణ్యరాశి- విషయస్పృహ
కందని పుణ్యభూమి- ఆ
హృదయము యోగిసంతతుల
కెన్నగరాని షడక్షరీసుధా
హ్రదము- తపస్సు వాసనలు వ్యాప్తి
వహించిన దేవతావనం
బిది- శబరీ శుకీగళిత మీ ఫల
మందుట యెంతవారికో!

(శుక చంచూపుట స్పష్టమైన ఫలరుచి స్పృహణీయమైనది. ఇట శబరియే రామచిలుక.)

"వినఁబడు నేమెు! యామె కివి,
వెఱ్ఱి ప్రసంగములాపు మేమి నీ
వనకుము; విన్నచో శబరి యాత్మ
చివుక్కున నొచ్చిపోవు- ల
క్ష్మణా! భగవత్ప్రపన్నులకు
జన్మలు వేఱు, కులాలు వేఱు, నీ
కనుభవ మందరాని
విషయంబిది......

"శబరీ చరిత్రలో, జాతికులాలు
నిల్చుటకు స్థానము లేదు
ప్రపన్నురాలినీ! గోతిని దింపఁబోకు
మదిగో చరమార్థము
నాశ్రయించితా! నూతగఁ బట్టుకొన్నదది
యుత్తమదేశిక పాదపద్మముల్...

"గురువులు పోవు త్రోవఁ దను
గూడ గమింపఁగనున్న వ్యక్తి - స
ద్గురు కరుణాకటాక్షమును కొమ్మను
గట్టిగఁ బట్టుకొన్న దీ

రామాయణ కల్పవృక్షమునందలి శబరినొకపరి పరామర్శించుట అప్రస్తుతముగాదు. వారి ఆరణ్యకాండము 'అమృతోత్క్ర్యంచితమున్ కథాకథన శిల్పానేకమార్గాభిరామము' అందలిదే శబరీ ఖండము.

మొదట ముఖ్యమైనది శబరి యుచ్ఛిష్టసమర్పణ విషయమున నిందొక విశేషముగలదు. శబరి పండ్లు సమర్పింపబోవ 'అవి నీవు తిని చూచి యతిరుచ్యముల ట్లంచు తెలియక నేనెట్లు తినగలుగుచు'నని రాముడంతట రాముడే యన్నాడు. 'స్వామి ప్రతివృక్షమందున బ్రథమమందు, నేను రుచిచూచియే తెచ్చినా'నన్నది శబరి. ఇది యొక చక్కని శిల్పపు మెలకువ. ఇది గుడిమెళ్ళవారి కృతిలో గన్పింపదు. కాని వారా సందర్భమును పురస్కరించుకొని ప్రకరణోచితముగా రామానుజనాగ్రహము నిమిత్తముగా నొక మహోదాత్తఫక్కిలో శబరి అంతర్మూర్తి నావిష్కరింపజేసినారు. ఆ సందర్భమున కల్పవృక్షమున రామచంద్రుని మందహాసము సౌమిత్రిని పలకరించినది మాత్రమ.. అందును శబరి అంతర్మూర్త్యావిష్కరణ మొకవంక నింకొక ఫక్కిలో సాగుచునేయున్నది. ఆయావిష్కరణములో గుడిమెళ్ళవారికి విశ్వనాథవారికి నొక ప్రధాన భేదముగలదు.

అసలు రామాయణము నంతటిని అద్వైతపరముగా రచించుపూనికయట విశ్వనాథవారిది. అందీ శబరీ ఘట్టము దొక ప్రత్యేకతయట. (ఇది విశ్వనాథవారి విశ్వాసమని, వారివలనగాదుగాని కొన్ని విశ్వసనీయ వర్గాలద్వారానే విన్నమాట). ప్రత్యేకత యనగా - ఈ ఘట్టమున చిక్కని రచనావైచిత్రిగలదుకాని రచనావైచిత్రికి వారి రామాయణమంతయు తార్కాణమే. అయితే ఏ దీని ప్రత్యేకతయనగా అది అద్వైతార్థ ప్రతిపాదనములోనుండి యుండును. ఈ ఘట్టమున కవి హృదయనిష్ఠముగా గాఢమైన అద్వైతభావన గలదని విశదమగుచున్నది కాని భావచాలనముకూడ జరిగినట్లనిపించును. శబరి పాత్రవిషయమున విశిష్టాద్వైత దృష్టివిశిష్టమగు గుడిమెళ్ళవారి చిత్రణమునకు విలక్షణముగానున్న విశ్వనాథవారి అద్వైత భావనాయతమగు చిత్రణములోని ఆ ప్రత్యేకతను పరిశీలించుట మాత్రము ప్రస్తుత కర్తవ్యము.

శబరిని చూచుటతోడనే 'శబరి కనులయందు స్వామి తాఁ దన ప్రతిబింబ మరసి దారవిరహమూర్తి విరహబాధయెల్లవిడిచె' ననుటలో అద్వైతార్థ ప్రరోచనగలదు. రామునికై పూలుపండ్లును దెచ్చి యీవచ్చిన శబరి 'నేఁ బూలు తేలేదు, నేఁబండ్లు తేలేదు, లీలామనోజ రాలేదు నేను' అని యిట్లు ప్రసంగించిన ధోరణిలోను, తదుపరి శబరి నుద్దేశించి రాముడుచేసిన యోగక్షేమమునకామె సమాధానములోను (చూ — రా.క॥ అ.కాం॥ శ.ఖం॥ పద్య. 355, 356 & 357) అద్వైతతత్త్వము ప్రస్ఫుటముగా ప్రకటింపబడినది. అద్వైతార్థ ప్రతిపాదన ప్రయత్నమున కున్ముఖముగా తరచు రాముని విరహోను భావమునకెందులకో పూనిప్రసక్తి కల్పించినారు సత్యనారాయణగారు. మొదట రాముని విరహమునకును, మతంగుని మహత్త్వమునకు నిందభేదము ప్రతిపాదింపబడినది. శబరి రాముని భక్తురాలు, మతంగుని శిష్యురాలు. 'క్ష్మాసుతా విరహజడు'డగు రాముడు శబర్యాశ్రమోన్ముఖుడగుచుండగా మన్మథుడాతనిపై తమ్మిపూవు బాణము సంధించి విడిచినాడట! అది రాముని 'యాత్మలోఁబడినట్లై' 'వలిమేని ప్రన్ననగుముడుతల శబరిని జూచుకోర్కి' యతని మదిలో 'తారాడిన'దట! ఆమెను జూడగనే 'దారవిరహమూర్తి విరహబాధయెల్ల విడిచె'నట! శబరి రామునితో సంభాషించినప్పుడతనిని 'లీలామనోజ', 'చిత్తజన్మ', 'ప్రాణనాథ' ఇత్యాదిగా సంబోధించినదట! అపుడు -

క్షోణిసుత యందమును జూచిచూచిచుప్ప
నాతితనుఁజూచి కామించినది యనంగ
క్షోణీతనయ సౌందర్యంబు చూడనట్టి
దానవీనన్ను కోరుట తప్పులేదు.'

"ననుఁజితజన్ముఁ డనుచుం బోల్చంబడన్ ప్రాణనాథా
యంచాడెదు నాకు నీయెడలఁజిత్తం బట్లనేయున్నదిన్
"ఆ కాంతావిరహార్తుడ, నాకును నీవిట్లువలచినా
విదిభాగ్యంబే!
"ఇదియుఁబతిగాఁగఁ గోరినన్నె వరించి,
నవప్రతీక్షాభిశీలవై
నయనశివృత్తి తామరసములఁ జొచ్చినదానిఫలము"

అని యన్నాడట రాముడు! అనుచు 'ధరాత్మజాహృతి విహృతినందిన' ట్లున్నాడట! అపుడు శబరి 'నతనేత్రాంభోజమ్ముల నతను విధాత్వలు ఫలించిరాయను' నున్నదట!

ఇట శబరీ రాముల పరస్పరానురక్తి వర్ణనీయము. అది విషయస్పృహకు ప్రసక్తిలేని సందర్భము. కాని పై నుదాహరింపబడినట్లిందున్న ఆ ప్రసంగ సందర్భములను అందును నగ్నముగానున్న ఆ చుప్పనాతి సామ్యమును జూచినచో అంతయు నేదో అద్వైతముగనున్న దనిపించును; వారికావిషయ స్పృహ యున్నట్లేతోచును. అయితే రామరామ! మన మట్లనుకొనరాదు. మరి యెట్లనుకొనవలయు ననగా కావ్యమును రచించినది విలక్షణ ప్రతిభులగు విశ్వనాథవారు కొబట్టి అందులో నేదో యొక గొప్పలోకోత్తరార్థము గర్భీకృతమై యున్న దనియే మన మనుకొనవలయును. అది యేమనగా అదే అద్వైతము. కాని యీ ఘట్టమున కద్వైత ప్రతిపత్తి కల్పించుటకు అర్థమేమూలనో యుండునుగాక కాని 'మామూలు' మాటలుగా ఆవిరహము. వలపుమొదలైన వాని ప్రసక్తి నసలెత్తుకొనవలసిన యవసరముగాని, ఎత్తుకొనిన ఆ విషయములనంతదూరము ప్రపంచింపవలసిన యవసరముగాని కానరావు. ప్రపంచింపదలచినచో కేవలమా విషయములకే ఉచితప్రసక్తి, ఆవశ్యకమగు ప్రకరణమునుగల పట్టులందు సాధారణముగా కవులెట్లు రచింతురో అట్లిచట రచింపరాదు. ఐతే, చెప్పనేచెప్పితి నొకమాట, ఇందులో సామాన్యులకు సరేసరి ధీమాన్యులకును చప్పున యూహకందరాని శిల్పపుమెలకువలేవైన నున్నవేమోమరి! రాతినుండి నారనైనలాగగల విదగ్ధుడైన విమర్శకుడు పూనుకొనవలెగాని ఎట్టి సందర్భముననైన ఆధ్యాత్మికార్థము నిట్టేసాధింపవచ్చును. ఆధ్యాత్మికత్వ మనగానే దానితీరట్టిది

ఇక నీ రామాయణ కల్పవృక్షమున శబరి ఘట్టముననే ఆధ్యాత్మికతలో నింకొక యంతస్తుగలదు. 'ఉత్తరాయణ మార్గదూర పర్యంతగామి'యైన గురువుగారి పరిచర్యార్థము యోగాగ్ని ప్రదేశోత్కంఠతోనున్న శబరితో రాముడు 'నీకు మౌనిమీద నీమీఁద నాకును, వలపుఁబొంతనములు పలువిధములు' అన్నాడు. శబరి యిట్టులనియె - 'జలధికి గౌతమిమీఁదనెంతో శబరిమీదనంతె, జలధిరాజుభర్త శబరిలజ్జావతి, గోదవెనుక దాగికొనియుపొందు'. అట్లనే మౌనివెనుకనే రమ్మనినాడు రాముడు. ఇట జలధి శ్రీరాముడు. గోదావరి మతంగుడు. తదుపనది శబరి శబరియే. సర్వనదులకు నాశ్రయము జలధి. గోదావరియు, శబరియు జలధిలో గలియవలసినవేకాని శబరి ముందు గోదావారి నను గమించి తద్ద్వారా జలధితో సంగమించుచున్నది. అనగా మోక్షోపలబ్ధికి దేశికోపదిష్ట మార్గమే శరణ్యమను విశిష్టాద్వైత ధర్మమిట స్పష్టముగా చెప్పినట్లైనది. ఇక్కడికీ చమత్కారము చాల సమంజసముగనే యున్నది కాని కవిహృదయమునుండి ఏకధారగా వచ్చుచున్న అద్వైత భావనకిచట ఉపహతిగల్గినవి. అసలు ఉత్తమ దేశికుని శిష్యోత్తమురాలిగా, శ్రీరాముని భక్తురాలిగా సిద్ధిపొందిన శబరి చరిత్రమును రామానుజాచార్యులవారివలె విశిష్టాద్వైత పరముగనే చిత్రించుట లెస్సయనుకొందును. అయితే యిది విశ్వనాథవారి శబరీ ఖండమును కొంచెపరచుట మాత్రముగాదు అనన్యసామాన్యములైన అతిమాత్రమనోజ్ఞములైన రచనా శిల్పచమత్కృతులెన్నో వారి శబరీఖండమునగలవు. అవి ప్రత్యేకముగా నొక వ్యాసమునకు వ్యాఖ్యానమునకును సామగ్రి. భవతు.

సోదరీ!

రచన: "సంగీతోపాధ్యాయ" లింగంగుంట సీతారామయ్య

మ॥ జననంబందినదాది - ఎన్నడయినన్ - స్వాతంత్ర్యమేలేని - జీ
వనమందే కృశియించి - ఎట్టెటో తరింపన్ న్యాయమంచున్ - సనా
తనధర్మంబులు చక్కదిద్దగలపెద్దల్ కట్టుబాట్లుంచి - నా
శనమున్ జేసిరి - నీదుజీవిత ప్రశంసన్ నిర్దయన్ సోదరీ!

*　　*　　*

చ॥ చదివినతప్పు - సత్కథలసన్నిధి కేగినతప్పు - మెల్లగా
పెదవులువిప్పి - పాడివినిపించినతప్పు - బజారులోనికిన్
కదలినతప్పు - పుస్తెమెడగట్టినవాని - కిరాతకృత్యముల్
మతిదలపోయ తప్పులుసుమా! ఘటియించిరినీకు సోదరీ!

*　　*　　*

చ॥ పతియని తాళిగట్టినవె పంబున - నాతడు అల్పజీవిగా
మృతుడయినంత - ధర్మములమించిన పెద్దలు చర్చసల్పుచున్
సతివగునీదుజీవితపు సౌఖ్యమెఱుంగక భర్తతోడుతన్
చితిపయికెక్క జేయుటది చిత్రముగాదె? తలంప సోదరీ!

*　　*　　*

చ॥ వనితలకెల్ల పెన్నిధి - కృపామహితాత్ముడు - రాజరామమో
హనుడుదయించి నీకిలసహాయముగా - నిజభర్తతోడ - స్త్రీ
తనువుపరిత్యజించుట అధర్మమటంచనిచాటె - నాతనిన్
దినమునకొక్కమారు - వినుతింపుము లోకహితమ్ము సోదరీ!

*　　*　　*

సమతయుజూప - శాస్త్రముల సమ్మతితోడను స్త్రీపునర్వివా
హములనుజేయపాల్పడి - మహామహులై శ్రమకోర్చి, పెక్కుక
ష్టములనుజెంది సంస్కరణ సల్పినధీరుని "కందుకూరి"నిన్
అమరుని దివ్యతేజు మనసార స్మరింపగదమ్మ! సోదరీ!

*　　*　　*

గీ॥ స్త్రీ జనాభ్యుదయముగోరి. శ్రేయమొసగు.
సత్పథమ్ములనడచి. ప్రశాంతముగను.
లోకవిఖ్యాతితోడ నెగ్గొందుమమ్మ!
ఆంధ్ర మహిళామ తల్లి. జోహారులమ్మ!

డబ్బుకోసం

శ్రీమతి జంధ్యాల సరోజ.

సీతారామయ్యంటే అవూళ్ళో చాలా మందికి తెలుసు. నాలుగేళ్ళ క్రితం, దమ్మిడిలేకుండా వచ్చిన సీతారామయ్య ఆస్తి, ఇల్లు సంపాదించుకుని నలుగురిలోనూ పేరు సంపాదించాడు. ఇది అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. కాని అంతటితో ఆగలేదు. కొడుకులిద్దరికీ పెళ్ళిళ్ళు చేసేనాటికి సీతారామయ్య లక్షాధికారి ! పెద్దవాళ్ళయిన కొడుకు లిద్దరిపై భారంమోపి, విశ్రాంతి తీసుకోవాలను కుంటున్న సీతారామయ్యకు. హఠాత్తుగా రోగం వచ్చింది. అనుకోకుండా కొడుకులిద్దరికీ అధికారమూ ఆస్తీ చేతిలోకి వచ్చినాయి.

సీతారామయ్య, కొడుకులూ, కోడళ్ళూ - మనుమలూ, సరిగా చూడటం లేదని గ్రహించాడు. ఆస్తీ అధికారమూ చేతిలోనికి వచ్చేసరికి—అంతవరకూ అణగి వుండిన కొడుకులూ, కోడళ్ళూ — తనను పురుగుకంటే హీనంగా చూస్తుండడం చూచి సీతారామయ్య ఆశ్చర్య పోయాడు.

"వాళ్ళు రాకుంటే మానె, పసిపిల్లల్ని రానీయరేం?" అనుకున్నాడు సీతారామయ్య. "ఎప్పుడూ తాత దగ్గరకెళ్ళకండి. దగ్గుతూ వుంటాడు, జాగ్రత్త!" అని కోడలు పిల్లలకు చెబుతూ వుండడం విన్నాడు చాలాసార్లు.

సీతారామయ్య పడక పశువుల కొట్టంలోనికి మార్చారు

సీతారామయ్య చిన్ననాటి స్నేహితుడు, పరంధామయ్య అప్పుడప్పుడు వచ్చి ధైర్యం చెప్పిపోతూండేవాడు సీతారామయ్య— "ఒరే ! నలుగురిలో మంచివాడని పించుకున్న నాకీగతి యెన్నాళ్ళు? ఏదైనా వుపాయం చెప్పు" అని యేడ్చేవాడు.

సీతారామయ్య నోరుతెరచి "మందు ఐపోయిందిరా!" అంటే "ఇప్పుడు డబ్బుయెక్కడ" అని విసుక్కున్నారు కొడుకులు.

ఒక రోజున పరంధామయ్య చాలా ఉత్సాహంగా — "చూడు సీతారామయ్యా ! నేనో ఉపాయం చెబుతా అల్లా చేస్తావా?" అని అడిగాడు. "నీకంటే నా కెవరున్నారు ఎందుకు చెయ్యనూ. చెప్పు" అన్నాడు సీతారామయ్య. పరంధామయ్య, సీతారామయ్య చెవిలో యేదో చెప్పాడు. సీతారామయ్య తలవూపాడు. పరంధామయ్య వెళ్ళిపోయాడు.

ఎవరైనా డబ్బియ్యవలసిన వాళ్ళేమోనని పెద్దకొడుకు "ఇంతసేపూ నీతో మాట్లాడుతున్నది ఎవరూ?" అని అడిగాడు.

"అతనా? చిన్నప్పటి స్నేహితుడు పరంధామయ్య నాకియ్య వలసిన పదివేలూ కొన్నాళ్ళకుగాని యియ్యలేనంటున్నాడు" అనగానే "పదివేలే ! నాకు తెలియనే తెలియదే !" అని ఆశ్చర్యంగా అడిగాడు. అవును మీకు తెలియదు. ఆతను నమ్మక మైనవాడని, నోటురాయకుండానే పదివేలుయిచ్చాను. అతన్ని మంచిగాఅడిగితే తప్పకుండా యిస్తాడు. అప్పుడప్పుడూ అడుగు తూండండి" అన్నాడు సీతారామయ్య.

తాత దశతిరిగింది. కొడుకులేకాదు - కోడళ్ళూ మనమలూ కూడా అన్న దానికి అవునంటూ అడుగులకు మడుగులొత్తు తున్నారు.

కాని, సీతారామయ్య హఠాత్తుగా కళ్ళుమూశాడు.

కొడుకులు మహావైభవంగా దహన సంస్కారాలు జరిపారు. పరంధామయ్య పోయేముందు సీలుచేసిన పెట్టె కొడుకులకిచ్చి "మీకియ్య వలసినదంతా దానిలో వుందండి! " అని చెప్పి వెళ్ళిపోయాడు.

కొడుకులిద్దరూ తొందరగా పెట్టెతెరచి చూచారు. పెట్టెలో గులకరాళ్ళు !! కొడుకులిద్దరూ మండిపడ్డారు - పెట్టెలోవున్న కాగితం విప్పి చదువుకున్నారు.

"అబ్బాయిలూ ! మీరేనాడూ మీ నాన్నని స
పెట్టలేదు. అదీ గాక బాధపడుతున్న వాడిని చా
చూచారు మీకు డబ్బే ప్రధానం ! అందుకనే స
చించి—పదివేలు బాకీ వున్నట్టు చెప్పాను. నావు
ఫలించింది. మీనాన్నను ఆదరించారు. ఈ మాటలు మీరు నమ్మకపోవచ్చు! కాని నన్నేమీ చేయలేరు. మీరు ఎంత తిట్టుకున్నా ఫరవాలేదు. అని.

కొడుకులు తిట్టుకున్నారు పరంధామయ్యని. చేసేదేమీ లేక —"నిజమే చాలా తప్పుచేశాం ! మనకు బాగా బుద్ధి వచ్చేటట్టు చేశాడు" అనుకున్నారు. —

"అత్తా - కోడలు"

శ్రీ సోమంచి రామం, B.Sc

వెంకమ్మ : అత్తగారు. శారద : కోడలు.

సత్యం : కొడుకు.

వెంకమ్మ : శారదా!

(దూరంనుంచి "వస్తున్నా నత్తయ్యా" అని సమాధానం.)

వెం : (కోపంగ) ఎక్కడ ఛస్తున్నావ్!

శారద : (దగ్గరగ) పిలిచారా అత్తయ్యా?

వెం : ఎన్ని సార్లరచినా పలకవేం బెల్లం కొట్టిన రాయిలా!

శా : వస్తున్నా నంటూనే ఉన్నా మీరు పిలుస్తూనే ఉన్నారు!

వెం : నేను పిలుస్తున్నానని తెలుసుగదా!

శా : అందుకే గదండి వచ్చింది!

వెం : వచ్చి మళ్లీ నంగనాచిలా "పిలిచారా అత్తయ్యా" అంటావేం? ఏం గడుసు దానివే!

శా : ఇంతకు ఎందుకు పిలిచారత్తయ్యా!

వెం : ఏం అవతల అర్జంటు మండిపోతోందా?

శా : అబ్బబ్బ! పొద్దున్నే ఎందుకండీ గోల?

వెం : గోలకాదుమరీ! నువ్వు ఆడిందల్లాఆట పాడిందల్లా పాటగ సాగనిస్తే మంచిదాన్ని లేదూ గోలచేసే దాన్ని- ఏం నేర్చావే!

: క్షమించండత్తయ్యా! పొరపాటయింది. పిలిచిన పనేమిటో చెప్పండి!

వెం : పొరపాటయింది కాబట్టే అనుకోవడం! జరగని దాని గురించి అనుకోవడ మెందుకు? విసుగ్గా ఉంటే ఫో! నేనే ఛస్తా!

శా : ఇప్పుడు నే నేమన్నాననీ! అంతరాద్ధాంతం?

వెం : నామాటలన్నీ రాద్ధాంత సిద్ధాంతాలా? రోజులు మారిపోయాయి! నా కొడుకు చేతగాని వాడు. చెవులట్టుకుని ఆడిస్తున్నావు!

శా : అదేంమాట అత్తయ్యా! ఆయన వింటే?

వెం : ఏమనుకుంటాడు? తన చేతకాని తనానికి కంటతడి పెట్టాడు.

శా : ఇప్పుడవన్నీ యెందుకండి? పిలిచిన పనేమిటో చెప్పండి!

వెం : ఏమీలేదు! బియ్యం కొలవమన్నాను కొలిచావా!

శా : లేదు! కొలిచి తెస్తా నుండండి!

వెం : ఆ! నువ్వెందుకు తెస్తావు! నా మాట నీకు లెక్కా!

శా : పూజ చేసికొని తెద్దామనుకున్నాను. ఇంతలో ఆయ నొచ్చారు. దాంతో-

వెం : ఈ లోకమే మర్చిపోయావు! ఈ అత్తముండ కే కెయ్యబట్టి యిక తప్పదని వచ్చావు!

శా : సరేలెండి! అయిపోయిన దానిగురించెందుకు?

వెం : ఇదిగో! ఇలారా! ఈ గిన్నె చూడు (గిన్నె నేలకేసి కొట్టిన శబ్దం) దీన్ని ఎంత అంటుందో! ఆపని చేసేది తోమాక తోలుస్తావా? అన్నింటికీ నేనే చావాలి! లేకపోతేలేదు! ఎందాక ఈ కొంపలో వేగ గలను?

శా : చూడలేనట్టుం దత్తయ్యా!

వెం : ఎందుకు చూస్తావ్! నీకేం పట్టింది అత్తముండ ఉంది యింట్లో ఉడకేసి పడేసేందుకు! దాసీముండ ఉంది ఖాళీ అయిన అంట గిన్నెలు తోమడానికి! ఇంక నీకేంపని హాయిగా కాలిమీద కాలేసికొని కూర్చుని తింటావు!

శా : ఎందుకొచ్చిన సాధింపులండీ యివన్నీ పొద్దున్నే!

వెం : నువ్వు రాణీవి నిక్కి నీలిగి ఎనిమిదింటికి లేస్తావు నీకు యిది పొద్దున్నలా ఉంది. ఆ శ్రీమన్నారా యణుడు కనిపించి అప్పుడే మూడు గంటలయింది.

నీకేం! చీకూ చింతా! రాత్రి 8 గం||లకు పడుకుంటావ్! పొద్దున 8 గం||లకు లేస్తావు!

శా : ఆగినెన్ని యిలా యివ్వండి తోలుచుకొస్తాను.

వెం : ఇదిగో యిష్టముంటే రోజూ తోలుస్తాండు. లేక పోతే నేనే తగలడతాను.

శా : అల్లాంటూరేమిటత్తయ్యా! రోజూ తోలవటంలా! ఇవ్వాళే ఏదో పొరపాటయింది.

వెం : పొరపాటు కాదు. నా గ్రహపాటు. తెలిసిందా!

శా : అత్తయ్యా! మీరు అనవసరంగా కోపం తెచ్చుకుని ఆవేశపడుతున్నారు!

వెం : అయ్యో! అయ్యో! నా కనవసరంగ కోపం వచ్చిందా! నువ్వేం ఎరగవేం?

శా : ఇప్పుడు నేనేం చేశానండీ మీకు అంత కోపం!

వెం : ఈ రభస చాలదూ! అత్తముండ చెప్పిందికదా చేద్దాము అని లేదుకదా! వెధవపనులు చేసి పొరపాటు అయిందనడం నేర్చావు!

శా : (విసుగ్గా) అత్తయ్యా!

వెం : ఏం కొట్టావా ఏం? మావాడు పట్టి వాజమ్మ కాబట్టి నా బ్రతుకు బజారు పాలైంది. ఆయనే బ్రతికుంటే నీచేత యిన్ని మాటలనిపించుకునే దాన్నా! ఇదంతా నా ఖర్మం.

శా : ఎందుకత్తయ్యా! ఆ గొడవలన్నీ! ఆయన వచ్చారు!

వెం : వచ్చాడా! పాపం! ఎంత దూరం తిరిగాడో కాసిని మంచినీళ్ళయినా యిచ్చావా? ఈ ఉద్యోగం కాదుకాని పిల్లాడు హూనమై పోతున్నాడు. వేళకు తిండీ తిప్పలు లేక ఎండ వాననక మొండిగ తిరుగుతున్నాడు. ఏ ముహూర్తాన కాలు పెట్టావో అమ్మతల్లివి! వాడికి ఉద్యోగం దొరకడమే అపురూపమైపోతోంది!

శా : ఏమిటినంతా అత్తయ్యా!

వెం : నీలాంటి వాళ్లు యింట్లో ఉంటే వేరే శని గానక్కరలేదు. నువ్వు రానంతకాలము మావాడు చురుకుగా ఉండేవాడు! నువ్వూ వచ్చావు! పిచ్చివాడిలా తయారయాడు! నన్నిలా సాధించి చంపుతున్నావు!

శా : అత్తగారూ! మీకోదణ్ణం. ఊరుకోండి. ఆయన ఏమన్నా అంటారు.

వెం : వింటే యేం! నిజం చెప్తే నిష్ఠూరంట! అలాగ! పోనీలే! అర్థాంగివి నిన్నేమీ అనడుగా! ఎటొచ్చీ అమ్మను నేనుంటాను ఎదురుగా! ఆనాలుగు అక్షింతలు నా మీదవేస్తాడు. పోనీలే నా ఖర్మ! (అని ఏడుస్తుంది)

సత్యం : (ప్రవేశిస్తూ) అబ్బబ్బ! ఏమిటే గోల!

వెం : (ఏడుస్తూ) నాయనా! నీకూ గోలే అనిపించిందా! ఆవిడ అందంటే తప్పా! అర్థాల్నాడే బిడ్డలు గాని గడ్డాల్నాడా? ఇంతకూ ఆయనుండగా నా ప్రాణం పోక పోవటం నా ఖర్మం!

స : ఇంతకూ ఏం జరిగిందమ్మా!

వెం : ఏదైనా జరుగుతుంది! ఎంత చెడ్డా అదీ నువ్వూ ఒకటి! ఎటొచ్చీ వేరయింది నే నొక్కత్తెను!

శా : అదికాదండి!

స : ఛట్! నువ్వూరుకో!

శా : నే నేమన్నానండీ అంత కోపం!

స : నోర్మూయ్యమన్నా!

వెం : ఎందుకు మూస్తుంది! ఉద్యోగం లేనివాడివని చేతకాని వాడివని నువ్వంటే దానికి అలుసు. నీమాట దానికి లెక్కా- నాయనా! నామాట చెప్పనే అక్కరలేదు! పోనీ అత్తముండనాయె! నాకింత సహాయం చేయటంలేదు! నాతో వాదన!

శా : అత్తయ్యా ఏమిటా మాటలు?

స : నోర్మూయ్ (అని చెంపమీద కొట్టాడు)

శా : అమ్మా! (ఏడుస్తూ వెళ్ళిపోతుంది)

స : ఛీ! ఒక్కనిమిషం శాంతి లేదీకొంపలో! ఎం నేపు పంతాలతో పడి కొట్టుకు ఛస్తారు. ఎక్క కన్నా పోదామన్నా—

వెం : ఎలా ఉంటుంది నాయనా శాంతి!

స : ఊరుకోవమ్మా! అయిపోయిందిగా! యింకెందుకు!

వెం : ఊరుకోక ఏంచేస్తానాయనా! దిక్కులేనిదాన్నయి పోయాక! నా ఖర్మం! ఆయనుంటే నాకీ తిప్పలు ఉండేవా! ఇంతకీ నిన్ననవలసిన పనేముందిలే! (అని లోనికి పోవును)

స : ఇటు చూస్తే యీ గోల! అటు చూస్తే ఆ గోల! పగవాడికైనా వద్దురా ఇలాంటి సంసారం!

దైవాధీనం

రచన :
శ్రీమతి దీదువాసు బదరీనారాయణమ్మ

భారసాలనాటి పేరెవరికీ తెలియదు. కాని అందరూ అతనిని దైవాధీనంగారూ, అని పిలుస్తూవుండేవారు. పేరుకుతగ్గ భావం, భావానికితగ్గ మూర్తి, మూర్తికితగ్గ నడత, నడతకుతగ్గ మాట, వృత్తి అక్షయపాత్ర, ఎటులనో కష్టపడి నక్షత్రాలను లెక్కించడము, నాడి పరిశీలనచేయడంమటుకు నేర్చుకున్నాడు. ఎవరు ఏ ప్రశ్నవేశినా (దైవాధీనం) అంటూవుండేవాడు. నాబోటిది ఎవరైనా, ఏమండీ దైవాధీనంగారూ, అమ్మాయి ప్రసవించింది, మూలనక్షత్రాన మొగపిల్లవానినికన్నది, ఏంచేయమన్నారు ? అని అడిగితే మూడువేళ్ళు లెఖపెట్టి, మూలనక్షత్రం ముసలమ్మగండం, మూడుమానికెల మినుములు మాబోటివారికి దానంచేయండి, ఆ తరువాత దైవాధీనం అంటూవుండేవాడు. మా అమ్మాయి పుబ్బనక్షత్రాన ప్రథమరజస్వల ఐనది ఏం చేయమన్నారు అడిగితే, పుబ్బనక్షత్రం పూర్వసువాసినీ త్వదోషం, పదలంబెల్లం మాబోటివారికి దానంచేయండి ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. చంటిపిల్లకు శ్లేష్మంగావుంది. చేతినాడిచూచి చెప్పండి అంటే, చేతులో చాలా వాతంగా వున్నది, కలకండపాకంతో కరక్కాయి అరగతీసి యివ్వండి, ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. నూరేళ్ళముసలివాళ్ళు వచ్చి తెల్లవారుజామున దగ్గు ప్రకోపించిందండి. చెయ్యిచూచిచెప్పమంటే, చెయ్యిచూచి, నాడి మూడోవేలిమీద కొడుతోంది, నీరసస్తితిలోవున్నది. పుష్టిచేయడానికి పెసరగింజంత నల్లమందు గొంతుకలో ప్రయోగంచేయండి ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. యీ అమాయకపు మాట అందరి గుండెలనూ అలజడి చేస్తూవుండేది. యింటో ఆవిడ, ఏలాగండీ సంసారం యీదడం, యీ పదిమంది పిల్లలనూ ఏలాగా పెంచడం, వీధులోకివెడితే విస్తరాకైనా తీసుకురాలేరు. మీతమ్ముడు చూచారా రాజదర్బారులోనికేగి, రోజూ కుంచెడు బియ్యం ముంతెడునెయ్యి, కూరా, నారా తెచ్చుకుని జలాసాగా కాలక్షేపం చేస్తూవుంటాడు. మీరుకూడా తెచ్చుకొనరాదా అని అంటే, అంతా దైవాధీనం, ప్రాప్తకాలముంటే, దానంతట వచ్చి పడుతుంది అంటాడు. యీ అమాయకపుమాటే యితనికి పెరమనెంటు పేరైంది. ఫదుగురాడుమాట, పాటయైధరచెల్లు అన్నట్లు ధృవమైనది. వాస్తవంగా, తనజీవితం, తన భార్యా బిడ్డలజీవితం, దైవాధీనంమీదనే నిర్వహిస్తూవుండేవాడు.

అన్న, దమ్ములద్వేషం అనాదిసిద్ధమైయుంది. స్తుతిపాగడ్తలకువశమై రాజుకు అతను గుండెకాయలా ప్రవర్తిస్తూవుండేవాడు. రాజదర్బారులో అతనికి పలుకుబడి ఎక్కువ. ఎవరు ఏప్రశ్నవేశినా (రాజాధీనం) అంటూవుండేవాడు. ఎప్పుడు యాచనకువచ్చినా రాజాధీనం జగత్సర్వం అంటూవుండేవాడు. ఒకనాడు పట్టరాని సంతోషమువచ్చి ఒక పెద్ద గుమ్మిడికాయ ప్రభువు రాజాధీనంగారికి దానంచేశాడు. లేక లేక కలిగిన పుత్రసంతానఫలప్రాప్తిచే, రాజాధీనంగారిని దగ్గరగాపిలిచి, యిది మీరూ మీభార్యామాత్రమే ఉపయోగించుకోవాలి. మిగిలిన రుచి ఏలా ఉన్నదీ మీరు నాకు చెప్పాలన్నాడు రాజుగారు. గూఢభావము ఎరుగనిమూఢుడు ఆ గుమ్మిడిపండును నెత్తినపెట్టుకుని కాలుసాగించాడు. కొంతదూరం వెళ్ళసరికి నెత్తిబరువెక్కి మోయలేక కోమటికొట్టువద్ద దింపి యీలా అన్నాడు. ఏమోయీకోమటి యీ గుమ్మిడిపండు నీవు తీసుకొని ఎత్తెడు బెల్లమియ్యి. ఆలుమగలము మేమిద్దరమే. నీవు పదిమంది బిడ్డలుకలవాడవు. అని బెల్లంతీసుకొని బయలుదేరినాడు. అమ్మయ్యా పీడ వదలింది. అంత గుమ్మిడికాయకూర మేమేలా తినగలం. రాజుకు వివేకంలేదు. మమ్మలినే తినమని రుచిచెప్పమన్నాడు. యీ ఎత్తెడు బెల్లం, పుటకేడుబూరెలు అవుతాయి. హాయిగా వారంరోజులు తినవచ్చు అని సంతోషిస్తూ యింటికివెళ్ళినాడు.

మరునాడు దైవాధీనంగారు మామూలుచొప్పున దర్బారుకు వెళ్ళినాడు. రాజుగారు ఉన్నట్లువుండి పుత్రుని జాతకం ఫలితాలు చెప్పమన్నాడు. (జ్యేష్ఠమాసం, జ్యేష్ఠనక్షత్రం, జ్యేష్ఠుడు) త్రిజ్యేష్ఠలు తండ్రి గండమండి. ముంతెడునూనె- ముద్దచిమ్మిలీ మాబోటివాండ్లకు దానంచేయండి అన్నాడు. అని వూరుకున్నాడా, అందరి దగ్గర అన్న అలవాటు చొప్పున (ఆ తరువాత దైవా

ధీనం) అని చటుకున అనేశాడు. అవివేకపురాజు ఆ అపశకునపుమాటకు, అక్కసునపడి, అతనిని దేవిడే మన్నాచేయించాడు. పాపం (దైవాధీనంగారు ఏం చేస్తారు) వాలుమొగంతో దైవవిధిని తలుచుకుంటూ యింటికి వస్తున్నాడు. దారిలో కోమటి దైవాధీనంగారి దీనభావాన్ని విమర్శించాడు. అతడు యీలా అన్నాడు ఎందుకండి దైవాధీనంగారూ, యీలా విచారిస్తారూ. యీవేళ మా తండ్రిగారి ఆబ్దీకము. మీబోటి మహానీయులు మాకు దొరకడం కష్టం. అని పీటవేసి కూర్చోపెట్టి, పళ్ళెముడు బియ్యం, గుమ్మిడిపండు, పప్పూ, ఉప్పూ, సామానుతో. పితృకార్యాన్ని నిర్వహించాడు. అల్ప సంతోషియైన ఆ విప్రుడు హాయిగా సంతోషిస్తూ, ఆవిడదగ్గరకువెళ్ళి అష్టేవతికిలబడ్డాడు, యిదిగో చూడూ యీవేళ యిది మన ప్రాప్తకాలం. కోమటి పిలిచి పీటవేశి కడుభక్తితో దానంచేశాడు. లేకపోతే యీవేళ కడుపులో ఎలుకలు గెంతులు వేయవలసినదే. కమ్మగా కూరవండి కడుపునిండా అన్నం పెట్టమన్నాడు. గంపెడు సంతోషంతో కత్తిపీట.ముందువేసుకొని గుమ్మిడికాయను ప్రయోగించింది. గలగలమన్నది ఏమిటో, గడుసుబుర్ర కసుకగంపమూతపెట్టి. గబగబా బయటికివచ్చి, ఏమండోయి, ఏమండోయి, యీలారండీ. యీలారండీ అన్నది. దైవాధీనంగారు ఏదో గలిభీవచ్చిందని కడుపు తడుము కొంటూ లోపలికి వెళ్ళినాడు. తలుపులు మూతలుబడ్డాయి.

యింట్లో గుసగుసలు. ప్రాప్తకాలమంటే యిదేనే, పడి దిగకపోయినా పాదాలమీద వాలుతుంది. యిదంతా దైవాధీనం అన్నాడు పూరిల్లు, పెంకుటిల్లైంది. పేద ముత్తైదుబ గారు బొమ్మైంది. ప్రభువుగారి దేవిడీలో ప్రజ్ఞలను పొగడడానికి వెళ్ళిన రాజాధీనంగారిని రాజ ప్రాంగణాలకు రానీలులేదన్నారు. ఊరుకున్నవాడు వూరుకోక ప్రభువువారి ప్రాపకం యింకా సంపాదించాలని, అయ్యా, ఆ గుమ్మడికాయరుచి ఏమనిచెప్పనూ, ఏదేశం నుండి తెప్పించారో కానీ యీసంతైనా బెల్లం వెయ్య నక్కరలేకపోయిందన్నాడు. ఔరా ఎంత చిత్రం, ఎవరిది ఎవరికి ప్రాప్తమో అని ఆశ్చర్యపడి, అంతా దైవాధీనంకదా అనుకున్నాడు. దైవాధీనంగారికి అగ్రస్థానమిచ్చాడు. కోమటి హృదయం గుజగుజలాడింది. అతని అమాయకపుమాటే ఆదర్శప్రాయముయింది. . మానవ జీవితాలు, దైవాధీనాలు, ప్రయత్నాలు నిమిత్తమాత్రాలు. కథకంచికి వెడితే మనమింటికి వచ్చాము.

రూలంటే రూలే!

"లీల"

నెపోలియన్ పేరు వినని వారుండరు. అతను ఒక రోజు ఆల్ప్స పర్వతాలలో తన సైన్యంతో మజిలీవేశ్వాడు. ఆయన కొన్ని కఠినమైన నిబంధనలను చేశాడు. రాత్రి పదిదాటిన తరువాత సైనికులందరు దీపాలార్పివేసి పడుకోవాలి. ఎవరు మేలుకోగూడదు. ఒకవేళ ఎవరైనామేలుకొన్నా మర్నాడు అతను కఠినశిక్షకు పాత్రుడవలసిందే నెపోలియన్ ప్రతిరోజూ పదిదాటిన తరువాత సైన్య శిబిరాలన్నీ తిరిగేవాడు అతను నిద్రపోయేది బహు స్వల్ప కాలము.

జాన్ ఒక సైనికుడు. అతని స్వదేశం అరేబియా. మూడేళ్ళకిందట సైన్యంలో ప్రవేశించాడు. అతనికి ఒక ముసలి తల్లి తప్ప నాఅనేవారెవరూలేరు. మూడేళ్ళనుండి ఆమెకు ఒక ఉత్తరం వ్రాశేదానికి కూడ వీలుపడలేదు జాన్ ఆరోజు ఎలాగైనా సరే ఆమెకు ఒక ఉత్తరం వ్రాయాలను కొన్నాడు పగలంతా పనిలోనే గడచిపోయింది.

రాత్రి పదవుతుంది. జాన్ ఒక పెద్ద ఫిరంగిచాటున కూర్చొని, ఒక కిరసనాయిలుబుడ్డి వెలుగులో తల్లికి గబగబ ఉత్తరం వ్రాయసాగాడు. నెపోలియన్ దీపాన్నిచూచి గబగబ వచ్చాడు. జాన్ గడగడ వణికిపోయాడు. "ఏం చేస్తున్నావ్" గర్జించాడు నెపోలియన్. "మా అమ్మకు రెండేళ్ళనుండి ఉత్తరం వ్రాయలేదండి. ఇప్పుడు వ్రాస్తున్నాను" భయపడుతూ చెప్పాడు జాన్.

"రూలు నతిక్రమించావని తెలుసా ! "చిత్తం"

"సరే ! ఇదే ఆఖరు ఉత్తరం అనివ్రాసి ఉత్తరాన్ని పూర్తి చేయ్ ! "

జాన్ ఆ విధంగానే పూర్తి చేశాడు.

మర్నాడు జాన్‌ను ఒక స్థంభానికి కట్టివేశాడు. "షూట్ ! " అన్నాడు నెపోలియన్. అంతే ! మరో నిముషంలో తుపాకిగుండ్లు జాన్ హృదయాన్ని చీల్చుకొని వెళ్ళాయ్ !

అన్ని నొప్పులకు

అమృతాంజనము

60

సంవత్సరముల
సేవచే
పేరొందినది!



అమృతాంజన్ లిమిటెడ్

మద్రాసు
బొంబాయి
కలకత్తా



"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

మే 1956

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
•	•	1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31	•	•

15. శంకర జయంతి 22. గోదావరి పుష్కరం 24. బుద్ధ పూర్ణిమ (చంద్ర గ్రహణం,)

ANDHRA MAHILA SABHA

MYLAPORE : : MADRAS 4.

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A., at the Andhra Mahila Press, Mylapore, Madras 4.